Dwaraka

మంగళవారం
23•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 226
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD


హైదరాబాద్‌లోని ఐఐసీటీ

క్యాన్సర్ నివారణకు స్వదేశీ మందు!

సుమారు నాల్గో వంతు ధరకే ఔషధం లభ్యం

- ఐఐసీటీ టెక్నాలజీతో ఎరిబ్యులిన్ ఉత్పత్తి
- చివరి దశకు చేరిన పరిశోధన, అభివృద్ధి
- ఆగస్టులో ఐఐసీటీ ప్లాటినం జూబ్లీ సందర్భంగా శాంపిల్?
- వచ్చే జనవరిలోగా వాణిజ్యపరంగా అందుబాటులోకి
- క్యాన్సర్ చికిత్సలో భారీగా తగ్గనున్న ఖర్చు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రాణాంతక మహమ్మారి క్యాన్సర్‌ను దేశీయంగా తయారు చేసిన ఔషధంతో ఎదుర్కొనేందుకు హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) చేస్తున్న పరిశోధన చివరిదశకు చేరింది. క్యాన్సర్ నివారణలో వినియోగిస్తున్న అత్యంత ఖరీదైన 'ఎరిబ్యులిన్' డ్రగ్‌ను దేశీయంగా తయారుచేసి, అగ్గువకే అందుబాటులోకి తెచ్చేందుకు ఐఐసీటీ కృషిచేస్తున్నది. 1944, ఆగస్టు 5న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఐఐసీటీ 75 సంవత్సరాలు పూర్తిచేసుకోనుంది. ఈ ఏడాదిలో ప్లాటినంజూబ్లీ వేడుకలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఈ ఆగస్టు ఐదో తేదీన డ్రగ్ శాంపిల్ విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒప్పందం

మిగతా 11వ పేజీలో


స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో మంచు కమ్మిన ఓ భవనంపై పహారా కాస్తున్న సాయుధ పోలీసు

చీలిన పుడమికి చికిత్స!

దావోస్‌లో నేటినుంచి డబ్ల్యూఈఎఫ్ సమావేశాలు

ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైన ప్రపంచ దేశాలను ఒక్కటి చేసేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ద్వారా ప్రయత్నాలు జరుగనున్నాయి. మంగళవారం నుంచి ఐదురోజుల పాటు జరుగనున్న ఈ సదస్సుకు రాజకీయ, కళలు, వాణిజ్య, విద్యా రంగాలకు చెందిన మూడువేల మందికిపైగా ప్రముఖులు హాజరవుతున్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో 130 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. మొదటి రోజు జరుగనున్న ప్లీనరీలో ప్రధాని ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సుకు స్విస్ ప్రభుత్వం ఐదువేలమంది సైనికులతో భద్రతను ఏర్పాటు చేసింది. వివరాలు 5వ పేజీలో

ఎన్నారైలే మా బ్రాండ్ అంబాసిడర్లు

తెలంగాణ రాష్ట్ర ప్రగతిని
దశదిశలా చాటాలి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వంతో అనుసంధానం చేయాలి
- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలి
- కేసీఆర్ విజన్‌కు పలు రాష్ట్రాలు, కేంద్రం నుంచి అభినందనలు
- జ్యూరిచ్‌లో ఎన్నారైలతో ముఖాముఖిలో కేటీఆర్
- ప్రభుత్వ పథకాలు.. అమలును వివరించిన మంత్రి

హైదరాబాద్,నమస్తేతెలంగాణ:

తెలంగాణ ఏర్పాటునాటి అయోమయ పరిస్థితి నుంచి తమ ప్రభుత్వం అద్భుతమైన ప్రగతిదిశగా రాష్ట్రాన్ని తీసుకుపోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావు చెప్పారు. బంగారు తెలంగాణ కల సాకారంలో ప్రవాస తెలంగాణవాసులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గత నాలుగేండ్లలో సాధించిన అద్భుతమైన ప్రగతిని ఎన్నారైలు దశదిశలా చాటాలని కోరారు. ప్రతి తెలంగాణ ప్రవాస భారతీయుడు రాష్ట్రానికి ఒక గుడ్‌విల్ అంబాసిడర్, బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రాన్ని ఇతర దేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పరిచయం చేసేందుకు, ఆసక్తిగల పారిశ్రామికవేత్తలను తెలంగాణ ప్రభుత్వంతో అనుసంధానం చేసేందుకు ఎన్నారై మిత్రులు కలిసి రావాలని విజ్ఞప్తిచేశారు. నాడు తెలంగాణ ఉద్యమంలో, నేడు సొంత రాష్ట్రంలో ఎన్నారైలది కీలక పాత్ర అని చెప్పారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో జరుగుతున్న

మిగతా 2వ పేజీలో


స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరంలో సోమవారం తెలంగాణ ఎన్నారైలు ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు

సంపద అంతా సంపన్నుల వద్దే!

- ఒక్క శాతం ధనికుల వద్ద 73 శాతం సంపద
- ఏడాదిలో 20 లక్షల కోట్లు పెరిగిన ధనికుల సంపద
- పేదల సంపాదన పెరుగుదల ఒక్కశాతమే
- ఆక్స్‌ఫాం నివేదికలో వెల్లడి
- ఇది ఆర్థికాభివృద్ధి కాదు.. విఫల ఆర్థిక వ్యవస్థకు నిదర్శనమని వ్యాఖ్య

దావోస్, జనవరి 22:



భారత్‌లో జరుగుతున్న సంపద సృష్టిలో అత్యధిక భాగం ధనికుల వద్దకే చేరుతున్నదని ఓ తాజా సర్వే వెల్లడించింది. దేశంలో ధనికులు మరింత ధనికులవుతుండగా, పేదలు మరింత దుర్భర స్థితికి చేరుకుంటున్నారని తెలిపింది. ఈ అంతరం ఆర్థికాభివృద్ధి కాదని, దేశ విఫల ఆర్థిక వ్యవస్థకు నిదర్శనమని తేల్చి చెప్పింది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ప్రారంభం కావడానికి కొద్ది గంటల ముందు అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆక్స్‌ఫాం ఈ నివేదికను విడుదల చేసింది. గత ఏడాది భారత్‌లో జరిగిన సంపద సృష్టిలో 73 శాతం కేవలం ఒక్కశాతం ఉన్న సంపన్నుల వద్దకు చేరిందని ఆక్స్‌ఫాం సర్వే

మిగతా 2వ పేజీలో


కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ఏడాదిలోగా గౌరవెల్లి రిజర్వాయర్

- గత ప్రభుత్వాల హయాంలో కలగానే ప్రాజెక్టులు
- ఆ కలలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలి
- రిజర్వాయర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన మంత్రి హరీశ్

2



ఆర్అండ్‌బీలో 90 పోస్టులు

- ఏఈఈ పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ పచ్చజెండా
- నేడోరేపో అధికారికంగా ఉత్తర్వులు

3

కేసీఆర్ స్మార్ట్ సీఎం

- హార్డ్‌వర్క్ చేస్తున్నారు
- తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారు
- అందుకే ప్రజలు పట్టంగట్టారు
- ఎన్నో సవాళ్లను అధిగమిస్తున్నారు
- ఆయనను కలిసి అభినందిస్తే తప్పేమిటి?
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- కొండగట్టులో పూజలు
- సినిమాలకు గుడ్‌బై చెప్పనున్నట్టు ప్రకటన

కరీంనగర్ కార్పొరేషన్/జగిత్యాల, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హార్డ్‌వర్క్ చేస్తున్నారనీ, ఆయన స్మార్ట్ సీఎం అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కొనియాడారు. సోమవారం మధ్యాహ్నం జగిత్యాల జిల్లా కొండగట్టులో ఆయన ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం కాన్వాయ్‌తో కరీంనగర్ చేరుకుని.. సాయంత్రం శ్వేతాహోటల్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారని, అందుకే ప్రజలు పట్టంగట్టారని, దానిని అందరూ గౌరవించాలని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాతే సీఎం కేసీఆర్.. సమస్యలను తనదైన పద్ధతిలో

మిగతా 11వ పేజీలో



వర్గల్‌లో వసంతపంచమి వేడుక

సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రంలో వసంతపంచమి సందర్భంగా సోమవారం అమ్మవారి జన్మనక్షత్రమయిన మూలానక్షత్ర ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన పుస్తకపూజ, కుంకుమార్చన, చప్పన్‌భోగ్, సహస్రపారాయణాది పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

3

గ్రేటర్ ఓటర్లు 69 లక్షలు

తొలిగించిన 21.15లక్షల ఓట్లలో 17.5లక్షలు బోగస్‌వే!.. పొరపాటుగా తొలిగించినవి 3.61లక్షల ఓట్లు

- హైదరాబాద్ జిల్లాలోనే 5.82 లక్షల బోగస్ ఓటర్లు
- ఓటర్ల రీసర్వే తుదిజాబితాలో వెల్లడి
- 3.61 లక్షల ఓట్లకు తిరిగి జాబితాలో స్థానం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

ఎన్నికల సంఘం (ఈసీ) తాజా జాబితా ప్రకారం గ్రేటర్ ఓటర్లు 69,28,873 అని తేలింది. నిరుడు ముమ్మర ఓటర్ల జాబితా సవరణ (ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్) కార్యక్రమంలో భాగంగా తొలిగించిన ఓట్లలో అత్యధికం నిజంగా బోగస్‌వేనని స్పష్టమైంది. పొరపాటున తొలిగించిన ఓట్లు తిరిగి జాబితాకెక్కిస్తూ ఈసీ తాజా జాబితాను సోమవారం ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించి సుమారు 21.15 లక్షల బోగస్ ఓట్లను తొలిగించారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తడంతో గత నవంబర్‌లో తిరిగి రీసర్వే నిర్వహించగా, తొలిగించిన 21 లక్షల్లో దాదాపు 17.5 లక్షల ఓట్లు నిజంగా బోగస్‌వేనని తేలింది. మిగిలిన 3.61 లక్షల ఓట్లను పొరపాటుగా తొలిగించినట్టు గుర్తించి వారిని యథాతథంగా జాబితాలో చేర్చారు. బోగస్ ఓట్లలో హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాల్లోనే 5.82 లక్షల ఓట్లు ఉండడం విశేషం. ఈ మేరకు ఎన్నికల అధికారులు ఓటర్ల తుదిజాబితాను విడుదలచేశారు. 2017 సెప్టెంబర్‌లో నిర్వహించిన ఇంటింటి సర్వే

మిగతా 11వ పేజీలో

పది మంది కన్ఫర్డ్ ఐఏఎస్‌లు

- గెజిట్ నోట్ విడుదలచేసిన కేంద్రం
- ఉత్తర్వులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎస్‌ను కలిసిన పదోన్నతి పొందిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం 10 మంది రాష్ట్ర రెవెన్యూ అధికారులకు ఐఏఎస్‌లుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు సోమవారం నాడు కేంద్ర ప్రభుత్వం డీఓపీటీ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పదోన్నతులు కల్పిస్తూ కేంద్రం ఇచ్చిన గెజిట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో 2014 నుంచి 17 వరకు కన్ఫర్డ్ ఐఏఎస్‌లు స్థానాలు 16 ఖాళీగా ఉండగా ఇందులో 10 ఖాళీలు భర్తీ అయ్యాయి. రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారులుగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ల లిస్ట్‌లో నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సీనియర్ డిప్యూటీ కలెక్టర్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీకి పంపింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాపై కాన్ఫిడెన్షియల్ రిపోర్టును, విజిలెన్స్ రిపోర్టును తెప్పించుకొని పరిశీలించిన యూపీఎస్సీ స్ర్కీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన జాబితాను యూపీఎస్సీ ఆమోదిస్తూ కేంద్ర డీఓపీటీకి పంపింది. ఈ జాబితాను పరిశీలించిన డీఓపీటీ పదోన్నతులు కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఐఏఎస్‌లుగా పదన్నోతులు పొందిన డిప్యూటీ కలెక్టర్లు గెజిట్ విడుదల కాగానే సచివాలయానికి వచ్చి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్‌ను, డిప్యూటీ సీఎం మహమూద్ అలీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కన్ఫర్డ్ ఐఏఎస్‌లు వీరే

కొర్ర లక్ష్మి, కే ధర్మారెడ్డి, చిట్టెం లక్ష్మి, టీ వినయ్‌కుమార్‌రెడ్డి, జీహెచ్ శివలింగయ్య, వీ వెంకటేశ్వర్లు, ఎం హన్మంతరావు, డీ అమోయ్‌కుమార్, కే హైమావతి, ఎం హరిత.

అన్నదాతకు అండదండ

- రైతు బడ్జెట్‌పై అధికారుల కసరత్తు
- సేద్యానికి చేయూత మీదనే ప్రత్యేక దృష్టి
- బడ్జెట్ రూపకల్పనపై ఆర్థిక కార్యదర్శుల సమీక్ష

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వచ్చే ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్‌కు పూర్తి రూపమివ్వడానికి ఆర్థికశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో మార్పులుచేర్పులపై దృష్టి సారించారు. రాష్ట్రంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టం కోసం ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న క్రమంలో ప్రత్యేక బడ్జెట్‌కు ప్రణాళికల రూపకల్పనలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. వచ్చే 2018-19 ఆర్థికసంవత్సరం నుంచి రైతులకు వ్యవసాయ పెట్టుబడిసాయం పథకం ప్రారంభం కానున్నది. ఈ నెల నుంచే రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి రోజుకు 24 గంటల నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్న క్రమంలో వ్యవసాయరంగానికి బడ్జెట్ కేటాయింపులు పెరిగే అవకాశమున్నది. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధిక ప్రాధాన్యమిస్తున్న తీరు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నది. ఉమ్మడి రాష్ట్రంలో చితికిపోయిన రైతుల బతుకులను మెరుగుపరుచాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కొత్త పథకాలను అమలు చేస్తున్నది. రైతుల రుణమాఫీని విజయవంతంగా పూర్తిచేసిన ప్రభుత్వం ఈసారి నుంచి వ్యవసాయానికి పెట్టుబడిసాయం పథకం కింద రెండు సీజన్‌లలో ప్రతి ఎకరాకు 4 వేల రూపాయలు అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

వ్యవసాయ అనుబంధ రంగాలను పరిపుష్టం

ఈ ఏడాదితో ముగిసిన రైతుల రుణమాఫీకి యేటా రూ.4000 కోట్ల పైచిలుకు నిధులను వెచ్చించగా త్వరలో ప్రారంభమయ్యే పంట పెట్టుబడి పథకానికి అవసరమయ్యే ఖర్చుపద్దు బడ్జెట్‌లో మూడురెట్లకు పైగా పెరుగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా కోటి 42 లక్షల ఎకరాలలో వ్యవసాయం సాగవుతుండగా 71 లక్షల 70 వేల రైతులకి ఖాతాలున్నాయి. మరోవైపు వ్యవసాయరంగానికి రాష్ట్రవ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో ఆరువేల కోట్లవరకు భారం భరించాల్సి ఉందని వాటిని వ్యవసాయ బడ్జెట్‌లో చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు. గతఏడాది వ్యవసాయరంగానికి రూ.5942.97 కోట్లను కేటాయించారు. ఇక వ్యవసాయ అనుబంధ రంగాలను పరిపుష్టం చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం తోటల పెంపకం, మార్కెటింగ్‌తోపాటు నీటిపారుదల రంగానికి కేటాయింపులు భారీగా జరుపుతుందని సమాచారం.

కార్యదర్శుల కసరత్తు

అన్నిశాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు సమగ్రంగా అందిన క్రమంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ కార్యదర్శులు హాజరయ్యారు. ఈసారి ప్రతిశాఖ నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు భారీగా అందాయని, వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయం, చేయాల్సిన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రతిపాదనలకు చాలాజాగ్రత్తగా తుదిరూపం ఇవ్వాలని ఆదేశించింది. ప్రస్తుత వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం రూ.1,49,646 కోట్లుగా ప్రతిపాదించింది. ఇందులో ప్రగతి పద్దు రూ.88 వేల కోట్లు కాగా నిర్వహణ వ్యయం కింద రూ.61 వేల కోట్లను ప్రతిపాదించారు. నిర్వహణ వ్యయం కంటే ప్రగతి పద్దు ఎక్కువగా చూపడం విశేషం. వచ్చే ఏడాది కూడా ప్రగతి పద్దు సైజ్‌ను పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌తో పాటు మహిళల సంక్షేమానికి చేపడుతున్న పథకాలకు వెచ్చిస్తున్న నిధులన్నింటినీ ఒకే ఖాతా కిందకు చేర్చే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

నాలుగు పట్టణాలకు 18 కోట్లు విడుదల

మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే జలగం వెంకటరావు ధన్యవాదాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాలుగు పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల కోసం పురపాలకశాఖ రూ.18 కోట్లను కేటాయించింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ జీవో విడుదల చేశారు. దేవరకొండ, పాల్వంచ, ఇల్లందు, భైంసా పట్టణ స్థానిక సంస్థలకు రూ.18 కోట్లను మంజూరు చేశారు. ఇందులో ఇల్లందుకు రూ.3 కోట్లు కాగా మిగతా మూడు పట్టణాలకు రూ.5 కోట్ల చొప్పున కేటాయిస్తూ శాఖాపరమైన ఆదేశాలిచ్చారు. పాల్వంచ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరుచేసినందుకు మంత్రి కేటీఆర్‌కు కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావు ధన్యవాదాలు తెలిపారు.

టీజీటీ అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకోండి

టీఎస్‌పీఎస్సీ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గురుకులాలలోని టీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తమ ఆప్షన్ల ప్రక్రియను పూర్తిచేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ కోరింది. సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కోసం ఎంపికైన అభ్యర్థులు తమ సొసైటీలు, జోనల్ ప్రాథమ్యాలు ఎంచుకోవాలని గతంలోనే సూచించినప్పటికీ, కొంతమంది ఆ ప్రక్రియను పూర్తిచేయలేదని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. మంగళవారం నుంచి 25వ తేదీ వరకు అభ్యర్థులు ఆప్షన్లు ఎంచుకోవాలని సూచించింది. ఇప్పటికే ఆప్షన్లు ఇచ్చిన అభ్యర్థులు మరోమారు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

వెబ్‌సైట్లో పలుపోస్టులకు ఎంపికైనవారి వివరాలు

ములుగు అటవీ కళాశాలలోని లైబ్రేరియన్ పోస్టుల ఎంపిక జాబితాను తమ వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. కాలుష్య నియంత్రణమండలిలోని స్టెనో కం టైపిస్ట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన జాబితాను కూడా వెబ్‌సైట్లో ఉంచినట్టు ప్రకటించింది.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.03 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం షష్ఠి సాయంత్రం 4.42 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉదయం 8.09 వరకు తదుపరి రేవతి, అమృతఘడియలు: తె. 3.09 నుంచి 4.45 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.15 నుంచి సాయంత్రం 4.39 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.07 నుంచి 9.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.19 నుంచి 3.04 వరకు, వర్జ్యం: రాత్రి 8.22 నుంచి 9.58 వరకు.

లోకం పోకడ



ఏడాదిలోగా గౌరవెల్లి రిజర్వాయర్

- గత ప్రభుత్వాల హయాంలో కలగానే ప్రాజెక్టులు
- ఆ కలలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఏ సమస్య ఉన్నా.. నన్ను నేరుగా కలువొచ్చు
- ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలి
- రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు
- రిజర్వాయర్ నిర్మాణ పనులకు భూమిపూజ





సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ వినోద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు. రిజర్వాయర్ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

గత ప్రభుత్వాల హయాంలో ప్రాజెక్టుల నిర్మాణమనేది కలగానే ఉండేదని, ఈ రోజు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆ ప్రాజెక్టులను పూర్తిచేసి, ప్రజల కలలను నిజం చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సీఎం గొప్ప విజన్ ఉన్న నేత కావడంవల్లనే ప్రాజెక్టులను రీడిజైన్ చేసి, త్వరితగతిన రైతాంగానికి సాగునీరందించేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని చెప్పారు. మూడు షిఫ్టుల్లో కాళేశ్వరం పనులు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఏడాది చివరిలోగా గౌరవెల్లి రిజర్వాయర్‌ను పూర్తిచేసి, ఇక్కడి మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని హరీశ్‌రావు స్పష్టంచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణపనులకు కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి మంత్రి హరీశ్ సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతంపై సీఎం కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉన్నందునే గౌరవెల్లి సామర్థ్యం 1.04 టీఎంసీల నుంచి 8.25 టీఎంసీల సామర్థ్యానికి పెంచారని, దీనివల్ల ఈ ప్రాంతంలోని రైతులతోపాటు భూనిర్వాసితులకు మేలు చేసినట్లయిందన్నారు. వరద కాల్వ కాస్తా.. ఇప్పుడు జీవ కాల్వ కాబోతున్నదని చెప్పారు. మిడ్ మానేరు దాదాపుగా పూర్తి కావొచ్చిందని, వర్షాకాలం వరకు ఇందులో 25 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతామని అన్నారు. దీంతో గౌరవెల్లి పూర్తి కాకముందే మిడ్‌మానేరు నుంచి గ్రావిటీ ద్వారా 80 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. వీటిలో మానకొండూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాలు, హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి, కోహెడ, సైదాపూర్ మండలాల్లో 30 వేల ఎకరాలు, చొప్పదండి నియోజకవర్గంలో పది వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. లక్షా20 వేల ఎకరాలకు సాగునీరందించే గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ముంపు గ్రామాల్లో 937 కుటుంబాలుండగా 735 కుటుంబాలు భూములు ఇచ్చేందుకు సంతకాలు చేసి పరిహారం తీసుకున్నాయని, మిగతా కుటుంబాలతో మాట్లాడి భూసేకరణ పూర్తిచేస్తామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తనను స్వయంగా కలువవచ్చని లేదా స్థానిక ఎమ్మెల్యేనో, జిల్లా కలెక్టర్‌నో కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని సిద్దిపేట కాటన్ మార్కెట్ యార్డులో డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం రాత్రి కాళేశ్వరం ప్రాజెక్టులైన అనంతగిరి, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల పనుల పురోగతిపై సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు.

ప్రాజెక్టుల పనితీరు భేష్: చాడ వెంకట్‌రెడ్డి



ప్రభుత్వం రైతాంగానికి సాగు నీరందించాలనే సంకల్పంతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనితీరు బాగుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్‌లో శాశ్వత కరువు నివారణ కోసం గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్ల పనులు తిరిగి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ అనిల్‌కుమార్, ఆర్డీవో శంకర్‌కుమార్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, పెరియాల రవీందర్‌రావు, ఎంపీపీ భూక్యా మంగ, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

దశదిశలా చాటాలి



స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరంలో తెలంగాణ ఎన్నారైల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, టీఆర్ఎస్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు మహేశ్ బిగాల, రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

మొదటిపేజీ తరువాయి...

ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రి కేటీఆర్.. ఈ సందర్భంగా జ్యూరిచ్ నగరంలో సోమవారం తెలంగాణ ఎన్నారైలు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పాలసీలు, వాటి అమలువంటి అంశాలతోపాటు.. రాష్ట్ర రాజకీయాల గురించి మంత్రి మాట్లాడారు. దశాబ్దంన్నర క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు కూడా ఇంకా పూర్తిగా కుదురుకోని పరిస్థితుల్లో ఉంటే, తెలంగాణ రాష్ట్రం మాత్రం మూడున్నర ఏండ్లలోనే అనేక రంగాల్లో దేశంలోనే ఆదర్శవంతమైన విధానాలతో ముందుకు పోతున్నదని చెప్పారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన లక్ష్యాల సాధన దిశగా ప్రయాణం మొదలైందని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణ సాధిస్తామని మంత్రి ఉద్ఘాటించారు. మొదట్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వారే ప్రస్తుతం అభినందిస్తున్న పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. తమ వద్ద కూడా టీఆర్ఎస్‌ను స్థాపించాలంటూ పొరుగు రాష్ట్ర ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయంటేనే తెలంగాణలో పాలన ఎంత జనరంజకంగా సాగుతున్నదో అర్థమవుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ విజన్‌కు కేంద్ర ప్రభుత్వంతోపాటు పలు రాష్ట్రాల నుంచి కూడా అభినందనలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు.

తెలంగాణ ప్రజల కరంట్ కష్టాలు తొలిగాయి: కేటీఆర్

రాష్ట్రం విడిపోతే కరంటు సమస్యలు వస్తాయన్న ఆనాటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాటలను మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. 'రాష్ట్రం వచ్చిన తరువాత తెలంగాణ ప్రజలకు పవర్ కష్టాలు తొలిగిపోయాయి. కానీ కాంగ్రెస్‌కు మాత్రం పవర్ పోయింది' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోనే కాదు దేశంలోనే మొత్తం కాంగ్రెస్ పార్టీకి పవర్ పోతున్నదని, అందుకే రైతాంగానికి ఇస్తున్న 24 గంటల కరంట్ సరఫరాను సైతం ఆ పార్టీ రాజకీయం చేస్తున్నదని మంత్రి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం తన పరిపాలనలో ప్రజల కనీస అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. రాష్ట్రం అంతటా తాగు, సాగు నీరు కల్పనకే ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రజల కనీస అవసరాలైన రోడ్లు, ఫుట్‌పాత్‌లు, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అంశాలపైన దృష్టిసారించినట్లు మంత్రి తెలిపారు. ప్రసంగం అనంతరం ఎన్నారైలు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి ఓపికగా సమాధానాలు చెప్పారు. ప్రభుత్వ దవాఖానలు, ప్రభుత్వ స్కూళ్లను చక్కదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఎన్నారైలు తెలంగాణలో భూములను ధైర్యంగా కొనవచ్చని చెప్తూ.. భూరికార్డులను ప్రక్షాళనచేసి, అన్నీ ఆన్‌లైన్‌లోకి తెస్తున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు. చెరువుల పునరుద్ధరణ, హైదరాబాద్ నగరంలో మెరుగుపడిన శాంతిభద్రతలు, వాతావరణ కాలుష్య నియంత్రణ చర్యలు, క్రీడల అభివృద్ధి మొదలయిన అంశాలపైనా కేటీఆర్ వివరించారు. హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలోనే ప్రజల ఆకాంక్షలను తెలుసుకున్న గులాబీ దళపతి కేసీఆర్ నాయకత్వంలో ఆదర్శప్రాయంగా ముందుకు సాగుతున్నామన్నారు. గత రెండేండ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ప్రజల నాడి తెలిసిన మంత్రి కేటీఆర్ మార్గదర్శనంలో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. ఇప్పటికే అనేక కార్యక్రమాలకు దగ్గరుండి రూపకల్పన చేసి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వివరించారు. నగరాభివృద్ధికి ఎన్నారైలు చేసే సూచనలు, సలహాలు తీసుకునేందుకు అందుబాటులో ఉంటామన్నారు. జ్యూరిచ్ నగరంలోని శ్రీధర్ గండె, అల్లు కృష్ణారెడ్డి, అనిల్ జాలా, కిశోర్ తాటికొండ తదితరులు ఈ సమావేశాన్ని నిర్వహించారు. స్వీడన్, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్ దేశాల నుంచి తెలుగువారు ఈ సమావేశానికి హాజరయ్యారు.



సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్. చిత్రంలో కొరియా గౌరవ కాన్సుల్ జనరల్ చుక్కపల్లి సురేశ్, మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు కొరియా, జపాన్ ఆసక్తి

- మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రెండుదేశాల పర్యటన విజయవంతం
- మెట్రో రెండోదశకు జైకా ఇతర సంస్థల ఆర్థికసాయానికి వినతి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ వివేక్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ఆధ్వర్యంలో జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో జరిపిన పర్యటన విజయవంతమైందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్ చెప్పారు. ఇరుదేశాల్లోని పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబర్చారని ఆయన తెలిపారు. తెలంగాణలో కొరియా గౌరవ కాన్సుల్ జనరల్ చుక్కపల్లి సురేశ్, మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి సోమవారం సచివాలయంలో రెండుదేశాల పర్యటన విశేషాలను మీడియాకు వివరించారు. ఇండియాలో పెట్టుబడులు పెట్టడానికి ఆ దేశాల్లోని పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా ఉన్నారని, ఏ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనే దానిపై వారు అన్వేషిస్తున్నారని చెప్పారు. ఈ సమయంలో మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై వారికి వివరించడంతో మనరాష్ట్రం వైపు మొగ్గు చూపారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సులభ వాణిజ్య విధానంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, టీఎస్ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే అనుమతులు ఇచ్చే విధానంపై పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపారని చెప్పారు. కేటీఆర్ ప్రసంగం అక్కడి పారిశ్రామికవేత్తలను ఎంతగానో ఆకట్టుకున్నదని తెలిపారు. కొరియాలోని టెక్స్‌టైల్ పరిశ్రమకు చెందినవారు వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చారని, యంగ్-వన్ సంస్థ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందని వివరించారు. యంగ్-వన్ సంస్థకు అనుమతులపై మంత్రి కేటీఆర్ సీఎం కేసీఆర్‌తో మాట్లాడారని చెప్పారు. యంగ్-వన్ సంస్థ హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేయాలనుకుంటున్న విషయాన్ని బృందానికి తెలిపారని వెల్లడించారు. జపాన్ దేశంతో రెండు ఎంవోయూలు చేసుకున్నామని, బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకకుండా పరిశోధన సంస్థ ఏర్పాటుకు జపాన్ ముందుకొచ్చిందని తెలిపారు.

కొరియా విద్యార్థులకు ఇంగ్లిషులో శిక్షణ

తెలంగాణలో కొరియా గౌరవ కాన్సుల్ జనరల్ సురేశ్ చుక్కపల్లి మాట్లాడుతూ పెట్టుబడులే కాకుండా ఇరుదేశాల మధ్య సంస్కృతి, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటానికి మానవ సంబంధాలపైనే దృష్టి పెట్టామన్నారు. కొరియా వారికి ఇంగ్లిషులో శిక్షణ ఇవ్వాలని వారు కోరారని, మంత్రి కేటీఆర్ వెంటనే స్పందించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీతో మాట్లాడి శిక్షణకు ఒప్పించారని చెప్పారు త్వరలోనే వారు రాష్ట్రానికి వచ్చి ఒపందాలు చేసుకుంటారని తెలిపారు. కొరియాలోని ప్రముఖ ఫార్మా కంపెనీ 350 మిలియన్‌డాలర్ల పెట్టుబడితో విస్తరణకు సిద్ధంగా ఉన్నదని, ఇక్కడి ఫార్మాసిటీ గురించి వివరించడంతో ఒకటిరెండు నెలల్లో రాష్ట్రానికి వచ్చి పరిశీలిస్తామని చెప్పారని పేర్కొన్నారు. వీటితోపాటు పలు కంపెనీల ప్రతినిధులు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పర్యటిస్తారని తెలిపారు. మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో ఫేజ్ -2ను చేపట్టేందుకు ఆర్థికసాయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో జైకా సంస్థతో చర్చలు జరిపామని చెప్పారు. మంత్రి కేటీఆర్ ఇక్కడి మెట్రో ప్రాజెక్టు గురించి సవివరంగా తెలిపారని, జపాన్, కొరియా దేశాల దగ్గర రూ.80 వేల లక్షల కోట్ల డబ్బు పెట్టుబడు లు పెట్టేందుకు అందుబాటులో ఉందని చెప్పారు. జైకా సంస్థ ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రోలకు ఆర్థికసాయం అందించిందని వివరించారు. జెబిక్, జెట్రో లాంటి సంస్థలతోనూ, సీజోవోక బ్యాంకుతోనూ చర్చించామని చెప్పారు.

సంపద అంతా సంపన్నుల వద్దే!

మొదటిపేజీ తరువాయి...

తెలిపింది. ఇక దేశంలో సగ భాగంగా ఉన్న 67 కోట్ల మంది పేదల సంపద గత ఏడాది కేవలం ఒక్క శాతం మాత్రమే పెరిగినట్టు వెల్లడించింది. దేశంలో ఆదాయ అసమానతలు భారీగా పెరిగిపోతున్నాయనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొంది. ఇక ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా జరిగిన సంపద సృష్టిలో 82 శాతం మొత్తం కేవలం ఒక్క శాతంగా ఉన్న ధనికుల వద్దకే చేరింది. పది దేశాలలో 70వేల మందిని సర్వే చేసి ఈ నివేదికను రూపొందించినట్టు ఆక్స్‌ఫాం తెలిపింది. తాము సర్వే చేసిన వారిలో మూడింట రెండువంతుల మంది ధనిక, పేదల మధ్య వ్యత్యాసాన్ని వెంటనే తగ్గించాలని కోరుకున్నారని పేర్కొంది. దేశ ఆర్థిక వ్యవస్థ కేవలం కొందరు ధనికుల కోసం కాకుండా అందరికోసం పనిచేసేలా చూడాలని ఆక్స్‌ఫాం భారత ప్రభుత్వానికి సూచించింది. ఎక్కువమంది కార్మికులు పనిచేసే రంగాలను ప్రోత్సహించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని సాధించాలని తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. వ్యవసాయంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ప్రభుత్వం ప్రకటించిన సామాజిక పరిరక్షణ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించింది. అత్యంత సంపన్నులపై అధిక పన్నుల భారం వేయాలని, పన్ను ఎగవేతలపై కఠినచర్యలు తీసుకోవాలని తెలిపింది. దేశ ఆర్థికాభివృద్ధి ఫలాలు కేవలం కొంతమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటం ఆందోళనకరమని ఆక్స్‌ఫాం భారత విభాగం సీఈవో నిషా అగర్వాల్ పేర్కొన్నారు. దేశంలో సంపన్నులు మరింత సంపదను పోగుచేసుకోవడం ఆర్థికాభివృద్ధి కాదని, ఇది విఫల ఆర్థిక వ్యవస్థ లక్షణమని వ్యాఖ్యానించారు. దేశం కోసం ఆహారాన్ని ఉత్పత్తి చేస్తూ, మౌలిక సదుపాయాలను నిర్మిస్తూ, పరిశ్రమల్లో శ్రమిస్తున్న వారు తమ పిల్లల విద్యకు, కుటుంబ సభ్యుల ఔషధాల కొనుగోలుకు, రెండు పూటల తిండికి నానా తంటాలు పడుతున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న అసమానతలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయని, అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రోత్సహిస్తాయని ఆమె హెచ్చరించారు. 'రివార్డ్ వర్క్, నాట్ వెల్త్' శీర్షికన విడుదలైన ఈ నివేదికపై ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో సమగ్రంగా చర్చించే అవకాశం ఉంది. ప్రపంచ అధినేతలు ఆర్థిక, లింగ అసమానతల గురించి కూడా మాట్లాడనున్నారు.

ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం



82%	370	73%
గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా జరిగిన సంపద సృష్టిలో 82 శాతం మొత్తం కేవలం ఒక్క శాతంగా ఉన్న ధనికుల వద్దకే చేరింది.	ప్రపంచవ్యాప్తంగా 370 కోట్ల మంది ప్రజల సంపాదన ఏమాత్రం పెరుగలేదు.	గత ఏడాది భారత్‌లో జరిగిన సంపద సృష్టిలో 58 శాతం మొత్తం ఒక్క శాతం ధనికుల వద్దకు చేరింది. కాగా ఈ ఏడాది అది 73 శాతానికి పెరిగింది.

4.89 దేశంలో ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల సంపద 2017లో 20.9 లక్షల కోట్లు పెరిగింది. ఇది 2017-18లో భారత ప్రభుత్వ బడ్జెట్ వ్యయానికి సమానం. 2016లో వారి సంపద 4.89 లక్షల కోట్లు మాత్రమే.

గత ఏడాది కోటీశ్వరుల సంఖ్య అసాధారణ స్థాయిలో పెరిగింది. దాదాపు ప్రతిరెండు రోజులకు ఒకరు కోటీశ్వరుడయ్యారు.

భారత్‌లో గత ఏడాది కొత్తగా 17 మంది సంపన్నుల జాబితాలో చేరారు. దీంతో దేశంలోని మొత్తం సంపన్నుల సంఖ్య 101 మందికి చేరింది.

ప్రతి పదిమంది కోటీశ్వరులలో మహిళ ఒక్కరే కాగా, వీరిలో నలుగురు వారసత్వంగా సంపన్నులయ్యారు.

కోటీశ్వరుల సంపద 2010 నుంచి ఏడాదికి 13 శాతం చొప్పున పెరిగింది. ఇది సాధారణ ఉద్యోగుల వేతన పెరుగుదల కంటే ఆరురెట్లు అధికం. సాధారణ ఉద్యోగుల వేతనం ఏడాదికి సగటున రెండు శాతం మాత్రమే పెరిగింది.

భారత్‌లో, ఓ వస్త్ర సంస్థలో అత్యధిక వేతనం తీసుకొనే ఉద్యోగి ఒక ఏడాదిలో సంపాదించే మొత్తాన్ని గ్రామీణ ప్రాంతంలో కనీస వేతనంపై పనిచేసే కార్మికుడు సంపాదించాలంటే 941 సంవత్సరాలు పడుతుంది.

అదే అమెరికాలో అయితే, ఓ సాధారణ ఉద్యోగి ఏడాది మొత్తంలో సంపాదించే మొత్తాన్ని ఓ ప్రముఖ సంస్థ సీఈవో ఒక్కరోజులోనే సంపాదించగలడు.

మేడారంలో ఆదివాసీ మ్యూజియం

భావితరాలకు చరిత్ర తెలిసేలా ఏర్పాటు • నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం కడియం


మేడారంలో నిర్మించిన ఆదివాసీ మ్యూజియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమ్మక్క సారలమ్మ చరిత్రతోపాటు గిరిజనులు, ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరానికి కండ్లకు కట్టేలా గిరిజన సంక్షేమశాఖ మేడారంలో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేసింది. ఈ మ్యూజియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. సమ్మక్క సారలమ్మ ఆదివాసీ మ్యూజియం నిర్మాణానికి తెలంగాణ సర్కారు రెండేండ్ల క్రితమే ఐదెకరాల స్థలం కేటాయించింది. ఈ నెలాఖరున మేడారం మహాజాతరను పురస్కరించుకొని ఆదివాసీ మ్యూజియాన్ని మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు చందూలాల్, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా మేడారం జాతర ప్రారంభానికి ముందే మ్యూజియాన్ని సిద్ధంచేశామని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ద్యావనపల్లి సత్యనారాయణ తెలిపారు.

సమ్మక్క సారలమ్మ చరిత్రపై శిల్పాలు

సమ్మక్క సారలమ్మలు క్రీ.శ.12వ శతాబ్దంలో జీవించినట్టు చరిత్ర చెప్తున్నది. ఆనాటి పరిస్థితులు, సంస్కృతి, సామాజిక, ఆర్థికస్థితి తదితర అంశాలు ప్రతిబింబించేలా 15 కోయ గ్రామాల్లో సేకరించిన కళాకృతులను మ్యూజియంలో ఏర్పాటుచేశారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ చరిత్ర సులభంగా అర్థమయ్యేలా శిల్పరూప ప్రదర్శనలున్నాయి. రాతి యుగం, రాక్షసగుళ్ల యుగంనాటి గుహ చిత్రాలను కూడా మ్యూజియంలో చూడొచ్చు. కోయ, గిరిజన సంస్కృతులను తెలిపే 30 ఫొటోలను మ్యూజియం గోడలపై ఏర్పాటుచేశారు. జాతర వైభవం, నిర్వహణ, భక్తుల నమ్మకాలు, ఆచార వ్యవహారాలు, కోయల నృత్య విశేషాలకు సంబంధించి 25 నిమిషాల నిడివి ఉన్న వీడియోను కూడా మ్యూజియంలో ప్రదర్శిస్తారు.


ఆదివాసీ జీవన విధానంపై బొమ్మల ప్రదర్శన



భక్తజన సంద్రం.. బాసర క్షేత్రం

బాసర : చదువుల తల్లి బాసర సరస్వతీ క్షేత్రం భక్తజన సంద్రమైంది. సోమవారం వసంత పంచమి (శ్రీపంచమి) వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా మాఘశుద్ధ పంచమి రోజున అమ్మవారి జన్మదినాన్ని సందర్భంగా తెల్లవారుజామున 2గంటల నుంచే ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సరస్వతీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అక్షరాభ్యాసాలు, ప్రత్యేక పూజలతో ఆలయం కిటకిటలాడింది. సోమవారం ఒక్కరోజే సుమారు 95 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.3,150 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారన్నారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మనుమరాలు అన్యా, ఎంపీ జితేందర్‌రెడ్డి మనుమడు నిహాన్‌రెడ్డిలకు బాసర పుణ్యక్షేత్రంలో అక్షర శ్రీకారం చేయించారు.

తెలంగాణ ఏర్పడ్డాక వ్యాపారం భేష్

మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య



ఎల్బీనగర్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో వ్యాపారరంగం మరింత విస్తరించిందని మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అన్నారు. సోమవారం దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలో ఒక షోరూంను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వ్యాపారం తగ్గుతుందని ఆందోళన చెందారని.. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు.

ఆర్ అండ్ బీలో 90 పోస్టులు

ఏఈఈ పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ పచ్చజెండా

నేడోరేపో అధికారికంగా ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్లు, భవనాల శాఖలో 90 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం తెలిపినట్టు సమాచారం. ఏఈఈ పోస్టులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఫైల్‌ను ముఖ్యమంత్రి ఆమోదానికి పంపినట్టు తెలిసింది. నేడోరేపో అధికారికంగా ఉత్తర్వులు వెలువడుతాయని అధికారులంటున్నారు.

మొదలైన పులుల గణన

- కవ్వాల్‌లో మంత్రి జోగు రామన్న టైగర్ వాక్
- రాష్ట్రవ్యాప్తంగా 3వేల బీట్లలో లెక్కింపు

హైదరాబాద్/ కడెం/ ఉట్నూర్/ అచ్చంపేట, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా జంతుగణన మొదలైంది. రాష్ట్రంలో దాదాపు మూడువేల ఫారెస్ట్ బీట్లలో పులులు, ఇతర జంతువుల లెక్కింపునకు సోమవారం సర్వే మొదలైంది. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి 29 వరకు కొనసాగనున్నది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ) వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన మార్గదర్శకాలను అనుసరించి పులుల లెక్కింపు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బందితోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దాదాపు 5వేల మంది వరకు పాలుపంచుకుంటున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఫారెస్ట్ బీట్‌లో మొదటి మూడురోజులు పెద్దపులులు, చిరుత, అడవి కుక్క, తోడేలు, హైనా, ఎలుగుబంటి, అడవి పిల్లి వంటి వాటి గణన కోసం దాదాపు 5 కిలోమీటర్ల వరకు కార్నివోరస్ వాక్ నిర్వహిస్తున్నారు.


సోమవారం నిర్మల్ జిల్లా రాంపూర్ అటవీ ప్రాంతంలో చెట్లపై జంతువుల పాద ముద్రల గురించి మంత్రి జోగు రామన్నకు వివరిస్తున్న అటవీశాఖాధికారులు

పూర్తి వివరాలు నమోదు చేయండి: మంత్రి జోగు రామన్న

జంతుగణన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి, పూర్తి వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగు రామన్న ఆదేశించారు. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని సరిహద్దు గ్రామాలైన కొలాంగూడ, రాంపూర్, కడెం మండలంలోని ఉడుంపూర్ రేంజ్ అల్లంపల్లిలో కాలినడకన పర్యటించి జంతుగణనను ప్రారంభించారు. దట్టమైన అడవిలో ఆరు కిలోమీటర్ల వరకు టైగర్ వాక్ నిర్వహించారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 713 బీట్స్ ఉన్నాయన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ నుంచి గిరిజనులు ఎవరైనా బయటి ప్రాంతాలకు రావాలని ఆసక్తి చూపిస్తే వారికి పునరావాసం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరోవైపు నల్లమల అటవీ ప్రాంతంలోని 8 రేంజ్‌లలో 214 బీట్లను ఏర్పాటు చేసి, 428 మంది సిబ్బందితో జంతుగణన చేపడుతున్నట్టు డీఎఫ్‌వో జోజి చెప్పారు.



5న టెన్త్ విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా టెన్త్ విద్యార్థులలో దాగిఉన్న శక్తిసామర్థ్యాలను గ్రహించేందుకు ఫిబ్రవరి 5న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్ష నిర్వహణకు ఎస్సీఈఆర్టీ సన్నాహాలు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవా రం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ డీఈవోలతో సమావేశమయ్యారు. ఎన్‌ఏఎస్ సర్వేపై కేంద్రం చేసిన మార్గదర్శకాలను డీఈవోలకు వివరించారు. ప్రతి జిల్లాలో 80 పాఠశాలలు, ఒక్కోపాఠశాల నుంచి 45 మంది విద్యార్థులపై నమూనా సర్వే కోసం ఈ పరీక్ష నిర్వహించనున్నామని కిషన్ తెలిపారు. కార్యక్రమంలో 31 జిల్లాల డీఈవోలు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బీ శేషుకుమారి, విద్యాశాఖ అదనపు డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి

గవర్నర్‌పై ఆరోపణలు తగవు.. కాళేశ్వరం సందర్శించి.. ఆయన ఉన్నమాటే చెప్పారు

టీఆర్‌ఎస్ కార్యదర్శి గట్టు, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి


తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యాంగపరమైన పదవిలో ఉన్న గవర్నర్‌పైన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారీతిన ఆరోపణలు చేయడాన్ని టీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ నాయకులు తమ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ప్రస్తుత గవర్నర్.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నియమితులయ్యారనే విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తించాలని టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన గవర్నర్ ఉన్నవిషయమే చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి చేరిన తర్వాత ఆధిపత్యపోరు పెరిగిందని, మరొకరిని తిట్టడం ద్వారా పార్టీలో ఎదుగాలని చూస్తున్నారని విమర్శించారు. గవర్నర్ తెలంగాణ ప్రభుత్వాన్ని పొగిడారు కానీ టీఆర్‌ఎస్ పార్టీని కాదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు 20 నెలల్లో పూర్తిచేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారని, పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పే సత్తా మీకు ఉందా అని ప్రశ్నించారు. 1956కు ముందే హైదరాబాద్ మిగులు బడ్జెట్‌తో కూడిన రాష్ట్రమనే విషయాన్ని చంద్రబాబు గుర్తుచేసుకోవాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రం ఏపీతో కలువకపోయి ఉంటే అభివృద్ధిలో ఎంతో ముందుండేదని, పోలికకు అవకాశమే ఉండేది కాదని ఆయన చెప్పారు. అరువై ఏండ్లలో తెలంగాణను ఎంతగానో దోచుకున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.

ప్రగతి నిరోధకంగా కాంగ్రెస్

మూడేండ్లుగా ఎడమకాల్వ కింద సాగునీరు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే

విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి • టీఆర్‌ఎస్‌లో చేరిన నిడమనూరు ఎంపీపీ నరసింహ


సోమవారం తెలంగాణభవన్‌లో నల్లగొండ జిల్లా నిడమనూరు కాంగ్రెస్ ఎంపీపీ దాసరి నరసింహకు గులాబీ కండువా కప్పి టీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకుంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జునసాగర్ నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇంచార్జి నోముల నర్సింహయ్య తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ పార్టీ ప్రగతి నిరోధక పార్టీగా వ్యవహరిస్తున్నదని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధి పనులను తాము కూడా చేయొద్దన్నట్టుగా ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు మంచిగా ఉండటం కాంగ్రెస్ నాయకులకు ఇష్టంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ తీరును అర్థంచేసుకొన్న ప్రజాప్రతినిధులు, ప్రజలు టీఆర్‌ఎస్‌లో చేరడానికి బారులు తీరుతున్నారని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి చెందిన నిడమనూరు ఎంపీపీ దాసరి నరసింహతోసహా పలువురు ప్రజాప్రతినిధులు మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మూడేండ్ల నుంచి గృహ, పారిశ్రామిక, వాణిజ్యరంగాలకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని, మూడేం డ్ల నుంచి సోయి లేదు కానీ రైతాంగానికి 24 గంటల కరంట్ మొదలుపెట్టినరోజు నుంచి ప్రతిపక్ష పార్టీ నేతల కండ్లలో మంట మొదలైందని మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. ఒక కాంగ్రెస్ నాయకుడు 12 గంటలు చాలంటే, మరోనేత 9గంటలు చాలంటారు అని ధ్వజమెత్తారు. భూగర్భజలాలు అడుగంటిపోవడానికి ఏడు దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ కారణమని విమర్శించారు. డెడ్ స్టోరేజీలోనూ మూడేండ్లుగా నాగార్జునసాగర్ ఎడమకాల్వ రైతాంగానికి నీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. ప్రాజెక్టులు కడుతుంటే కాంగ్రెస్ నాయకులు దొంగ కేసులతో అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. మిషన్ భగీరథను అడ్డుకోవడానికి నిధులు రాకుండా ప్రయత్నం చేశారని చెప్పారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇంచార్జి నోముల నర్సింహయ్య, ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, టాంకాం చైర్మన్ రంగారెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, కేవీ రామారావు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్దవూర మండలం కొత్తలురు సర్పంచ్ ఒద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, సిరసనగండ్ల సర్పంచ్ పవన్‌కుమార్, నెల్లికల్ మాజీ సర్పంచ్ జఠావత్ పంతులునాయక్, త్రిపురారం మండల టీడీపీ అధ్యక్షుడు కలకుండ వెంకటేశ్వర్లు టీఆర్‌ఎస్‌లో చేరారు.

రవాణాశాఖ కార్యాలయంలో

స్వల్ప అగ్నిప్రమాదం

హైదరాబాద్: ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపకశాఖకు సమాచారమివ్వగా ఫైర్‌ఇంజిన్ వచ్చి మంటలను ఆర్పేసింది. ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదని చెప్పారు.


గవర్నర్ ఉన్నమాటంటే ఉలుకెందుకు?

- ప్రతిపనికీ అడ్డుపడటమే కాంగ్రెస్ పద్ధతి
- కాళేశ్వరం పనులను రాహుల్ చూసినా అభినందిస్తారు
- గవర్నర్ ఏ పార్టీకీ ఏజెంట్‌గా పనిచేయరు
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గవర్నర్‌పై చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షమాపణ చెప్పాలని టీఆర్‌ఎస్ శాసనసభాపక్షం డిమాండ్‌చేసింది. గవర్నర్ రబ్బరుస్టాంప్ కాదని, గతానికి భిన్నంగా జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, సందర్శిస్తూ, సమీక్షిస్తూ.. సలహాలు, సూచనలు ఇవ్వడాన్ని, చేస్తున్న పనులను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ పార్టీ తట్టుకోలేకపోతున్నదని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం ప్రతి పనినీ అడ్డుకోవడమే పరమావధిగా పెట్టుకొన్న కాంగ్రెస్ నాయకులు.. రాజ్యాంగ ప్రతినిధి గవర్నర్‌ను విమర్శించటం ద్వారా తమకు ఏ వ్యవస్థపైనా గౌరవం లేదని చాటుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను గవర్నర్ నరసింహన్ అభినందించడాన్ని తట్టుకోలేకనే దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. గణతంత్ర దినోత్సవం, బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్.. 'నా ప్రభుత్వం' అంటూ ఉపన్యసిస్తారని, అలాంటి గవర్నర్‌కు తన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసేహక్కు లేదన్నట్టుగా కాంగ్రెస్ నేతలు వితండవాదం చేస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్‌గా ఆయనను యూపీఏ నియమించిందని, ఆయన ఏదైనా తప్పుచేసినట్టుగా భావిస్తే ఎన్డీయే ప్రభుత్వం మూడున్నరేండ్లుగా ఎందుకు కొనసాగిస్తున్నదని ప్రశ్నించారు? గవర్నర్ ఏపార్టీకీ ఏజెంట్‌గా పనిచేయరని చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరుగుతున్నదని నరసింహన్ కేంద్రానికి నివేదించారంటూ.. ఏపీలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ సీ రామచంద్రయ్య ప్రశంసించిన విషయాన్ని ఇక్కడి నాయకులు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ వైఖరి ఏపీలో ఒకరకంగా, తెలంగాణలో మరోరకంగా ఉన్నదని, ప్రాంతీయపార్టీ స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఒక్క గవర్నరే కాదు.. దేశంలోని ఏ రాజకీయ పార్టీ నాయకులైనా, ఏ వ్యవస్థల ప్రతినిధులైనా, చివరకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీతోసహా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి వరకు ఎవరు కాళేశ్వరం పనులను చూసినా ప్రభుత్వాన్ని అభినందిస్తారని ప్రభాకర్ స్పష్టంచేశారు. కాళేశ్వరం దేశంలోనే అద్భుత ప్రాజెక్టు అని ఇటీవల సందర్శించిన కేంద్ర జలసంఘం అధికారులు అభినందించిన విషయాన్ని గుర్తుచేశారు.

పవన్ సీజనల్ పొలిటీషియన్

జనసేన పార్టీ నేత పవన్‌కల్యాణ్ యాత్రపై మీడియా అడిగిన ప్రశ్నలకు కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ 'సీజనల్ పొలిటీషియన్' అని పేర్కొన్నారు. ఆయనతో చీకటి ఒప్పందాలు, అంతర్గత ఒప్పందాలు చేసుకొనేంత బలహీనంగా టీఆర్‌ఎస్ లేదని చెప్పారు. ఆయన కొద్దిరోజులు రాజకీయాల్లో, ఇంకొన్నిరోజులు సినిమాల్లో కనిపిస్తారని అన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్, పవన్‌కల్యాణ్ భేటీ వెనుక రాజకీయ ప్రాధాన్యం లేదన్నారు.


సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

Dwaraka



ప్రధాని నరేంద్ర మోదీని దేశంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరితే, యువత పకోడీలు అమ్ముకొని కూడా జీవనోపాధి పొందవచ్చని చెబుతున్నారు. ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదు.
ఇలా ఓ చాయ్‌వాలా మాత్రమే మాట్లాడగలడు!

హార్దిక్ పటేల్, పటీదార్ ఉద్యమనేత, గుజరాత్



ఢిల్లీలో బీజేపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నది. సాఫీగా సాగుతున్న ఢిల్లీ ప్రభుత్వాన్ని పడదోసేందుకు కుట్రలు చేస్తున్నది. అందులో భాగమే 20మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించటం.దీంతో ఉప ఎన్నికలు నిర్వహించి లబ్ధి పొందాలని చూస్తున్నది. ఢిల్లీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేకులకు గట్టి బుద్ధి చెబుతారు.

మనిష్ సిసోడియా, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి

చరిత్రలో నేడు



1556

చైనా షాంగ్జీలో భయంకర భూకంపం. 8 లక్షల మంది మృతి.

1849



అమెరికాలో మొదటి వైద్య పట్టా పొందిన ఎలిజబెత్ బ్లాక్‌వెల్.



1899

ఫిలిప్పీన్స్ మొదటి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమిలియో అగినాల్డో.

ఆప్ మున్నెన్నడూ లేని సవాలును ఎదుర్కొంటున్నది. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను లాభదాయక పదవుల పేరుతో ఎన్నికల కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. దీనికి రాష్ట్రపతి కూడా ఆమోదముద్ర వేయటంతో ఢిల్లీ కేజ్రీవాల్ ప్రభుత్వానికి ప్రమాదమేమీ లేకున్నా దీన్నుంచి ఎలా బయటపడుతుందనేదే చర్చనీయాంశం. ఇలాంటి పార్లమెంటరీ సెక్రటరీ పదవులు రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణలోనూ ఉన్నాయి. అక్కడ ఇలాంటి అనర్హత సమస్య ఉత్పన్నం కాలేదు. ఒకవేళ ఈ 20 స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహిస్తే, ఆప్ ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ కాగలదు. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు ఏ తీర్పు ఇవ్వనున్నదో, దానిపై ఢిల్లీ రాజకీయాలు ఆధారపడి ఉంటాయి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

భారత్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఐదు నెలల క్రితం తెరపడిందనుకున్న వివాదం మళ్లీ రాజుకున్నది. 73 రోజుల పాటు డోక్లాం సరిహద్దు ప్రాంతంలో ఇరుదేశాల సేనల మోహరింపు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అయితే దౌత్యాధికారుల చర్చలు సఫలమై సేనల మోహరింపును రద్దుచేసుకుని ఇరు దేశాలు సేనలను ఉపసంహరించుకున్నాయి. తిరిగి ఇప్పుడు తూర్పుడోక్లాం ప్రాంతంలో చైనా పక్కా నిర్మాణాలను చేపడుతున్నట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాలు చెబుతున్నాయి. దీంతో తిరిగి భారత-చైనా సరిహద్దులో ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇకనైనా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచించాలి.

ది హిందూ

గవర్నర్‌పై నిందలా!

రాష్ట్రపతి మాదిరిగానే గవర్నర్ కూడా ప్రజాప్రభుత్వాన్ని గౌరవిస్తూ, పరిపాలనను సజావుగా పాలన సాగనివ్వాలనేది రాజ్యాంగ కోవిదులు ఎవరైనా అంగీకరిస్తారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి– అనేకమంది గవర్నర్లలో–తమ రాజ్యాంగ పరిమితులను గుర్తించి గవర్నర్ పదవికి వన్నె తెచ్చిన వారున్నారు, రాష్ట్ర ప్రభుత్వాన్ని చీకాకు పరిచి అప్రతిష్ఠ పాలైన వారూ ఉన్నారు. వర్తమాన రాజకీయాలను గమనిస్తే– అరుణాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న జేపీ రాజ్‌ఖోవా వివాదాస్పదంగా వ్యవహరించి పదవీ భ్రష్టులయ్యారు. ఆదర్శప్రాయంగా వ్యవహరించే వారిని గుర్తించదలుచుకుంటే, మన గవర్నర్ నరసింహన్ అగ్రగణ్యులుగా నిలుస్తారు. అనేక సవాళ్ళ మధ్య గవర్నర్ పదవిని చేపట్టిన నరసింహన్ అత్యంత చతురతో పదవిని నిర్వహించడమే కాకుండా, రాజ్యాంగ విలువలను గౌరవించే సంస్కారవంతుడిగా ప్రశంసలను అందుకుంటున్నారు. గవర్నర్‌గా పెద్దరికాన్ని ప్రదర్శించకుండా ప్రజా ప్రభుత్వానికి అండదండలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాల పట్ల ఆసక్తి ప్రదర్శించినా, లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నా, ఆయనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనే దుర్బుద్ధి ఇసుమంత కూడా కానరాదు. రాష్ట్ర సంక్షేమం, ప్రజా శ్రేయస్సు పరమావధిగా వ్యవహరించే కేసీఆర్ వంటి ముఖ్యమంత్రికి, రాష్ట్ర గవర్నర్‌గా నరసింహన్ సరైన జోడీగా దొరుకడమనేది చరిత్రలో అరుదుగా కనిపించే అద్భుతమని అంగీకరించకతప్పదు. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేని కొందరు నాయకులు గవర్నర్‌ను బదనాం చేయడానికి బట్టకాల్చి మీదేయడం వారి అల్పత్వాన్నే సూచిస్తున్నది.

నరసింహన్ గవర్నర్‌గా వచ్చినకాలం అత్యంత సంక్షోభభరితమైనది. అప్పటి కాంగ్రెస్ నాయకత్వమే ఆయన దక్షతను చూసి గవర్నర్‌గా నియమించింది. ఉమ్మడి రాష్ట్రంలో అనిశ్చితి నెలకొని ఉండేది. చట్టబద్ధ పాలనకు అనేక రూపాలలో సవాళ్ళెదురయ్యాయి. సీమాంధ్ర పాలకవర్గాల బాధ్యతారహిత వైఖరి పరిస్థితిని మరింత దిగజార్చింది. అయినప్పటికీ కేంద్రం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగనిస్తూనే, ఎంతో నేర్పుగా విభజన సాగించడం వెనుక గవర్నర్ సలహా సూచనలు లేవంటే నమ్మలేం. నరసింహన్ దక్షతను గుర్తించినందువల్లనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఆయననే గవర్నర్‌గా కొనసాగిస్తున్నది.

ఏ రాష్ట్రంలోనైనా ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టిన గవర్నర్లను రాజ్యాంగవేత్తలు, రాజకీయ నాయకులు తప్పు పడుతరు. కానీ ఇందుకు భిన్నంగా మన ప్రతిపక్ష నాయకులు కొందరు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నందుకు గవర్నర్‌పై బురద చల్లడం హాస్యాస్పదంగా ఉన్నది. అతి వేగంగా నిర్మితమవుతూ, దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న కాళేశ్వరం ప్రాజెక్టును ఇటీవల గవర్నర్ నరసింహన్ సందర్శించారు. అప్పటికే కేసీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను చూసి ఉన్న గవర్నర్ ఈ పర్యటన సందర్భంగా ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, మంత్రి హరీశ్‌రావునే కాకుండా, ఈ మహాయజ్ఞంలో భాగస్వాములైన అధికారులను, ఇంజినీర్లను, కార్మికులను అభినందిస్తూ, ఇదొక సమిష్టి కార్యక్రమమని కూడా అన్నారు. కార్మికులను స్వయంగా పలుకరించి, వారికి తగిన వసతులు సమకూర్చారనేది ధ్రువపరచుకున్నారు.ఈ మాత్రం దానికి ప్రతిపక్షనేతలు గవర్నర్‌పై నిప్పులు చెరుగడం సభ్యత అనిపించుకోదు. గతంలోనూ కొందరు ప్రతిపక్షనేతలు రాజ్‌భవన్‌కు వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించడంలో తప్పేమీ లేదు. కానీ గవర్నర్ తమ ఆరోపణలను నోరు మూసుకొని వినాలే తప్ప మాట్లాడకూడదనటం విచిత్రం. గవర్నర్‌కు ప్రతిపక్ష నేతల ఆరోపణల్లో ఏవైనా సందేహాలు తలెత్తితే నివృత్తి చేసుకోవాలను కోవడం తప్పా? తమ ఆరోపణల్లో బలం ఉంటే ప్రతిపక్షాలు అదే విషయాన్ని గవర్నర్ గౌరవానికి భంగం కలుగని రీతిలో ఒకటికి పదిసార్లు చెప్పవచ్చు. గవర్నర్ పదవి ప్రతిపక్షాల ముందు నోరు విప్పకూడదనేంతటి నామమాత్రమైనదే అయితే, మరి రాష్ట్ర ప్రభుత్వంపై చర్య తీసుకోమని విజ్ఞప్తి చేయడంలో హేతుబద్ధత ఏమిటి? రాష్ట్రపతి కానీ, గవర్నర్ కానీ తమ దగ్గరికి వచ్చిన వారిని అన్ని విషయాలు అడిగి తెలుసుకుంటారు. రాజ్యాంగంపైనా, రాజకీయాల్లోనూ ప్రాథమిక పరిజ్ఞానం ఉన్న వారెవరూ గవర్నర్ నరసింహన్ వ్యవహారసరళిని తప్పుపట్టరు.

నరసింహన్ గవర్నర్‌గా వచ్చినకాలం అత్యంత సంక్షోభభరితమైనది. అప్పటి కాంగ్రెస్ నాయకత్వమే ఆయన దక్షతను చూసి గవర్నర్‌గా నియమించింది. ఉమ్మడి రాష్ట్రంలో అనిశ్చితి నెలకొని ఉండేది. చట్టబద్ధ పాలనకు అనేక రూపాలలో సవాళ్ళెదురయ్యాయి. సీమాంధ్ర పాలకవర్గాల బాధ్యతారహిత వైఖరి పరిస్థితిని మరింత దిగజార్చింది. అయినప్పటికీ కేంద్రం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగనిస్తూనే, ఎంతో నేర్పుగా విభజన సాగించడం వెనుక గవర్నర్ సలహా సూచనలు లేవంటే నమ్మలేం. నరసింహన్ దక్షతను గుర్తించినందువల్లనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఆయననే గవర్నర్‌గా కొనసాగిస్తున్నది. రాజకీయాలకు అతీతంగా తీసుకున్న విధాన నిర్ణయమిది. రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు ఉన్న నేపథ్యంలో గవర్నర్ పాత్రకు మరింత ప్రాధాన్యం ఏర్పడ్డది. కేంద్ర రాష్ట్రాల మధ్య వారధిగా నిలువడంలోనూ, ఇరు రాష్ట్రాలను సముదాయించడంలోనూ గవర్నర్ ఎంతో విజ్ఞతను ప్రదర్శిస్తున్నారు. గవర్నర్ నిర్వహిస్తున్న నిర్మాణాత్మకపాత్రకు మద్దతు ఇవ్వాలే తప్ప విమర్శించడం తగదు. గవర్నర్ ఒక రాష్ట్రంలో సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రశంసించారూ అంటే, మరో రాష్ట్ర ప్రభుత్వాన్ని కించపరిచారనే విపరీతార్థం తీయకూడదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని వెన్నుతట్టి ప్రోత్సహిస్తే, అధికారపార్టీకి మద్దతు ఇచ్చినట్టవుతుందనే సంకుచిత నిర్ధారణకు రాకూడదు. రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్‌పై బురద చల్లడం తగదు.

జనగళం

వేగాన్ని నియంత్రించాలె

మితిమీరిన వేగం అనేక రోడ్డు ప్రమాదాలకు కారణమౌతున్నది. ముఖ్యంగా ప్రధాన నగర శివారు ప్రాంతాలపై ట్రాఫిక్ అధికారులు దృష్టి సారించాలి. నిబంధనలకు విరుద్ధంగా వేగంగా వెళ్తున్న వాహనాలను నియంత్రించాలి. దీనివల్ల కొంతవరకైనా ప్రమాదాలను అరికట్టవచ్చు. అలాగే చిన్న పిల్లలు కూడా వాహనాలు వేగంగా నడుపుతున్నారు. నిర్ణీత వయసు వచ్చేవరకు వాహనాలు నడుపకూడదు. దీనిపై అధికారులు ఇప్పటికే చాలాసార్లు వాళ్ల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా మార్పు రావడంలేదు. ఇప్పటికైనా అధికారులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి వేగాన్ని నియంత్రించాలి.

- జె.శ్రీనివాసరావు, హైదరాబాద్

హామీలు నెరవేర్చాలె

విభజన హామీలను అమలుచేయడంలో కేంద్రం ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నది. ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎంపీలు అనేకసార్లు విన్నవించారు. ఆ సమయంలో విభజన హామీలను నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెబుతున్నది. కానీ కార్యాచరణ అంటూ ఏమీ లేదు. కాబట్టి కేంద్రం ఇప్పటికైనా అన్ని హామీలను పరిష్కరించే కార్యాచరణను ఆచరణలో మొదలుపెట్టాలి.

- నోముల యాదగిరి, నల్గొండ

గ్రంథాలయాల పటిష్టత

గ్రామీణ ప్రాంతాల్లో శాఖా గ్రంథాలయాలు ఏర్పాటుచేయాలి. ఇప్పటికే ఉన్నవాటిని మరింత అభివృద్ధి చేయాలి. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషిచేస్తున్నది. కానీ చాలాచోట్ల అన్నిరకాల పేపర్లు, పుస్తకాలు అందుబాటులో లేవు. ఇలాంటి వాటిపై అధ్యయనం చేయాలి. గ్రంథాలయాలను మరింత పటిష్టం చేయాలి.

- జి.సాయికృష్ణ, జగిత్యాల

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

అంతర్జాతీయం

పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు

క్రిస్టిన్ కోల్

ప్రపంచాన్ని ప్లాస్టిక్ భూతం వెంటాడుతున్నది. ప్లాస్టిక్ వినియోగ వస్తువుల వాడకం మితిమీరిపోయిన నేపథ్యంలో ఉపయోగించి వదిలివేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను ప్రమాదంగా పరిణమించాయి. ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదం గురించి ఎవరో వ్యక్తులు, కొన్ని ఎన్జీవోలు కృషిచేస్తేనే సరిపోదు. దీనికి ప్రభుత్వాలు తగిన కార్యాచరణతో ముందుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ క్రమంలో ప్లాస్టిక్ వస్తువుల పునర్వినియోగం గురించి తీవ్రంగా ఆలోచించాలి. దీనికి పెద్దఎత్తున ప్రత్యేక కార్యాచరణతో ముందుకుపోవాలి.

ప్రపంచాన్ని ప్లాస్టిక్ భూతం వెంటాడుతున్నది. ప్లాస్టిక్ వినియోగ వస్తువుల వాడకం మితిమీరిపోయిన నేపథ్యంలో ఉపయోగించి వదిలివేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను ప్రమాదంగా పరిణమించాయి. ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదం గురించి ఎవరో వ్యక్తులు, కొన్ని ఎన్జీవోలు కృషిచేస్తేనే సరిపోదు. దీనికి ప్రభుత్వాలు తగిన కార్యాచరణతో ముందుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ క్రమంలో ప్లాస్టిక్ వస్తువుల పునర్వినియోగం గురించి తీవ్రంగా ఆలోచించాలి. దీనికి పెద్దఎత్తున ప్రత్యేక కార్యాచరణతో ముందుకుపోవాలి.

ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో ఎదురవుతున్న దుష్పరిణామాలపై అందరూ దృష్టి సారించాలి. ఈ క్రమంలోనే బీబీసీ బ్లూ ప్లానెట్-IIలో ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. మరోవైపు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన పునర్వినియోగ వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తంచేసి వాటి వాడకంపై నిషేధం విధించటంతో ఈ సమస్య తీవ్రమైంది. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన పునర్వినియోగ వస్తువులతో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు, కాలుష్యం పట్ల కూడా అనేక భయాందోళనలున్నాయి. చైనా ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితంతో తయారైన వస్తువులపై విధించిన నిషేధం అభివృద్ధి చెందిన దేశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా బ్రిటన్‌తో సహా యూరప్ దేశాలు, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు తమ దేశాల్లోని ప్లాస్టిక్‌ను పునర్వినియోగించుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. దీనికోసం కూడా ఈ దేశాలు చైనాపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉన్నది. బ్రిటన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగించుకునే విధంగా వస్తువుల తయారీకి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నా.. సరిపోయిన స్థాయిలో టెక్నాలజీ లేక తీవ్ర పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నది. గుట్టలుగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఏం చేయాలో తెలియని స్థితిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఆసియా దేశాలు తక్కువ నాణ్యత ఉన్నా ప్లాస్టిక్ వినియోగ వస్తువుల వాడకంలో ముందున్నాయి. దీంట్లో భారత్ ముందు వరుసలో ఉన్నది. భారత దేశంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన వినియోగ వస్తువుల వాడకం పెద్ద ఎత్తున ఉన్నది. దీంతో అనేకదేశాలు ముఖ్యంగా చైనా తన ప్లాస్టిక్ వస్తువులను భారత్‌కు ఎగుమతి చేస్తున్నది. ప్లాస్టిక్ వస్తువులతో దేశాన్ని నింపేస్తున్నది. వియత్నాం, కాంబోడియా దేశాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో పాటు మిగిలిన ప్లాస్టిక్‌ను కాల్చి బూడిద చేస్తున్నాయి.

ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారైన ద్వితీయ వినియోగ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విషయంలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటితో తలెత్తే ఆరోగ్య సమస్యలతో పాటు, కాలుష్య ప్రమాదం కూడా ప్రమాదకరస్థాయిలో ఉన్నది. అందుకోసం రీసైకిల్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ఎంత ఎక్కువ స్థాయిలో చేస్తున్నామనేది కాకుండా వాటి నాణ్యతను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నది. ప్లాస్టిక్ పునర్వినియోగ (సైక్లింగ్) వస్తువుల్లో నాణ్యత ప్రధానంగా చూడాల్సి ఉన్నది. రీ సైక్లింగ్ వస్తువుల తయారీలో ప్లాస్టిక్‌ను సరియైన విధంగా శుభ్రం చేయకపోతే, అనేకరకాల ప్లాస్టిక్‌తో తయారయ్యే వస్తువులతో తీవ్ర దుష్ప్రభావాలుంటాయి. ఈ విధమైన సమస్యలను చైనా అంగీకరించటం లేదు. కానీ వీటితో అనేక ఆరోగ్య, కాలుష్య సమస్యలున్నది మాత్రం వాస్తవం.

బ్రిటన్‌లో ప్లాస్టిక్‌ను పునర్వినియోగం చేసేందుకు ప్లాస్టిక్‌ను వివిధ రకాల వస్తువుల వ్యర్థాలుగా వేరు చేసి వాటితో నాణ్యమైన వస్తువులను తయారుచేస్తున్నది. దీన్ని దేశవ్యాప్తంగా పాటిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయటంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. ఇంటి వినియోగ వస్తువులు, పారిశ్రామిక వస్తువులు వేరు వేరుగా సేకరించి రీ సైక్లింగ్‌కు వినియోగిస్తున్నది. ప్లాస్టిక్ వస్తువుల సేకరణ–తిరిగి ఇచ్చివేయటం కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టింది. ప్లాస్టిక్ నీటి బాటిల్స్, టీ కప్పులు, క్యాన్స్ తదితరాలను వేర్వేరుగా సమీకరించి వాటితో రీ సైక్లింగ్ వస్తువుల తయారీకి వినియోగిస్తూ నాణ్యతను పాటిస్తున్నది.

ఇండ్లనుంచి సేకరించే ప్లాస్టిక్ వస్తువుల విషయంలోనే అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఇండ్ల నుంచి అన్నిరకాల చెత్తతో పాటు ప్లాస్టిక్ వస్తువులను కూడా సేకరించి, ఆ తర్వాత ప్లాస్టిక్‌ను వేరు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్లాస్టిక్ కాలుష్యమైపోతున్నది. ఈ విధమైన సేకరణలో ఏ విధమైన నాణ్యతను, పరిశుభ్రతను పాటించటంలేదు. ఈవిధంగా సేకరించిన వ్యర్థ ప్లాస్టిక్‌తోనే రీ సైక్లింగ్ వస్తువులను తయారు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రత్యేకంగా వేరుచేసే వ్యర్థాలుగా లేని పదార్థాలను ప్రధాన వ్యర్థాలైన ప్లాస్టిక్‌తో కలిపేస్తున్నారు. ఈ విధమైన వ్యర్థాలతో తయారైన వస్తువులతోనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాలుష్యం, ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.

అన్నిదేశాలు ప్లాస్టిక్ వినియోగం, పునర్వినియోగం పై పునరాలోచించాలి. రీ సైక్లింగ్ వస్తువుల తయారీలో వాడే ప్లాస్టిక్ వ్యర్థాల నాణ్యతపై ప్రత్యే శ్రద్ధ పెట్టాలి. లేకుంటే ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించే క్రమంలో అంతకన్నా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. కాబట్టి ఇప్పటికైనా అన్ని దేశాలు ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకుపోవాలి.

ఈ నేపథ్యంలో బ్రిటన్ రీ సైక్లింగ్ వస్తువుల తయారీ, వినియోగంపై ప్రత్యేక దృష్టిని కేంద్రికరించింది. దీనికి కావలసిన టెక్నాలజీని అభివృద్ధి చేసుకొని వీలైనంతగా ప్లాస్టిక్‌ను పునర్వినియోగానికి ఉపయోగించుకునే దిశగా అడుగులు వేస్తున్నది. ఇందులో విజయం కూడా సాధించింది. అలాగే రీ సైక్లింగ్ వస్తువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాల భాగంపై కూడా నిబంధనలు విధించింది. దీంతో ఇష్టానుసారం ప్లాస్టిక్ వ్యర్థాలతోనే పునర్వినియోగ వస్తువులు తయారుచేయటానికి వీలులేదు. ఉదాహరణకు కొకకోలా సీసాల్లో 50 శాతం కన్నా ఎక్కువ రీసైకిల్ పదార్థాన్ని ఉపయోగించకూడదు. దీంతో పునర్వినియోగ వస్తువుల నాణ్యతలో గణనీయమైన మార్పు వస్తున్నది. అలాగే బ్రిటన్ మార్కెట్‌లో వస్తువుల నాణ్యత విషయంలో ఉత్పత్తిదారుని బాధ్యతను పెంచింది. తయారీ దశ నుంచి వినియోగం దాకా వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై దృష్టి కేంద్రీకరించింది. దీనికిగాను అనేక చట్టసవరణలు తీసుకువచ్చింది. అలాగే ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై నియంత్రణ విధించింది. ఈ తోవలోనే ఫ్రాన్స్ కూడా నడిచి ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించింది. కొన్నిరకాల ప్లాస్టిక్ సంచులు, వస్తువులపై కూడా నిషేధం విధించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ముఖ్యంగా నల్ల ప్లాస్టిక్‌ను రీ సైక్లింగ్ చేయటానికి వినియోగిస్తే దాంతో తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయి. కాలుష్యం ఎక్కువవుతున్నది. ఈ నేపథ్యంలో చైనా నల్ల ప్లాస్టిక్‌ను వినియోగించటాన్నే నిషేధించింది.

ఈ నేపథ్యంలోనే అన్నిదేశాలు ప్లాస్టిక్ వినియోగం, పునర్వినియోగం పై పునరాలోచించాలి. రీ సైక్లింగ్ వస్తువుల తయారీలో వాడే ప్లాస్టిక్ వ్యర్థాల నాణ్యతపై ప్రత్యే శ్రద్ధ పెట్టాలి. లేకుంటే ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించే క్రమంలో అంతకన్నా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. కాబట్టి ఇప్పటికైనా అన్ని దేశాలు ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోవాలి. ప్రపంచాన్ని ప్లాస్టిక్ ప్రమాదం నుంచి సంరక్షించుకోవాలి.

'ది వైర్' సౌజన్యంతో..

హింసాప్రవృత్తికి మూలమేమిటి?

విశ్లేషణ



అమర్‌నాథ్ వాసిరెడ్డి

పోర్న్ మ్యాగజిన్, గుట్కా ప్యాకెట్, హుక్కా పెన్, సిగరెట్, సిగరెట్ లైటర్, రేజర్, ట్రిమ్మర్, షేవింగ్‌ఫోమ్..లక్నోలో పిల్లల స్కూల్ బ్యాగ్ చెక్ చేస్తే బయటపడిన వస్తువుల లిస్ట్!!

మొన్న లక్నోలో ఒక స్కూల్‌లో 6వ తరగతి అమ్మాయి సెలవు వస్తుందని 1వ తరగతి అబ్బాయిని పొడిచిన సంఘటన నేపథ్యంలో స్కూల్స్ పిల్లల బ్యాగ్స్ చెక్ చేయడం మొదలు పెట్టారు. అప్పుడు బయటపడిన వస్తువులు ఇవి.

ఏదైనా ఒక సంఘటన జరిగిన వెంటనే అది జరుగడానికి కారణమేమిటి, దాని పరిష్కారమేంటి అని ప్రభుత్వాలు కానీ మీడియా కానీ ఆలోచించదు. వెంటనే ప్రైవేట్ స్కూల్స్‌ను నిందించడం ఒక ట్రెండ్‌గా మారింది . ప్రైవేట్ స్కూల్స్ సరైన దారిలో వెళుతున్నాయని నేననడం లేదు. తప్పకుండా అక్కడున్న లోపాలను సరిదిద్దాల్సిందే. కానీ లోపం అక్కడే కాదు కదా. సమస్యకు ఇంకా చాలా కారణాలున్నాయి. వాటి సంగతి ఏమిటి?

టీవీలు , సినిమాలు ఏమైనా చూపించవచ్చు. పిల్లల మనసును కాలుష్యం చేయవచ్చు. ఇంటర్నెట్ పైన కనీస నియంత్రణ లేదు. పోర్న్, వయోలెన్స్ పిల్లలకు యథేచ్ఛగా అందుబాటులో ఉంది . తల్లిదండ్రులకు అంటే అందరు తల్లితండ్రులు కాదులెండి. మంచి స్కూల్ ఉన్నట్టే, మంచి తల్లిదండ్రులు, మంచి టీవీలున్నాయి, కానీ వాటి సంఖ్య తక్కువ. మనం మాట్లాడుకునేది అధిక శాతం గురించి. నేటి ట్రెండ్ గురించి పిల్లలతో గడిపే సమయం లేదు. పిల్లల చేతికి సెల్‌ఫోన్ ఇచ్చేస్తున్నారు. అన్ని రోగాలను అది నట్టింట్లోకి తెస్తున్నది.

ఒక్కసారి ఆలోచించండి. పోర్న్ మ్యాగజిన్ , సిగరెట్, గుట్కా ప్యాకెట్ పిల్లల బ్యాగ్‌లోకి ఎలా వస్తున్నాయి? పిల్లలు వాటర్‌బాటిల్లో వోడ్కా కలుపుకొని స్కూల్‌కు ఎలా తీసుకొని రాగలుగుతున్నారు? స్కూల్ ప్రాంగణందాకా డ్రగ్స్ ఎలా వస్తున్నాయి?

మరో విషయం. పిల్లల్ని కొట్టడానికి, తిట్టడానికి నేను వ్యతిరేకం. కానీ ఇక్కడో విషయం అడుగాలి. ఒకప్పుడు టీచర్ పిల్లల్ని కొట్టడమనేది సాధారణం. ఇప్పుడు పెద్దవారుగా ఉన్నవారు అందరు టీచర్ల దగ్గర దెబ్బలు తిన్నవారే. మా అమ్మనాన్న ఇద్దరు టీచర్లే. మా అమ్మ పెద్ద గా కొట్టేదికాదు, కానీ మా నాన్నంటే పిల్లకు హడల్. తెగ కొట్టేవారు. నేను చదువులో ఎప్పుడు ఫస్ట్‌గా ఉండేవాడిని. నన్ను మా నాన్న కొట్టేవాడు. ఇతర టీచర్లూ కొట్టేవారు. టీచర్ కొట్టడం మన మంచికే అనే భావన ఉండేది. మళ్లీ చెబుతున్నా మారిన కాలపరిస్థితుల్లో టీచర్ కొట్టడానికి, తిట్టడానికి నేను వ్యతిరేకం. కానీ ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసిందని ఏకంగా గన్‌తో ఆమెను కాల్చి చంపడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? గతంలో ఎన్నిసార్లు పిల్లలను టీచర్లు కొట్టినా ఇలా ఎందుకు జరుగలేదు? ఆలోచించండి. ఏ సంఘటన జరిగినా ప్రభుత్వానికి మీడియాకు ఇది ప్రైవేట్ స్కూల్స్ వైఫల్యం, సీసీ టీవీలు పెట్టుకోండి. భద్రతను పటిష్టం చేసుకోండని చెప్పడం, సమస్య అక్కడితో పరిష్కారం అయిపోతుందని చెప్పడం ఒక ట్రెండ్‌గా మారింది . ఇప్పుడు స్కూల్ ప్రిన్సిపాల్‌నే చంపడం జరిగింది. ఈ నేపథ్యంలో ఇలాంటి చర్య లు చేపట్టాలని అడుగుదామా?

భద్రతా చర్యలు అంటే ప్రతి స్కూల్ ఎంట్రన్స్‌లో ఎయిర్‌పోర్టులో ఉన్నట్టే సీఐఎస్ఎఫ్ యూనిట్ ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థిని, టీచర్‌ను, ఇంకా స్టాఫ్‌ను సెక్యూరిటీ చెక్ చెయ్యాలి. బోర్డింగ్ పాస్ లాగే ఒక టికెట్ పెట్టి దానిపై స్టాంప్ వెయ్యాలి. ప్రతి సెక్షన్‌కు ఇద్దరిద్దరు కానిస్టేబుల్స్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌తో భద్రతా ఏర్పాటుచెయ్యాలి.

ప్రతి క్లాస్‌కు ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ప్రతి స్కూల్‌కు ఐపీఎస్ అధికారిని పర్యవేక్షకుడి గా నియమించాలి. ప్రతి టీచర్‌కు ఇద్దరు గన్‌మెన్‌లను ఇవ్వాలి. ప్రిన్సిపాల్‌కు జడ్ క్యాటగిరీ సెక్యూరిటీని ఇవ్వాలి.

మేనేజ్‌మెంట్‌కు ప్లస్ క్యాటగిరీ సెక్యూరిటీ ఇవ్వాలి. న్యూయార్క్‌లాంటి అమెరికా నగరా ల్లో ఎప్పుడు హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సెక్యూరిటీ సర్వే చేస్తుంటారు. ఇక్కడ కూడా ప్రతి స్కూల్‌కు అలాంటి ఏరియల్ సర్వే ఏర్పాటుచెయ్యాలి.

ఏడ్చినట్టే ఉంది నీ బోడి సలహా అనుకుంటున్నారా? నా వ్యంగ్యం వెనుక బాధను అర్థం చేసుకోండి. కేవలం ఒక వర్గాన్ని నిందించడం కాకుండా సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు, మీడియా, టీచర్ సంఘాలు, ప్రైవేట్ పాఠశాలలు, ప్రజాసంఘాలు పూనుకొన్నపుడే సమస్యను అన్ని కోణాల నుంచి చర్చించవచ్చు. నిజమైన పరిష్కారాలు రాబట్టినప్పుడే నిజమైన బాలవికాసం. BLAME గేమ్ వల్ల సమస్య మరింత జటిలమవుతుంది.

THE WORSE IS YET TO COME! WAKE UP! STOP BLAME GAME!!

అబద్ధాలు పటాపంచలు

తెలంగాణం

సుభాష్ రౌతు

ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే ఏమొస్తది? అని చాలామంది మిత్రులు అడిగేవారు. సమాధానం చెప్పడం కొంచెం కష్టంగానే ఉండేది, అయినా చెప్పేవాళ్లం. తెలంగాణ వస్తే మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే వస్తాయని. దానిమీద చర్చ బాగానే జరిగేది. తెలంగాణ కావాలనుకునేవాళ్లు నమ్మేవాళ్ళు, వద్దనుకునేవాళ్లు అంధకారమవుతుందని, తెలంగాణ వస్తే మిమ్మల్ని అన్నలు ఏలుతారని అనేవాళ్లు. అయితే అనేక బలిదానాలు, అఖండ తెలంగాణ ప్రజాకాంక్ష, రాజకీయ ఓర్పు, నేర్పు, బరితెగింపుల వల్ల తెలంగాణ వచ్చింది. తెలంగాణ వచ్చి మూడున్నరేండ్లు గడిచింది.

గత మూడున్నరేండ్లుగా తెలంగాణ వస్తే ఏమొచ్చిందని ఎవరు అడుగట్లేదు. కానీ.. ఏమొచ్చిందో చెప్పాలని మాత్రం ఉత్సాహంగా ఉండేది. ప్రపంచ తెలుగు మహాసభల ఆరంభం చూశాక ఆ ఉత్సాహం ఉప్పొంగి పెన్ను తీయక తప్పలేదు. అంధకారం పొలిమేర దాటిపోయింది, పెద్దన్న ముఖ్యమంత్రి అయ్యిండు.

ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రసంగంలో తెలుగు సాహిత్యాన్ని స్పృశించారు, సంతోషం కలిగింది. గోరటి గల్లీ సిన్నది, జయరాజు వానమ్మా వానమ్మా, అందెశ్రీ జయజయహే తెలంగాణ పాటలను ముఖ్యమంత్రి పాడినప్పుడు తెలంగాణ వస్తే ఏమొచ్చిందో ఎలుగెత్తి చెప్పాలనిపించింది. పాలమూరు మట్టిబిడ్డ గోరటి గల్లీ సిన్నది ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై పారిందని, నల్ల సూరీడు జయరాజు వాన భాషాభిమానులను తడిపి ముద్దచేసిందని, బాల్య పశువుల కాపరి అందెశ్రీ జయజయహే తెలంగాణ తలెత్తుకున్నదని చెప్పాలనిపించింది. ఇవన్నీ తెలంగాణ రావడం వల్లనే, ఉద్యమ నాయకుడు అగ్రస్థానం అధిష్ఠించడం వల్లనే నిజమయ్యాయి. ఎవరికెన్ని లెక్కలున్నా నాకు మాత్రం నిజాన్ని ఒప్పుకుంటేనే నిజమైన తెలంగాణ వాడనిపించుకుంటారని నమ్మకం.

అయితే తెలంగాణ వచ్చిందని, మెచ్చిన నాయకుడు తెలంగాణను ప్రజారంజకంగా ఏలుతున్నాడని సంతోషం ఉంది, కొంత బాధ కూడా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలియని విషయం కాదు. తెలంగాణ గడ్డ పోరాటాల అడ్డ, ఇక్కడ ప్రజలు మంచిని హర్షిస్తారు చెడును ప్రశ్నిస్తారు. ఇక్కడ ఈ రెండే ఉంటాయి. ఇతర ప్రాంతాల్లో ఈ రెంటికీ మధ్య ఇంకేముండదు. కొంతమంది మనవాళ్లు అక్కడక్కడా ప్రశ్నిస్తున్నారు, ఈ మధ్యలో కొట్లాడుతున్నారు కూడా. అది ఈ నేల మహిమ, అర్థం చేసుకోవాలి, అక్కున చేర్చుకోవాలి. వారూ కలిసిరావాలి. ఈ నవజాత రాష్ట్రానికి పునాది గట్టిగా వేయడానికి శాస్త్ర సాంకేతిక, సాహిత్య సలహాలివ్వాలి.

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో అందరి పేర్లు తీసుకోవడానికి సమయం సరిపోదు. సోదాహరణగా ముగ్గురి పేర్లను ప్రస్తావించానన్నారు. ఆ క్రమంలోనే ప్రజా యుద్ధనౌక గద్దర్, ఇతరులు రాలేదని ప్రశ్నిస్తున్నారని, కొట్లాడుతున్నారని మాత్రం కాదనుకుంటున్నాను.

ప్రపంచ తెలుగు మహాసభలపై ఇంకొక విమర్శ ఉన్నది. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రిని పిలువలేదని, ఇవి ప్రపంచ తెలుగు మహాసభలు కావు, తెలంగాణ తెలుగు మహాసభలు అని.

చంద్రబాబును పిలువకపోవడానికి సాంకేతిక, రాజకీయ కారణం ఉంది. తెలంగాణ ఇప్పుడే స్వతంత్ర రాష్ట్రంగా బుడిబుడి అడుగులు వేస్తూ స్వచ్ఛమైన పటం గీసుకుంటున్నది. చంద్రబాబు తొమ్మిదేండ్లు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన్ను పిలిస్తే ఆ ప్రభావం ఉంటుంది. అందుకే అనుకుంటాను, అది రాజకీయ కోణం. సాహిత్యకారులను పిలువకపోతే అనుకోవచ్చు, కానీ కొందరు పండితులు మా కుటుంబ పెద్దను పిలువలేదు మేము రామన్నారు, అది వారి విజ్ఞత.

అలా అంటే వంగపండు ప్రసాదరావు ఎవరు? ఆయనను ఆహ్వానించి, గౌరవించి సుద్దాల హనుమంతు అవార్డు ఎందుకిచ్చారు. రాజకీయ, సాహిత్య కోణం వేరు వాటిని ఒక్కగాటన కట్టలేం, అర్థం చేసుకోవాలి.

(వ్యాసకర్త: ప్రవాస భారతీయుడు, టొరంటో, కెనడా నుంచి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

అసాంజే వ్యవహారం మాకు తలనొప్పే!

ఈక్వెడార్ అధ్యక్షుడు లెనిన్ మొరేనో



లెనిన్ మొరేనో

క్విటో, జనవరి 22: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే వ్యవహారం తమ ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన సమస్య అని ఈక్వెడార్ అధ్యక్షుడు లెనిన్ మొరేనో సోమవారం వ్యాఖ్యానించారు. ఇది చికాకు కంటే కాస్త పెద్ద సమస్యేనని, అయితే దీనికి సానుకూల పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. వివిధ దేశాల రహస్య పత్రాలను వికీలీక్స్ ద్వారా బహిర్గతం చేసి ఆయా దేశాల పాలకులకు అసాంజే కంటగింపుగా మారారు. ఆయనను అరెస్ట్ చేయాలని ఎదురు చూస్తున్న పలు ప్రభుత్వాల నుంచి తప్పించుకునేందుకు అసాంజే లండన్‌లోని ఈక్వెడార్ దౌత్య కార్యాలయంలో తలదాచుకున్నారు. అసాంజేకు ఈక్వెడార్ పూర్వ అధ్యక్షుడు రాఫెల్ కొరియా ఆశ్రయం ఇచ్చారు. ఈ నెలలోనే అసాంజేకు ఈక్వెడార్ దేశ పౌరసత్వం కూడా లభించింది.

'తప్పనిసరి ఆధార్'ను నేరంగా పరిగణించాలి

ఎడ్వర్డ్ స్నోడెన్ విమర్శ



ఎడ్వర్డ్ స్నోడెన్

న్యూఢిల్లీ, జనవరి 22: వివిధ రకాల సేవలు అందించడానికి ఆధార్‌కార్డు అనుసంధానం తప్పనిసరి చేయడాన్ని నేరంగా పరగణించాలని అమెరికా విజిల్ బ్లోయర్ ఎడ్వర్డ్ స్నోడెన్ అభిప్రాయపడ్డారు. సేవలకు ఆధార్‌ను ముడిపెట్టడం అసమంజసమైన విధానం అన్నారు. భారత నిఘా విభాగం 'రా' మాజీ అధిపతి కేసీవర్మ ఇటీవల ఆధార్‌పై మూడోసారి రాసిన ఆన్‌లైన్ వ్యాసాన్ని ట్విట్టర్లో ఇతరులకు షేర్ చేసిన సందర్భంగా స్నోడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధార్‌కార్డును బ్యాంకులు, టెలికం కంపెనీలు, రవాణాసంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయన్న కేసీవర్మ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని స్నోడెన్ పేర్కొన్నారు. వ్యవస్థలోని లోపాల వల్ల ఆధార్‌లోని సమాచారం బయటికి వెల్లడవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

2024కు ముందు జమిలి ఎన్నికలు సాధ్యం కాదు

మాజీ సీఈసీ టీఎస్ కృష్ణమూర్తి



టీఎస్ కృష్ణమూర్తి

హైదరాబాద్, జనవరి 22: దేశంలో లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం 2024కు ముందు సాధ్యం కాదని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి చెప్పారు. ఐదేండ్లకోసారి జమిలి ఎన్నికలు నిర్వహించడం మంచిదేనని, అయితే అందుకు రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుందని అన్నారు. 'ప్రస్తుతం వెస్ట్‌మినిస్టర్ (బ్రిటన్) విధానాన్ని అనుసరిస్తున్నాం. నిర్ణీత పాలన ఉండే అమెరికన్ విధానాన్ని అనుసరిస్తే దానికి నిర్దిష్ట కాలవ్యవధి కూడా ఉంటుంది. ఎవరైనా వైదొలిగినా, సభ మరొకరిని ఎన్నుకుంటుంది. అప్పటివరకు అంతకుముందున్న ప్రభుత్వమే పాలన సాగిస్తుంది' అని వివరించారు. జమిలి ఎన్నికలకు మరో ప్రత్యామ్నాయం ఒకే ఏడాదిలో జరుగాల్సిన ఎన్నికలన్నింటినీ ఒకేసారి నిర్వహించడం అని తెలిపారు.

ముగిసిన అమెరికా షట్‌డౌన్

- పంతం నెగ్గించుకున్న డెమోక్రాట్లు
- వలసదారులపై కుదిరిన ఒప్పందం
- ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం



డెమోక్రాట్ల నాయకుడు చక్ షుమర్

వాషింగ్టన్, జనవరి 22: మూడురోజులుగా స్తంభించిన అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు సోమవారం నుంచి మళ్లీ ప్రారంభమయ్యాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ సభ్యులు, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య ఒక ఒప్పందం కుదరడంతో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందింది. డెమోక్రాట్ల నాయకుడు చక్ షుమర్ మాట్లాడుతూ, చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు అమెరికాలోకి వచ్చిన వేలాది మంది వలసదారుల భవిష్యత్‌పై ఒక ఒప్పందం కుదుర్చుకొనేందుకు ప్రభుత్వం అంగీకరించిందని అందువల్ల స్వల్ప కాలిక ద్రవ్య వినిమయ బిల్లుకు అనుకూలంగా తాము మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. సెనేట్ స్వల్పకాలిక బిల్లును ఆమోదించినందున ఫిబ్రవరి 8వ తేదీ వరకు మాత్రమే ప్రభుత్వ ఖర్చులకు నిధులు అందుతాయి. ఆ తరువాత మరోసారి డెమోక్రాట్ల షరతులకు ప్రభుత్వం అంగీకరించడాన్ని బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పరిశీలకులు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం మూతపడిన కారణంగా మూడురోజులుగా ఇండ్లకే పరిమితమైన ప్రభుత్వోద్యోగులు తిరిగి విధులకు హాజరు కానున్నారు.



ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషీని సోమవారం ఢిల్లీ కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు; (ఇన్‌సెట్‌లో) ఖురేషీ

'భారతీయ బిన్‌లాడెన్' అరెస్టు

- ఢిల్లీలో అబ్దుల్ సుభాన్ ఖురేషీని పట్టుకున్న పోలీసులు
- ఐఎం, సిమీల్లో ఖురేషీ కీలక బాధ్యతలు
- 2008 గుజరాత్ పేలుళ్ల సూత్రధారి
- పలు ఇతర ఉగ్రదాడులతోనూ సంబంధాలు

న్యూఢిల్లీ, జనవరి 22: భారతీయ బిన్‌లాడెన్‌గా పేరుమోసిన మోస్ట్‌వాంటెడ్ టెర్రరిస్టును ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. 2008 గుజరాత్ వరుస పేలుళ్ల సూత్రధారి, కరడుగట్టిన ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషీ (46) పదేండ్ల తర్వాత పట్టుబడ్డాడు. గణతంత్ర వేడుకల నేపథ్యంలో స్వల్ప ఎదురుకాల్పుల అనంతరం ఖురేషీని ప్రత్యేక విభాగం పోలీసులు అరెస్టు చేశారు. ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం) సహ వ్యవస్థాపకుడు, నిషేధిత 'స్టూడెంట్స్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా' (సిమి)తో సంబంధాలు కలిగి ఉన్న ఖురేషీని శనివారం సాయంత్రం తూర్పు ఢిల్లీలోని ఘాజీపూర్‌లో అరెస్టు చేసినట్టు పోలీస్ ప్రత్యేక విభాగం డిప్యూటీ కమిషనర్ ప్రమోద్ కుష్‌వాహ సోమవారం మీడియాకు చెప్పారు. ఘాజీపూర్‌లో తన స్నేహితుడిని ఖురేషీ కలిసేందుకు వస్తున్నట్టు అందిన సమాచారం మేరకు అతడిని మాటువేసి పట్టుకున్నట్టు తెలిపారు. 2008 జూలై 26న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో వరుసగా పేలుళ్లు జరుగడంతో 20 మంది చనిపోగా, 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ దాడికి తామే బాధ్యులమని నాడు ఇండియన్ ముజాహిద్దీన్ ప్రకటించింది. నాటి నుంచి గూఢచార సంస్థలు, ప్రత్యేక పోలీసు బృందాలు ఖురేషీ కోసం అన్వేషిస్తున్నాయి. వేషాలు మారుస్తూ అనేకసార్లు పోలీసుల నుంచి ఖురేషీ తప్పించుకున్నాడు. పేలుళ్ల అనంతరం ఖురేషీ నేపాల్ పారిపోయి నకిలీ గుర్తింపుతో జీవనం సాగించాడని, 2015-17 మధ్య సౌదీ అరేబియాకు వెళ్లాడని కుష్‌వాహ పేర్కొన్నారు. సిమి మ్యాగజైన్‌కు ఖురేషీ ఎడిటర్‌గా పనిచేశాడని చెప్పారు. ముంబై, బెంగళూరు, ఢిల్లీ వరుస పేలుళ్లలోనూ ఖురేషీ నిందితుడని ఆయన వెల్లడించారు. ఖురేషి తల్లిదండ్రులు ఉత్తరప్రదేశ్ నుంచి ముంబైకి వలస వచ్చారు. తొలుత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పలు కంపెనీల్లో పనిచేసిన ఖురేషీ, ఉగ్రవాద సంస్థ ఏర్పాటు అనంతరం బాంబుల తయారీలో దిట్టగా మారాడు.

హైదరాబాద్ పేలుళ్లతో ఖురేషీకి లింకు!

2007 తరువాత దక్షిణాది నగరాల్లో నివాసం

ఐఎంలోకి ముస్లిం యువకుల రిక్రూట్‌మెంట్ ■ ఖురేషీపై 21 కేసులు

ఢిల్లీలో పట్టుబడిన ఉగ్రవాది, ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం) సహవ్యవస్థాపకుడు, నిషేధిత ఇండియన్ ఇస్లామిక్ విద్యార్థి సంస్థ(సిమి) నాయకుడు అబ్దుల్ సుభాన్ ఖురేషీకి హైదరాబాద్‌తో కూడా సంబంధాలున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. 2007లో వారణాసి పేలుళ్ల తర్వాత కేసులు నమోదైతే సిమి తరపున ఆ కేసులు వాదించేందుకు అక్కడి న్యాయవాదులు ముందుకు రాలేదని, ఆ నేపథ్యంలో ఖురేషీ దక్షిణాది నగరాలపై దృష్టి సారించాడని పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 2007-2008 ప్రాంతంలో ఖురేషీ బెంగళూరు, హైదరాబాద్‌లలో ఉంటూ ఐటీ కంపెనీల్లో ఉద్యోగం చేసినట్లు చెప్పారు. ఆ సమయంలోనే కేరళ, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు యువకులను ఉగ్రవాదంవైపు మళ్లించాడని, పలువురిని ఐఎంలో రిక్రూట్ చేశాడని తెలిపారు. 2007లో హైదరాబాద్‌లో జరిగిన పేలుళ్లతో ఖురేషీ ప్రమేయం ఉన్నట్లు అనుమానాలున్నాయి. వివిధ ప్రాంతాల్లో పేలుళ్లకు సంబంధించి ఖురేషీపై 21 కేసులున్నట్లు తెలిసింది. దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా ఖురేషీ తరచూ పేర్లు మార్చుకున్నాడని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కేసుల విచారణ కోసం ఖురేషీని ఇక్కడికి తీసుకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

చీలిన ప్రపంచానికి చికిత్స!

ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సు వేదికగా యత్నాలు

వివాదాస్పద చర్చలకూ అవకాశం

నేడు డబ్ల్యూఈఎఫ్ ప్లీనరీలో ప్రధాని మోదీ ప్రారంభోపన్యాసం

దావోస్, జనవరి 22:

ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైన ప్రపంచ దేశాలను ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సు వేదికగా ఒక్కటి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంతా బాగానే ఉన్నా అసలు సమస్య అగ్రరాజ్యం అమెరికాతోనే ఎదురవుతున్నది. 'చీలిన ప్రపంచానికి ఉమ్మడి భాగస్వామ్య భవిష్యత్ నిర్దేశం' అనే ప్రధాన నినాదంతో ఈ ఏడాది డబ్ల్యూఈఎఫ్ సదస్సు జరుగుతున్నది. ఇది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'అమెరికా ఫస్ట్' నినాదానికి భిన్నంగా ఉన్నది. భద్రతావాదం, కట్టుదిట్టమైన విధానాలతో కూడిన ఒంటరితత్వం అనే ప్రధాన లక్షణాలతో 'అమెరికా ఫస్ట్' విధానం కొనసాగుతున్నది. 'ప్రపంచ వ్యవస్థలు కుప్పకూలడమనే అంశమే ప్రస్తుతం మన ముందున్న ప్రధాన సవాలు. ఈ పరిస్థితిలో మార్పు రావడం లేదు. ప్రపంచ గతిని మార్చే శక్తి మన చేతుల్లోనే ఉన్నది. ఇదే అంశంపై డబ్ల్యూఈఎఫ్ కృషి చేస్తున్నది' అని డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడు క్లాస్ స్క్వాబ్ పేర్కొన్నారు. 'దాదాపు 70 మంది దేశాధినేతలు, ఇతర ప్రముఖులు ప్రపంచ వాణిజ్యంలో ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ సహకారాన్ని అందిస్తారని భావిస్తున్నాం' అని డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు బోర్జే బ్రెండె పేర్కొన్నారు. కాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం నాడు సదస్సులో ప్రసంగించాల్సి ఉన్నది. తమ దేశంలో ప్రభుత్వం మూతపడటంతో ట్రంప్ దావోస్ పర్యటనపై స్పష్టత లేదని అమెరికాకు చెందిన ఓ అధికారి తెలిపారు. పదవి చేపట్టినప్పటి నుంచీ ఇప్పటివరకు ప్రపంచీకరణ, సమన్వయ విధానం కోసం ట్రంప్ చేసింది ఏమీలేని నేపథ్యంలో సదస్సులో ఆయన ఏం మాట్లాడుతారనేది ఆసక్తిగా మారింది. ట్రంప్ కంటే రెండురోజుల ముందు జర్మనీ చాన్స్‌లర్ ఏంజిలా మెర్కెల్ యూరోపియన్ వ్యవహారాలపై మాట్లాడనున్నారు. యూరప్‌లో సంస్కరణలు అమలు చేయాలని కోరుతున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడే రోజే మెర్కెల్ ప్రసంగించనున్నారు. మరోవైపు గతంలో మహిళలకు ప్రాతినిధ్యం లేదన్న విమర్శల నేపథ్యంలో ఈసారి మహిళల అధ్యక్షతన ఏడు బృందాలను ఏర్పాటు చేశారు.



జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న స్విట్జర్లాండ్ అధికారులు

దావోస్‌కు చేరుకున్న ప్రధాని మోదీ

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ బయల్దేరిన ప్రధాని నరేంద్రమోదీ సోమవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు చేరుకున్నారు. మంగళవారం జరుగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ప్లీనరీలో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తారు. 20 ఏండ్ల తరువాత డబ్ల్యూఈఎఫ్‌కు హాజరవుతున్న మొదటి భారత ప్రధాని మోదీ. దావోస్‌లో ప్రపంచ సీఈవోలకు భారత్ ఇచ్చే విందులో మోదీ పాల్గొంటారు. అంతకుముందు స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలైన్ బెర్సెట్‌ను కలుసుకుంటారు. స్విస్ ప్రధాని స్టీఫన్ లోఫ్వెన్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ట్వీట్ చేశారు.

5000 మంది సైనికులతో భద్రత

సదస్సు వేదికతోపాటు దావోస్ అంతటా నిషేధాజ్ఞలు

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) భద్రత కోసం స్విట్జర్లాండ్ ప్రభుత్వం రూ.60.45 కోట్లు (9.37 మిలియన్ డాలర్లు) ఖర్చు చేస్తున్నది. భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌లతోపాటు 70 దేశాల అధినేతలు సదస్సుకు హాజరవుతున్నారు. ఇంకా 2,500 మందికి పైగా అత్యున్నత స్థాయి రాజకీయ నాయకులు, ఆర్థిక, వాణిజ్య, వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారు. అసాధారణ రీతిలో 5000 వేల మంది సైనికులతోపాటు స్నిప్పర్ డాగ్స్, స్థానిక పోలీసులు, స్విస్ సాయుధ బలగాలు భద్రతా బాధ్యతలు చేపట్టాయి. సదస్సు వేదిక రిసార్ట్, అక్కడికి వెళ్లే మార్గాలు, దావోస్‌లోని హోటళ్లన్నీ సైనికుల నిఘా నీడలో ఉన్నాయి. దావోస్ పట్టణం నలుమూలల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. సైనికులు, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గ్రౌబుడెన్ (గ్రిస్సన్స్) రాష్ట్ర ప్రభుత్వం.. స్విస్ సాయుధ బలగాలు, రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసుల సహకారంతో గ్రిస్సన్స్ మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసింది. దావోస్ సదస్సు వద్ద పౌర ప్రభుత్వానికి మద్దతుగా సాయుధ బలగాలను నియుక్తులను చేసినట్లు స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రకటించింది. సదస్సు జరుగుతున్న 'డబ్ల్యూఈఎఫ్ కాంగ్రెస్ సెంటర్, హోటల్ బెల్వేడేర్, హిల్టన్ హోటల్, ఇంటర్ కాంటినెంటల్ హోటల్ పరిసర ప్రాంతాల్లోకి సామాన్య పౌరులను అనుమతించడం లేదు. దావోస్ పట్టణ నలుమూలల భద్రతా బలగాల నిఘా కొనసాగుతున్నది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నారు. గగనతలంలో విమానాల రాకపోకలను నిలిపివేశారు. ఈ నెల 26న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగం సందర్భంగా భద్రతను మరింత పటిష్ఠం చేసే అవకాశం ఉన్నది.



సమ్మిళిత వృద్ధిలో భారత్‌కు 62వ స్థానం

సమ్మిళిత అభివృద్ధి సూచిలో ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) భారత్‌కు 62వ స్థానాన్ని ఇచ్చింది. ఈ సూచిలో చైనా 26వ స్థానంలో, పాకిస్థాన్ 47వ స్థానంలో ఉన్నాయి. ఇక శ్రీలంక (40), బంగ్లాదేశ్ (34), నేపాల్ (22) కూడా భారత్‌కన్నా ముందు వరుసలో ఉన్నాయి. ప్రపంచంలో అత్యంత అధునాతన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నార్వే అగ్రస్థానంలో కొనసాగగా, అభివృద్ధి చెందుతున్న దేశాలలో లిథువేనియా మళ్లీ తన మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంది. సోమవారం డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు ప్రారంభం కావడానికి ముందు ఈ నివేదికను విడుదల చేశారు. జీవనప్రమాణాలు, పర్యావరణ సమతుల్యత, రుణభారం నుంచి భవిష్యత్ తరాలను రక్షించేందుకు తీసుకొనే చర్యల ఆధారంగా ఆయా దేశాల ఆర్థికాభివృద్ధిని నిర్ణయించామని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. ఇక ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయ దేశాలలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ప్రభుత్వం, వాణిజ్యం, స్వచ్ఛంద సంస్థలు, మీడియాకు సంబంధించి ప్రజల విశ్వాసం ఆధారంగా ఎడెల్‌మ్యాన్ ట్రస్ట్ బారోమీటర్ ఈ సర్వే నిర్వహించింది. క్రితం ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భారత్‌పై 'నమ్మకం కాస్త సడలింది' అని ఆ సర్వే నివేదిక తెలిపింది. నైపుణ్యత పోటీ సూచిలో గత ఏడాది 96వ స్థానంలో నిలిచిన భారత్ ఈసారి తన స్థానాన్ని మెరుగుపరుచుకుని 81వ స్థానానికి చేరింది.



దావోస్‌లో భారత్ ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్

తీరు మారని పాక్

జమ్ము, రాజౌరి జిల్లాల్లో వరుసగా ఐదో రోజు కాల్పులు

12 మందికి చేరిన మృతులు.. 60 మందికి పైగా గాయాలు

సురక్షిత బంకర్లు నిర్మించాలని స్థానికుల డిమాండ్



మోర్టార్‌ను చూపుతున్న మహిళ

జమ్ము/ ఆర్‌ఎస్ పురా: జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దుల్లో వరుసగా ఐదో రోజు పాక్ సేనలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు జమ్ము, రాజౌరీ జిల్లాల్లో అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ),ఎల్వోసీ పై మూడు సెక్టార్ల పరిధిలో విచక్షణారహితంగా భారత సైనిక పోస్టులపై, సరిహద్దు గ్రామాలపై పాక్ సైనికులు భారీగా కాల్పులకు తెగబడ్డారు. మోర్టార్లు ప్రయోగించారు. దీంతో ఒక పౌరుడు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. గురువారం నుంచి పాక్ జరుపుతున్న కాల్పుల్లో 12 మంది మృతి చెందగా 60 మందికి పైగా గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జమ్ములోని ఎల్వోసీ, ఐబీ పరిధిలో స్కూళ్లను మూసివేశారు. దీంతో సరిహద్దు గ్రామాల ప్రజలు తమ ఇండ్లకు రావడానికి భయపడుతున్నారు. తమకు ప్రభుత్వం మరో సురక్షిత ప్రాంతంలో భూమి కేటాయించి, త్వరితగతిన బంకర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. జమ్ము డివిజన్ పరిధిలో ఎల్వోసీ వెంబడి 14,460 బంకర్ల నిర్మాణానికి కేంద్రం రూ.415.73 కోట్లు మంజూరు చేసింది. తమ జీవితం నరకప్రాయమైందని సరిహద్దు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఉద్రిక్తత మధ్య తమ పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

క్యాన్సర్‌పై పోరుకు భారతీయ వైద్యం

మెరుగైన చికిత్స విధానాలను అన్వేషించాలి: ఉపరాష్ట్రపతి



ముంబై: భారతీయ ప్రాచీన వైద్య విధానాలతో క్యాన్సర్ వ్యాధిని నయం చేయడానికి మార్గాలను కనుగొనాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వైద్య పరిశోధకులను కోరారు. ముంబైలోని టాటా స్మారక కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేషన్ ఉత్సవంలో ఆయన మంగళవారం ప్రసంగిస్తూ పది ప్రాణాంతక వ్యాధుల్లో క్యాన్సర్ కూడా ఒకటని, భారత్‌లో ఇది పెద్ద ప్రజా సమస్యగా మారిందని తెలిపారు. క్యాన్సర్ చాలా ఖరీదైన జబ్బుగా మారిందని, దీని చికిత్సకు డబ్బు చాలా ఖర్చు పెట్టాలన్నారు. కాబట్టి ఈ వ్యాధికి ఆయుర్వేదం వంటి వైద్య విధానాల ద్వారా తక్కువ ఖర్చు కాగల ప్రత్యామ్నాయ చికిత్సలు, మందులను కనుగొనాలని శాస్త్రవేత్తలను కోరారు. మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'పద్మావత్' మళ్లీ మొదటికి..

- సుప్రీంకోర్టులో మళ్లీ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల పిటిషన్లు
- తీర్పుపై సడలింపు ఇవ్వాలని పిటిషన్.. నేడు విచారణ
- ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో రాజ్‌పుత్‌ల నిరసనలు

న్యూఢిల్లీ: పద్మావత్ సినిమా వివాదం రోజుకో మలుపు తిరుగుతున్నది. చిత్రం దేశవ్యాప్త విడుదలకు సుప్రీంకోర్టు అనుమతించడంతో వివాదం సద్దుమణుగుతుందని అంతాభావించారు. కానీ ఓవైపు రాజ్‌పుత్‌లు ఆందోళనలతో అగ్గిని రాజేస్తుంటే, మరోవైపు మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు న్యాయపోరాటానికి సిద్ధమయ్యాయి. ఇరు రాష్ట్రాలూ ఈ సినిమాపై మరోసారి సుప్రీంకోర్టు గడప తొక్కాయి. పద్మావత్ చిత్రంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని ఇచ్చిన ఆదేశాల్లో కొంత సడలింపు ఇవ్వాలని కోరుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వాదనలు విననున్నది. కాగా, సెన్సార్ బోర్డ్ అనుమతి లభించడంతో ఈ చిత్రాన్ని ఈనెల 25న దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు

పద్మావత్ చిత్రాన్ని విడుదల చేయకుండా అడ్డుకోవాలని రాజ్‌పుత్ కర్ణిసేన ప్రయత్నిస్తున్నది. సోమవారం అహ్మదాబాద్‌లోని ఓ థియేటర్‌పై ఫర్నిచర్‌ను ఆందోళనకారులు దాడిచేసి ధ్వంసం చేశారు. ఉత్తర గుజరాత్‌లో కర్ణిసేన, మహాకాళ్ సేన హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం వందకుపైగా మార్గాల్లో బస్సుల్ని రద్దు చేసింది. నోయిడాలోని డీఎన్‌డీ ఫ్లైఓవర్‌పై ఉన్న టోల్‌ప్లాజాకు నిప్పంటించారు.




చిత్తోడ్‌గఢ్‌లో కత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

కంప్యూటర్లను ధ్వంసం చేసి, టోల్‌కౌంటర్లను తగులబెట్టారు. గ్రేటర్ నోయిడా పారీచౌక్ వద్ద నిరసనకారులు భారీ ప్రదర్శన చేపట్టారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో కర్ణిసేన సభ్యులు పలు రహదారులను స్తంభింపజేశారు. టైర్లను రోడ్లపై వేసి తగులబెట్టారు. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లోనూ ప్రదర్శన నిర్వహించిన రాజ్‌పుత్‌లు థియేటర్ల యజమానులకు నిరసనగా గులాబీలను అందజేశారు. జౌహర్ క్షత్రాణి మంచ్ నేతృత్వంలో చిత్తోడ్‌గఢ్‌లో 200మందికిపైగా రాజ్‌పుత్ మహిళలు కత్తులతో ప్రదర్శన నిర్వహించారు. చిత్తోడ్‌గఢ్ కోటలో రాణి పద్మావతి ఆత్మార్పణ చేసుకున్న ప్రదేశం నుంచి 'స్వాభిమాన్‌యాత్ర'ను ప్రారంభించారు. చిత్రాన్ని నిషేధించకపోతే జైపూర్‌లోని అమెర్, నహర్‌గఢ్ కోట ద్వారాలను మూసివేస్తామని కర్ణిసేన అధ్యక్షుడు మహిపాల్ సింగ్ మక్రానా హెచ్చరించారు.

లోయా మృతి సీరియస్ అంశమే

- అధారాల్లేకుండా ఎవరికీ కళంకాన్ని ఆపాదించొద్దు: సుప్రీం
- కేసు ఫైళ్లన్నీ అప్పగించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 22: సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి బీహెచ్ లోయా మృతి తీవ్రమైన అంశమని, దానిపై విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లను విషయప్రాధాన్యత దృష్ట్యా సీరియస్‌గానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా పేరును న్యాయవాది ప్రస్తావించినప్పుడు కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సీబీఐ కోర్టు న్యాయమూర్తి బీహెచ్ లోయా 2014లో ఓ వివాహానికి హాజరైనప్పుడు నాగ్‌పూర్‌లో మృతిచెందారు. లోయా మృతిపై అనుమానాలున్నాయంటూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలో జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ ప్రారంభించింది. ఈ సందర్భంగా బాంబే హైకోర్టు న్యాయవాదుల సంఘం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే మాట్లాడుతూ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా పేరును ప్రస్తావించారు. సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో అతడిని (అమిత్‌షాను) కాపాడేందుకు ఇదంతా చేశారంటూ ఆరోపించారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. తగిన ఆధారాలు లేకుండా ఒక వ్యక్తికి కళంకాన్ని ఆపాదించడం సరికాదని న్యాయవాదిని మందలించింది. లోయా మృతికి సంబంధించిన అన్ని రికార్డులను తమకు అందజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. లోయా మృతిపై దాఖలైన పిటిషన్లనూ తమకు బదలాయించాలని బాంబే హైకోర్టుకు సూచించింది.



బీహెచ్ లోయా



జస్టిస్ దీపక్ మిశ్రా

ఢిల్లీ హైకోర్టులో ఆప్ పిటిషన్ల ఉపసంహరణ!

న్యూఢిల్లీ: అనర్హత వేటుకు గురైన ఢిల్లీ ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు రాష్ట్ర హైకోర్టులో కేంద్ర ఎన్నికల సంఘాని (ఈసీ)కి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. తమపై రాష్ట్రపతి అనర్హత వేటు వేసిన నేపథ్యంలో ఈసీకి వ్యతిరేకంగా ఉన్న పాత పిటిషన్ చెల్లకుండా పోయింది. దీంతో మరో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. 20 మంది ఆప్ ఎమ్మెల్యేల తరపున సోమవారం హైకోర్టు విచారణకు హాజరైన మనీశ్ వశిష్ఠ్.. తమ పిటిషన్ల ఉపసంహరణకు అనుమతించాలని కోరగా జస్టిస్ రేఖాపల్లి అంగీకరించారు.

116 మంది బీజేపీ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించండి

మధ్యప్రదేశ్‌లో లాభదాయక పదవులపై ఈసీకి ఆప్ డిమాండ్

భోపాల్: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఢిల్లీలోని తమ 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన మరుసటి రోజే అధికార బీజేపీ లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దాడికి దిగింది. మధ్యప్రదేశ్‌లో లాభదాయక పదవుల్లో కొనసాగుతున్న 116 మంది బీజేపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు జన్ భగీరథి సమితి కాలేజీల్లో సభ్యులుగా ఉన్నారని ఆప్ ఎంపీల కన్వీనర్ అలోక్ అగర్వాల్ ఆరోపించారు.

కాంగ్రెస్‌తో మళ్లీ చేతులు కాల్చుకోము!

జేడీ(ఎస్) అధ్యక్షుడు దేవెగౌడ

మంగళూరు: వచ్చే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి ఎన్నికల అవగాహన ఉండబోదని మాజీ ప్రధాని, జనతాదళ్ (సెక్యులర్) పార్టీ అధ్యక్షుడు హెచ్‌డీ దేవగౌడ స్పష్టంచేశారు. గతంలో ఈ జాతీయ పార్టీతో పొత్తు కుదుర్చుకొని చేతులు కాల్చుకున్నామన్నారు. సోమవారం మంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి జేడీఎస్ అభ్యర్థులు పోటీచేస్తారని చెప్పారు. కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలను దేవగౌడ తప్పుపట్టారు.

ప్రముఖులకే ప్రధాని మోదీ కౌగిలింత

రాహుల్ గాంధీ ఎద్దేవా

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ప్రముఖులనే కౌగిలించుకుంటారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. సాధారణ పౌరులు, కార్మికులు, జవాన్లను మోదీ కౌగిలించుకోరని రాహుల్ సోమవారం ట్వీట్ చేశారు. ఒక టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రపంచ దేశాల అధినేతలతో కౌగిలింతలను సమర్థించుకున్న ప్రధాని, తనకు ప్రొటోకాల్ నిబంధనలు తెలియవని, సామాన్యుడినన్నారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్

సుపరిపాలనకు సీఎం కేసీఆర్ కృషి: డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

తలకొండపల్లి: బడుగు, బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి పరంగా దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా ముందుకు సాగుతున్నదని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో రూ.77 లక్షలతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డితో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మహమూద్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగేలా ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషి చేస్తున్నారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఐదు లక్షల ఎకరాలకు కేఎల్‌ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ అహర్నిషలు శ్రమిస్తున్నారని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు రూ.40 వేల కోట్ల బడ్జెట్ ఉంటే, స్వరాష్ట్రంలో అది రూ.1.80 లక్షల కోట్లకు చేరిందన్నారు. పరిపాలన సులువుగా సాగేందుకు నూతన జిల్లాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు, కేఎల్‌ఐ ప్రాజెక్టుల ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు టెండర్లు పిలువనున్నట్టు తెలిపారు. ప్రతి మండలంలో స్టేడియం నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టనున్నట్టు చెప్పారు. ఫార్మాసిటీ, ప్రాజెక్టు నిర్మాణాల్లో భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, స్థలదాత అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మెల్యే రోజా ఇంట్లో చోరీ



మణికొండలోని ఎమ్మెల్యే రోజా ఇల్లు

శేరిలింగంపల్లి: ప్రముఖ సినీ నటి, ఏపీ వైసీపీ ఎమ్మెల్యే రోజా ఇంట్లో చోరీ జరిగింది. హైదరాబాద్ మణికొండ పంచవటి కాలనీలో గల ఆమె ఇంట్లోని బెడ్‌రూంలో చెక్క అల్మారా నుంచి దాదాపు రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అదృశ్యమయ్యాయి. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ పంచవటి కాలనీలో వైసీపీ ఎమ్మెల్యే రోజా, సెల్వమణి దంపతులు నివాసం ఉంటున్నారు. జనవరి 11న వారు కుటుంబంతో సహా చెన్నైకి వెళ్లారు. ఇంట్లోని పనిమనిషి రామలక్ష్మి 12వ తేదీన ఇంటికి తాళం వేసి తాళంచెవులు పక్కింట్లో ఇచ్చింది. ఈ నెల 18న చెన్నై నుంచి తిరిగి వచ్చిన రోజా దంపతులు బెడ్‌రూంలోని చెక్క అల్మారాలో ఉంచిన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు ఈ నెల 21న గుర్తించారు. ఈ మేరకు సెల్వమణి సోమవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన బెడ్‌రూంలోని అల్మారాలో ఉన్న వెండి వస్తువులు, లక్ష్మీదేవి దీపం, వెండి కప్పులు, బంగారు ఆభరణాలు, నెక్లెస్, వజ్రాలు పొదిగిన చెవిదిద్దులు, వజ్రాల బిళ్ల, బంగారు గాజులు 2.. మొత్తం 14 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దొంగ నాటకాలు!

- విడాకులు ఇస్తున్న ఇతర రాష్ట్రాల దొంగలు
- కుటుంబసభ్యులను విచారణ నుంచి తప్పించే ఎత్తుగడ
- మహారాష్ట్రకు వెళ్లిన మన పోలీసులకు వింత అనుభవం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వరుస దొంగతనాలతో ముప్పుతిప్పలు పెడుతున్న దొంగలు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో మరింత ఇబ్బంది పెడుతున్నారు. సంక్రాంతి పండుగకు ముందు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో పలు చోరీలకు పాల్పడ్డ ఓ ఘరానా నిందితుడికి సంబంధించిన వేలిముద్రలతోపాటు పలు ఆధారాలు లభించాయి. దీంతో ఈ మూడు ప్రాంతాల పోలీసులు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్తంగా అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలో అతడు మహారాష్ట్రలో నివాసం ఉంటున్న చిరునామా తెలిసింది. కేసుల చిక్కుముడి వీడిపోతుందనే ఆశతోపాటు చోరీ సొత్తును రికవరీ చేయొచ్చనే నమ్మకంతో పోలీసులు మహారాష్ట్రకు వెళ్లి దొంగ ఇంటి తలుపు తట్టారు. పోలీసులు ఆ ఇంట్లోని వ్యక్తులకు దొంగ పేరు చెప్పగానే.. అతను ఎవరో మాకు తెలియదన్నారు. పోలీసులు గట్టిగా నిలదీయడంతో ఆ ఇంట్లోని మహిళ.. అతడితో తనకు ఎలాంటి సంబంధం లేదని, విడాకులు తీసుకున్నానని తేల్చిచెప్పింది. విడాకుల ధ్రువీకరణ పత్రాన్ని ఆధారంగా చూపెట్టింది. దీంతో పోలీసుల ఆశలు నీరుగారిపోయాయి. కొన్నాళ్లు అక్కడే మకాం వేసి ఆరా తీసినా ఆశించిన స్థాయిలో సమాచారం దొరుకలేదు. దీంతో వెనుదిరిగారు. పోలీసులు ఈ విడాకుల వ్యవహారంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నేరగాళ్లు తమ కుటుంబ సభ్యులను పోలీసుల విచారణ నుంచి తప్పించేందుకు విడిపోయినట్టు నాటకాలు ఆడుతున్నట్టు సమాచారం అందింది. ఇలా చేయడం వల్ల చోరీ చేసిన సొత్తును ఇంటి దగ్గర పెట్టినా డైవర్స్ సర్టిఫికెట్ ఉండటంతో పోలీసులు ఏమీ చేయలేరనే ఉద్దేశంతో ఈ ప్లాన్ వేసినట్టు భావిస్తున్నారు. ఈ దొంగ మహా మాయగాడని తెలుస్తున్నది. ప్రతీసారి కొత్త బృందాన్ని ఏర్పాటు చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్టు తేలింది.

చనిపోయినట్టు ధ్రువపత్రం.. ఆపై చోరీలు

సైబరాబాద్ పరిధిలో ఓ దొంగ 2007లో మృతి చెందినట్టు అతడి కుటుంబసభ్యులు పోలీసులకు పత్రాలు సమర్పించారు. అయితే 2016లో సైబరాబాద్‌తోపాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో జరిగిన వరుస చోరీలను పరిశీలించగా, ఆయా ఘటనా స్థలాల్లో ఇనుప గ్రిల్స్‌పై ఆ దొంగ వేలిముద్రలు దొరికాయి. దీంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. బతికున్నాడని నిర్ధారించుకొని అతడి కోసం గాలిస్తున్నా చిక్కడం లేదు.



మాజీ డీజీపీ రాగాల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

మాజీ డీజీపీ రాగాల మృతి తీరనిలోటు

ఉప్పల్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ ఆర్‌కే రాగాల మృతి తీరనిలోటని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ హబ్సిగూడలోని కాకతీయనగర్‌లోని ఆర్‌కే రాగాల నివాసానికి వచ్చిన డీజీపీ మహేందర్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి గౌరవవందనం చేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ తాను కొత్తగా సర్వీసులో చేరిన రోజుల్లో రాగాల డీజీగా ఉన్నారని గుర్తుచేశారు. రాగాల కుటుంబసభ్యులకు పోలీస్‌శాఖ వెన్నంటి ఉంటుందన్నారు. డీజీపీ వెంట ఏసీపీ నర్సయ్య, సీఐ గ్యార జగన్ తదితరులు పాల్గొన్నారు.

డేటింగ్ పేరుతో సైబర్‌చీటర్ల బురిడీ

రూ.4.08 లక్షలు మోసపోయిన యువకుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: డేటింగ్ పేరుతో ఓ విద్యార్థికి సైబర్‌చీటర్లు రూ.4.08 లక్షలు టోకరా వేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లికి చెందిన అభిషేక్ వివిధ వెబ్‌సైట్లను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో డ్యాషీడేటింగ్.ఇన్ అనే ఓ వెబ్‌సైట్ కనిపించడంతో అందులో తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తర్వాత గుర్తుతెలియని ఓ మహిళ ఫోన్ చేసి తన పేరు పూనం అని, నీవు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నావు, వెయ్యి రూపాయలు డిపాజిట్ చేస్తే డేటింగ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ వ్యవహారం పూర్తవుతుందని సూచించింది. దీంతో అభిషేక్ డబ్బును వారు సూచించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశాడు. పూనం మళ్లీ ఫోన్ చేసి రూ.20,800 డిపాజిట్ చేయించింది. ఇలా పలుమార్లు డేటింగ్ పేరుతో అభిషేక్ నుంచి మొత్తం రూ.4,08,798 లాగారు. ఇంత డబ్బు డిపాజిట్ చేసినా డేటింగ్ కోసం వెబ్‌సైట్ నిర్వాహకులు ఎలాంటి అవకాశాలు కల్పించకపోవడంతోపాటు, సెల్‌ఫోన్లు స్విచ్ అఫ్ చేశారు. తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న నుమాయిష్‌కు సందర్శకుల తాకిడి కొనసాగుతున్నది. వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు, అన్ని రకాల వస్తువులు అందుబాటు ధరల్లో దొరుకుతుండటంతో నగరవాసులు కుటుంబ సమేతంగా తరలివస్తున్నారు. ఆహ్లాదం కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉండటంతో ఇక్కడికి వచ్చేందుకు పిల్లలు, యువత ఉత్సాహం చూపుతున్నారు. ఇక్కడి స్టాళ్లలో దొరుకుతున్న విభిన్న రుచులను ఆస్వాదిస్తున్నారు. సాయంత్రం పూట విద్యుత్ ధగధగలు నుమాయిష్‌కు మరింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్‌లో నకిలీ ప్రొసీడింగ్స్!

- డిజిటల్ సంతకం, ప్లాన్ సరిగా లేకుండానే ధ్రువీకరణ పత్రం
- సంగారెడ్డిలోని ప్లాట్ క్రమబద్ధీకరణలో వెలుగుచూసిన కొత్తకోణం
- హెచ్‌ఎండీఏను ఆశ్రయించిన బాధితుడు
- విచారణకు ఆదేశించిన కమిషనర్ చిరంజీవులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మధ్యవర్తుల సాయంతో లే అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) ధ్రువీకరణ పత్రాలు పొందినవారు అప్రమత్తం కావాల్సిన తరుణమిది. అనధికారిక లే అవుట్లలో స్థలాలు కొని మోసపోయిన బాధితులకు ఆయా స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ రూపంలో సదవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. గత అనుభవాల దృష్ట్యా దరఖాస్తుల స్వీకరణ మొదలు అనుమతుల (ఫైనల్ ప్రొసీడింగ్స్) జారీ వరకు పారదర్శకంగా నిర్వహించేందుకు హెచ్‌ఎండీఏ ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆన్‌లైన్ చేసింది. 1.71లక్షల దరఖాస్తులు రాగా అధికారులు పరిశీలించి అన్ని అర్హతలు ఉన్న 90వేల దరఖాస్తులకు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు మంజూరు చేశారు. ఇదే సమయంలో కొందరు మాత్రం అడ్డదారిలో దళారులను నమ్ముకొని దరఖాస్తుల ప్రక్రియను వారి ద్వారా పూర్తి చేసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్ పొందారు. అయితే ఆ ధ్రువీకరణ పత్రాలు నకిలీవని తేలుతుండటంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

దళారీలను నమ్ముకొని..

సంగారెడ్డిలో హేమలత్ అనే వ్యక్తి మహేశ్‌గౌడ్ అనే వ్యక్తికి ఎల్‌ఆర్‌ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్ పొందిన ప్లాట్‌ను విక్రయించారు. ఆ స్థలంలో భవన నిర్మాణం చేపట్టేందుకు మహేశ్‌గౌడ్ సిద్ధపడగా.. చివరి నిమిషంలో ఫైనల్ ప్రొసీడింగ్‌లో డిజిటల్ సంతకం లేదని, ప్లాన్ సరిగాలేదని గుర్తించి హెచ్‌ఎండీఏను ఆశ్రయించారు. మహేశ్‌గౌడ్ అభ్యర్థనను పరిశీలించిన హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు ఆ ప్రొసీడింగ్స్ నకిలీవని తేల్చారు. హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి పొందిన ఎల్‌ఆర్‌ఎస్ ధ్రువీకరణ పత్రంలో బ్యాక్ గ్రౌండ్‌లో ఎల్‌ఆర్‌ఎస్ నంబర్‌తోపాటు ప్లాన్‌లో అధికారి డిజిటల్ సంతకం ఉంటుందని వివరించారు. నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్‌పై విచారించగా రాజేశం అనే మధ్యవర్తి ద్వారా ఈ అనుమతులు పొందినట్టు గుర్తించారు. దీంతో కమిషనర్ తక్షణమే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను రంగంలోకి దింపి విచారణ జరిపిస్తున్నారు. రెండు రోజులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పలువురు ప్లాట్ యాజమానుల నుంచి వివరాలు సేకరించగా రాజేశం అనే వ్యక్తి దళారీ అవతారం ఎత్తి మోసగించినట్టు ప్రాథమికంగా తేల్చారు. ప్రస్తుతం రాజేశం ఫోన్‌లో అందుబాటులో లేడని, హైదరాబాద్‌లోని చింతల్‌లో నివాసం ఉంటున్నాడని గుర్తించారు. రాజేశం ఇంటికి వెళ్లి ఈ తరహా తతంగం నడిపిస్తున్న ముఠా గుట్టును విప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ మంగళవారం సాయంత్రంలోగా కమిషనర్‌కు నివేదిక ఇవ్వనున్నది.

మధ్యవర్తుల ప్రమేయం ఉండదు

ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు పొందే క్రమంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అన్నీ ఆన్‌లైన్‌లో మంజూరు చేస్తున్నాం. హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి పొందిన ఎల్‌ఆర్‌ఎస్ ధ్రువీకరణ పత్రాల్లో డిజిటల్ సంతకాలతో కూడిన ప్లాన్‌లు జారీ చేస్తున్నాం. అనుమతులు పొందిన వారికి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు స్టేటస్ తెలుసుకునే వీలును కల్పించాం. www.hmda. gov.inలోకి లాగిన్ అయిన వెంటనే ఎడమవైపు 'ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్'ను క్లిక్ చేయండి. తర్వాత వెబ్‌సైట్ కుడివైపున అనుమతి పొందిన ఎల్‌ఆర్‌ఎస్ డౌన్‌లోడ్ ఆప్షన్ ఉంటుంది. అందులో సంబంధిత ఎల్‌ఆర్‌ఎస్ నంబర్‌ను ఎంటర్ చేస్తే ఫైనల్ ప్రొసీడింగ్, ప్లాన్‌ను చూసుకోవచ్చు. ఈ క్రమంలో ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. పక్కాగా వ్యవహరిస్తున్నా కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నట్టు మా దృష్టికి వస్తున్నది. సంగారెడ్డిలో నకిలీ అనుమతులు పొందినట్టు నా దృష్టికి రాగానే విచారణకు ఆదేశించా. ఈ విషయంలో ఏవైనా అనుమానాలు ఉంటే నేరుగా సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చు. దళారుల గురించి తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. అక్రమార్కులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- చిరంజీవులు, హెచ్‌ఎండీఏ కమిషనర్

అక్రమ కట్టడాలు ఆన్‌లైన్‌లోకి

ప్రత్యేక వెబ్‌పేజీని రూపొందిస్తున్న హెచ్‌ఎండీఏ • ప్రజలు ఫొటోతీసి నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం
ఫిర్యాదు నుంచి కూల్చివేత వరకు ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థ: హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు



వెబ్ పేజీ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అనధికారిక లే అవుట్లు, భవన నిర్మాణాలు చేపడుతున్న రియల్టర్లపై కొరడా ఝుళిపించేందుకు హెచ్‌ఎండీఏ సిద్ధమైంది. అక్రమ కట్టడాలను కూల్చడంతోపాటు, భవిష్యత్తులో వాటిని నియంత్రించేందుకు ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. 'హెచ్‌ఎండీఏ అనాథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్స్, లే అవుట్స్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం' పేరుతో వెబ్ బేస్డ్ వ్యవస్థ రూపకల్పనకు కమిషనర్ చిరంజీవులు శ్రీకారం చుట్టారు. పౌరులు తమ సమీపంలో అక్రమ కట్టడాలు జరుగుతుంటే ఫొటో తీసి హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో దానిని అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. దీనికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించేందుకు కమిషనర్ చిరంజీవులు సోమవారం శ్రేష్ఠ టెక్ సొల్యూషన్ కంపెనీ ప్రతినిధులు, హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం అధికారులతో తార్నాకలోని హెచ్‌ఎండీఏ కేంద్ర కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కంపెనీ ప్రతినిధులు ప్రజెంటేషన్ ఇవ్వగా, అందులో పలు మార్పులు సూచించారు. తాము ఇచ్చిన ఫిర్యాదు స్థితి ఏమిటి? అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు వంటివి ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకొనే అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఈ వ్యవస్థతో అక్రమ కట్టడాల నియంత్రణకు పకడ్బందీ వ్యవస్థ ఏర్పడుతుందని, అధికారుల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందన్నారు. సమావేశంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్లు నరేందర్, శ్రీనివాస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సుబ్రమణ్యం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎంఎఫ్ రహమాన్, శ్రేష్ఠ కంపెనీ సీఈవో అమరేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెనువెంటనే నివేదికలు

హెచ్‌ఎండీఏ అధికారులకు స్వయంగా గానీ, పౌరులు, మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా అక్రమ కట్టడాల సమాచారం అందితే వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించాలి. వెళ్లిన అధికారి ఎవరు? ఎప్పుడు పరిశీలించారు? ఆ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? లేవా? లేకపోతే స్థానిక ప్రజల (కనీసం ఇద్దరు వ్యక్తులు) సమక్షంలో పంచనామా నిర్వహించి అక్కడే సదరు అధికారి ఆన్‌లైన్‌లో నిర్మాణం ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తారు. అది అక్రమమని తేలితే స్థానిక సంస్థలకు చెందిన అధికారులు, జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తారు. తర్వాత నిబంధనలకు అనుగుణంగా కూల్చివేత చేపడుతారు. ఈ క్రమంలో ప్రతి అంశం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. అదేసమయంలో జిల్లా స్థాయి పర్యవేక్షణాధికారులకూ చేరుతుంది. కూల్చివేసిన కట్టడాలపై నిఘా కొనసాగించేలా స్థానిక సంస్థల అధికారులకు సమాచారం వెళ్తుంది. వాటిపై ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే కేసు విచారణ విషయాలు సైతం మానిటరింగ్ వ్యవస్థలో పొందుపరుస్తారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో కొనసాగుతున్న 31వ 'హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన'కు మేధావులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, పుస్తక ప్రియుల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. బుక్ ఫేర్‌లో నిత్యం జరుగుతున్న ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ప్లాటు మీది.. పార్కింగ్ ప్రభుత్వానిది!

- ప్రైవేట్ స్థలాల్లో పార్కింగ్ సదుపాయం
- స్థల యాజమానులకే నిర్వహణ బాధ్యత
- ఆదేశాలిచ్చిన పురపాలకశాఖ కార్యదర్శి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు అనుకూలంగా ఉన్న అన్ని వనరులనూ అధికారులు ఉపయోగించుకుంటున్నారు. వాణిజ్య సముదాయాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వాటి యజమానుల సహకారంతో పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో పార్కింగ్ సమస్య తీరడంతోపాటు, యజమానికి ఆదాయం లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. నగరంలో కీలక రహదారుల్లో ప్లాట్లు గల యజమానులు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ జీ రమేశ్‌ను సంప్రదించాలని పురపాలకశాఖ కార్యదర్శి అరవింద్ కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

నిత్యం 700 కొత్తవాహనాలు

ప్రతి రోజూ సుమారు 700 కొత్తవాహనాలు నగర రోడ్లపైకి వస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌తోపాటు, రద్దీ ప్రదేశాల్లో పార్కింగ్ సమస్య కూడా రోజురోజుకు తీవ్రమవుతున్నది. దీనిని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌లో కొత్తగా పది మల్టీలెవల్ కార్ పార్కింగ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశాల మేరకు ప్రైవేట్ డెవలపర్లకు కూడా ఇందులో స్థానం కల్పించారు. మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో అధికారులు ముందుగా ప్రత్యామ్నాయ పార్కింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో ఖాళీ స్థలాలున్నవారు జీహెచ్‌ఎంసీ అనుమతి తీసుకొని వాటిని పార్కింగ్ స్థలాలుగా ఏర్పాటుచేసుకోవచ్చు. ఇందులో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే పార్కింగ్ ఫీజును వసూలుచేయాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ (ఎస్టేట్స్ అండ్ హౌసింగ్) అదనపు కమిషనర్ జీ రమేశ్‌కు అప్పగించింది. నగరంలో ఖాళీ ప్లాట్లు ఉండి.. పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలనుకొనే వారు 9949546622 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా aceestateshousing@gmail.comకు మెయిల్ చేయవచ్చని జీహెచ్‌ఎంసీ సూచించింది. స్థల యజమానుల నుంచి అభ్యర్థనలను స్వీకరించాక జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తారు. ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తారు. అనంతరం ఫీజు నిర్ణయించి పార్కింగ్‌ను ఏర్పాటుచేసుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ఈ సౌలభ్యాన్ని పొందాలంటే ప్లాట్ల ఓనర్లు ఆ స్థలంపై లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

మాదిగల్లో అక్షరాస్యతకు ప్రత్యేక కార్యాచరణ

- టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్
- మేడ్చల్ జిల్లా కమిటీ నియామకం

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: మాదిగల అభివృద్ధే లక్ష్యంగా అక్షర జ్ఞానం ద్వారా చైతన్యం తీసుకురావడానికి టీఎమ్మార్పీఎస్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తుందని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య మాదిగ తెలిపారు. విద్య, సంక్షేమం, ఉద్యోగాల సాధన ద్వారా మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా రాష్ట్రంలోని 31 జిల్లాల్లో టీఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సోమవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమావేశం వారు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకొని మాదిగల్లో అక్షర జ్ఞానాన్ని నింపి చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. విద్యావ్యాప్తితోనే మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇంత కాలం విద్యకు దూరమైన మాదిగలను అక్ష్యరాస్యులుగా తీర్చిదిద్దడానికి టీఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ సాధనతోపాటు చెప్పు, డప్పు కళాకారులకు పెన్షన్ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్టు తెలిపారు. ఇందుకు త్వరలో 31 జిల్లాల్లో మహిళ, విద్యార్థి, లాయర్స్ ఫోరం, యువసేన కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు వెళ్తామన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా టీఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా హన్మకొండ ప్రేమ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోహిర్ లాజర్, ఉపాధ్యక్షులుగా మూరగుండ్ల సురేశ్, లింగంపల్లి ముత్యాలు, బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా వై హరిబాబు, కార్యదర్శులుగా అంజయ్య, నరేశ్, అశోక్, కృష్ణ, స్వామి, లక్ష్మణ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బొల్లం జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీ అమృత, ప్రధాన కార్యదర్శిగా ఇంటూరి అంజలి నియమితులయ్యారు. జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎం సాయిలు, అధికార ప్రతినిధిగా ఎన్ చినబాబు, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, కార్యదర్శులుగా ఎల్లయ్య, ఎం మల్లేశ్ నియమితులయ్యారు.

అంతర్జాతీయ స్థాయి సర్జరీలపై అవగాహన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వైద్యులకు అంతర్జాతీయ స్థాయి శస్త్ర చికిత్సలపై అవగాహన కల్పిస్తున్నట్టు కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ డైరెక్టర్ పీ రఘురామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వైద్యులకు ఇంగ్లాండ్‌కు చెందిన రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ద్వారా శస్త్ర చికిత్సల్లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మెంబర్‌షిప్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ పరీక్షలను మూడురోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శస్త్రచికిత్సలు చేసే యువ వైద్యులకు ఈ శిక్షణ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ శిక్షణకు ఇండియా సర్జన్స్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తున్నదని రఘురామ్ పేర్కొన్నారు.

విశ్రాంత ఐపీఎస్ కుమారుడికి టోకరా

రూ.3 లక్షల విలువైన బైక్‌తో ఉడాయించిన యువకులు

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ఖరీదైన బైక్ కొంటామని విశ్రాంత ఐపీఎస్ అధికారి కుమారుడిని నమ్మించి ఆ వాహనంతో ఉడాయించిన యువకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్రాంత ఐపీఎస్ ఇస్మాయిల్ పుల్లన్న కుమారుడు ఇస్మాయిల్ పవన్ కుమార్ బంజారాహిల్స్ రోడ్ నంబర్-4లో ఉంటున్నారు. వీరి ఇంట్లో పైలా అవినాశ్(24), దాసరి సుమంత్(24) అనే ఇద్దరు యువకులు అద్దెకు ఉండేవారు. ఐదునెలలు అద్దెకు ఉన్న తర్వాత పవన్‌కుమార్‌కు చెందిన ఖరీదైన కవాసాకీ ఈఆర్ 6ఎన్ సీరిస్ బైక్(టీఎస్09 ఈఎస్ 2850)ను తాము కొనుగోలు చేయాలనుకుంటున్నామని చెప్పారు. రూ.3 లక్షలకు బైక్‌ను కొంటామని నమ్మించిన ఆ యువకులు గత ఏడాది ఏప్రిల్ 4న టెస్టు డ్రైవ్ చేస్తామంటూ బైక్‌తోపాటు వెళ్లిపోయారు. రోజులు గడిచినా వెనక్కి తిరిగిరాలేదు. అనుమానం వచ్చి ఫోన్ చేయగా తాము అర్జెంట్ పనిమీద విశాఖపట్నం వచ్చామని, తిరిగి వచ్చిన వెంటనే డబ్బులు ఇస్తామని నమ్మబలికారు. ఎనిమిది నెలలుగా కాలయాపన చేసిన యువకులు ఇటీవల ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశారు. దాంతో తాను మోసపోయినట్టు గుర్తించిన పవన్‌కుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
మంగళవారం 23 జనవరి 2018
WWW.NTNEWS.COM

బలనం పట్టి ఓనమాలు నేర్చుకున్న బడిలోనే.. అడుగులకు వేగం పెంచి పరుగు ప్రాక్టీస్ చేసింది. తరగతి గది సమాజాన్ని పాఠం రూపంలో చెప్తే.. మైదానం సమాజంలో ముందుండేందుకు, ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు పరుగులు తీయమని చెప్పింది. పేదరికం అడుగడుగునా చేయి పట్టి ఆపేస్తున్నా.. అడుగుల వేగం పెంచి రాష్ట్రాలు దాటి పరుగులు పెట్టింది. 'నీ లక్ష్యం పెద్దదైతే.. విజయం నీ ముందు చిన్నబోతుంది' అనే మాటను నిజం చేస్తూ.. జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నది. ఒలింపిక్స్‌లో నా పరుగుతో దేశానికి స్వర్ణం సాధిస్తా అంటున్న పల్లెటూరి పరుగుల రాణి మహేశ్వరిని పరిచయం ఇది.

మార్నింగ్ వాక్.. జాగింగ్.. ఒకప్పుడు పట్నాలకు మాత్రమే సొంతం. కానీ ఇప్పుడు పల్లెటూర్లను కూడా పలుకరించాయి. చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తేడా లేకుండా చాలా గ్రామాల్లో పొద్దుపొద్దున్నే నడక, పరుగు మొదలుపెడుతున్నారు. ఆడపిల్లలు కూడా మగవారితో సమానంగా షూలేస్ కట్టుకుని పరుగుకు సిద్ధమా అని సవాల్ విసురుతున్నారు. అలా ఓ కుగ్రామంలో పుట్టి పరుగుల రాణిగా రాణిస్తున్నది మహేశ్వరి. 'మట్టిలో మాణిక్యాలు దొరుకుతాయి' అనే మాటను నిజం చేస్తూ పల్లె మట్టి పరిమళాన్ని జాతీయస్థాయిలో పరిచయం చేస్తున్నది.

పల్లెటూరి పరుగులరాణి





మట్టిలో మాణిక్యం..

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్కిచెర్ల గ్రామంలో పుట్టిన మహేశ్వరి పరుగు పందెంలో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నది. పరుగు పందెంలో పతకాలు తీసుకువస్తున్నది. కూలీ, నాలీ చేసుకునే కుటుంబంలో పుట్టినా, ఆ తల్లిదండ్రులు గర్వపడేలా చేసింది. గొత్తకొళ్ల నర్సింహులు, లక్ష్మమ్మల పెద్ద కూతురు మహేశ్వరి. వీరు ఫౌల్ట్రీఫాంలో రోజువారీ కూలీలు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. ఊర్లోనే టెన్త్ వరకు చదువుకున్నది మహేశ్వరి. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది.

నో ట్రైనింగ్..

ఏదైనా సాధించాలంటే కొద్దో గొప్పో సాధన ఉండాలి. కానీ మహేశ్వరికి రన్నింగ్‌లో పెద్దగా ప్రాక్టీస్ లేదు. ప్రాక్టీస్ చేసుకునేందుకు తగిన వసతులు, ఆర్థిక పరిస్థితులు కూడా లేవు. కానీ పరుగు మొదలుపెడితే లేడిపిల్లకు కూడా దొరుకకుండా విల్లు నుంచి వదిలిన బాణం కంటే వేగంగా దూసుకెళ్లగలదు. ఏడో తరగతి వరకు ఎలాంటి శిక్షణ లేకుండానే రన్నింగ్ మీద పట్టు సాధించింది. పరుగు పందెంకు సంబంధించిన నియమాలు చదివి, వాటిని గుర్తు పెట్టుకుని, టీచర్లను సలహాలు అడుగుతూ పోటీల్లో పాల్గొనేది. కుటుంబ సమస్యలు, ఆర్థిక పరిస్థితుల కారణంగా దాదాపు రెండు సంవత్సరాలు తన పరుగుకు బ్రేక్ చెప్పింది. ఎనిమిదో తరగతిలోకి వచ్చిన తర్వాత ఆ స్కూల్ పీఈటీ ప్రోత్సాహంతో మళ్లీ పరుగు మొదలుపెట్టింది.

ఆటలంటే చాలా ఇష్టం..

మహేశ్వరికి చిన్నప్పటి నుంచి ఆటలంటే చాలా ఆసక్తి. త్రోబాల్, రన్నింగ్‌లో ముందుండేది. ఐదో తరగతి వరకు పరుగు పందెంలో అందరికంటే ముందుండేది. సరైన ప్రోత్సాహం లేక మానేసింది. కానీ పరుగు మీదున్న ఇష్టంతో ప్రతిరోజూ ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో పరుగెత్తేది. ఈ క్రమంలో ఆ స్కూల్‌కి పీఈటీ అపాయింట్ అయ్యారు. ఆయన మహేశ్వరి పరుగు వేగాన్ని గమనించి ప్రోత్సహించడం మొదలుపెట్టాడు. అప్పటి నుంచి ఆమె పరుగు వేగం పుంజుకుంది. గ్రామ, మండల స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది.

బడి నుంచి ఒలింపిక్స్..

ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నంతలో, గురువుల ప్రోత్సాహంతో మహేశ్వరి పలు పోటీల్లో పాల్గొంటున్నది. రెండు సంవత్సరాల క్రితం పీఈటీ నిరంజన్ మహేశ్వరిని ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్‌కి పరిచయం చేశాడు. అప్పటి నుంచి మహేశ్వరి రాత మారిపోయింది. ఆమె ప్రతిభను గుర్తించిన రమేశ్ జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం కల్పించారు. వైజాగ్, జార్ఖండ్, జమ్మూ కాశ్మీర్‌లలో జరిగిన జాతీయ స్థాయి రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నది. ఈ ఏడాది గోవాలో జరిగిన 4 కిలోమీటర్ల పరుగు పందెంలో ఒక్కక్షణం ఆలస్యం కారణంగా రెండో స్థానంలో నిలిచింది. గ్రూపుగా మహారాష్ట్ర, పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని పలు పతకాలు గెలుచుకున్నది. కేరళలో జరిగిన సౌత్‌జోన్ క్రీడల్లో 800 మీటర్ల పరుగు పందెంలో రన్నరప్‌గా నిలిచింది.

స్వర్ణమే లక్ష్యం..

ఆర్థికంగా ఆదుకునే అండ లేదు.. నేనున్నా.. నువ్ దూసుకుపో.. అని ప్రోత్సహించేవారు లేరు.. అయినా తన పరుగును ఆపను అంటున్నది మహేశ్వరి. దేశం తరపున ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధిస్తా అంటున్నది. ఆ దిశగా సాధన చేస్తున్నది. 'రోజువారి కూలీలుగా బతుకీడుస్తున్న అమ్మానాన్న ఇప్పటికే నా కోసం చాలా డబ్బులు ఖర్చు పెట్టారు. పండుగకు కొత్త బట్టలు కొనుక్కోకుండా నాకు రన్నింగ్ సూట్ కొనిచ్చారు. ప్రభుత్వం సహాయం చేస్తే.. తెలంగాణ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా పరుగులు తీసి మరీ చాటుతా' అంటున్నది మహేశ్వరి.

టి. సంపత్
మహబూబ్‌నగర్,
నమస్తే తెలంగాణ ప్రతినిధి



ప్రోత్సహించాలి..

ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ రమేష్‌కు.. మహేశ్వరిని పరిచయం చేసిన వారం రోజుల్లోనే ఆమె ప్రతిభను గుర్తించారు. మా పరిధిలో, శక్తి మేరకు మేం సాయం చేస్తున్నాం. కానీ.. కేవలం ఒక్క సెకను, రెండు సెకన్ల వ్యవధిలోనే లక్ష్యానికి దూరమవుతున్నది. మంచి శిక్షణనిప్పిస్తే.. మహేశ్వరి మనందరికి గర్వకారణంగా నిలుస్తుందని నా నమ్మకం.

– నిరంజన్, పీఈటీ, ఎల్కిచెర్ల

ప్రతిభకు దక్కిన గౌరవం



దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదికలో దేశం నుంచి ప్రధానితో సహా, మన దేశానికి చెందిన ప్రముఖులు పాల్గొంటున్నారు. అయితే మహారాష్ట్ర నుంచి ఓ సాధారణ మహిళ కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతపెద్ద సదస్సులో పాల్గొనేందుకు.. తాను చేసిన కృషి ఏంటో తెలుసా?

మహారాష్ట్రలోని ముంబైకి చెందిన చేతన్ సిన్హా దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో దేశం తరపున పాల్గొన్నారు. మన దేశంలో ప్రధానితో సహా దాదాపు 130 మంది ప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో చేతన్ ఒకరు. తనకు దక్కిన ఈ అరుదైన గౌరవం వెనుక.. ఆమె అపారమైన కృషి దాగి ఉన్నది. పెళ్లైన తర్వాత భర్తతో సహ సతారా జిల్లాకు వెళ్లింది. అక్కడ మహిళలు ఆర్థికంగా పడుతున్న కష్టాలు చూసి చలించింది. వారిని ఆర్థికంగా ప్రోత్సహించేందుకు స్థానిక గ్రామీణ మహిళలతో 'మాన్ దేశీ మహిళా సహకార బ్యాంక్'ను ప్రారంభించింది. దీనిలో గ్రామీణ మహిళలను భాగస్వామ్యం చేసింది. వారికి కొంత ఉపాధి మార్గం చూపిస్తూ, సూక్ష్మ రుణాలు ఇస్తూ ఆర్థికంగా ప్రోత్సహిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. ఓ మహిళా బ్యాంక్ ఈ స్థాయికి రావడానికి మహిళా సభ్యులు ఎంతో కష్టపడ్డారు. దీంతో మహిళా బ్యాంక్ కృషిని గుర్తించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొదటిసారిగా ఓ మహిళా సహకార బ్యాంక్‌కు లైసెన్స్ ఇచ్చేసింది. 1996లో ప్రారంభమైన ఈ మహిళా సహకార బ్యాంక్.. డ్వాక్రా మహిళలకు సూక్ష్మ రుణాలు, కొత్తగా పారిశ్రామికవేత్తలుగా ఎదుగాలనుకుంటున్న వారిని ప్రోత్సహించి రుణాలు అందించింది. మొత్తంగా మహిళలు ఆర్థిక శక్తిగా మారేందుకు చేతన్ ఎంతో కష్టపడ్డారు. తన కష్టానికి ఫలితంగానే ప్రపంచ ఆర్థిక వేదిక ఆమెకు స్వాగతం పలికింది. ఎంతోమంది మహిళలకు ఆదర్శవంతురాలైంది చేతన్.

మెదడు జంకుతుంది!

'మీకు జంక్‌పుడ్, ఫ్రైడ్ పుడ్ అంటే ఇష్టమా?' అని అడిగితే.. 'ఎవరిని పట్టుకుని ఏం అడుగుతున్నారు మీరు..! ఇష్టం అని మెల్లగా అంటారేంటి ? పట్టుకురండి లాగించేస్తాం' అనేవారు చాలామందే ఉంటారు. 'మీరు తెలివిని తగ్గించుకోవాలనుకుంటున్నారా?' అని అడిగితే 'అదేం ప్రశ్న..?' అన్నట్టు ముఖం పెడుతారు. అవును మీరు జంక్‌ పుడ్ పుడ్ ఇష్టంగా తింటే మీ తెలివిని తగ్గించుకున్నట్టే.



ఆరోగ్య నిపుణులు తేల్చి చెప్పిన తాజా వివరాల ప్రకారం జంక్‌పుడ్ తినేవారి మెదడులో రసాయనాలు వేగంగా మార్పునకు గురవుతాయట. ఈ పుడ్‌లో ఉండే డొపమైన్ అనే రసాయనం మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. నేర్చుకునే సామర్థ్యం, చురుకుదనం, ప్రేరణ, పాజిటివ్ థింకింగ్, ఆలోచనాశక్తిని తగ్గించే దిశగా డొపమైన్ పనిచేస్తుంది. తద్వారా తెలివిగల వారు కాస్త తెలివి తక్కువ వారిలా మారిపోతారన్నమాట. అందుకే అధిక కొవ్వులు ఉన్న ఆహారాలు తీసుకోకపోవడమే మంచిది. ప్రాసెస్ చేసి వేయించిన పుడ్ తీసుకోవడం వల్ల శరీర కణాలవృద్ధిపై కూడా తీవ్రప్రభావం చూపుతుంది. కాబట్టి జంక్‌పుడ్‌కి దూరంగా ఉండండి. మీ తెలివిని, ఆరోగ్యాన్ని కాపాడుకోండి అని నిపుణుల సూచన.

రంగేస్తున్నారా?



హెయిర్ స్టయిల్స్ మార్చడంలో యూత్ తీరే వేరు. నచ్చిందనిపిస్తే ఉన్నపళంగా వెంట్రుకల షేపు మార్చడానికి ఏమాత్రం వెనుకాడరు. స్టయిల్‌తో పాటూ కలర్ కూడా ఛేంజ్ చేసేస్తుంటారు. డై అయితే వేస్తారు కానీ ఎలా వేయాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చాలామందికి తెలియదు. ఈసారి హెయిర్ డై వేసుకునే ముందు ఈ చిట్కాలు పాటించండి.

- మీ వెంట్రుకలకు హాని కలిగించనంత వరకూ ఏ హెయిర్ డై వేసినా పర్లేదు. కానీ పడనప్పుడు మాత్రం ఆ ప్రయత్నం చేయకపోవడమే ఉత్తమం.
- డై వేసుకోవాలనుకున్నప్పుడు ముందుగా ఎక్స్‌పర్ట్‌ని కలువండి. వారు సూచించినదే వాడండి.
- కలర్‌తో పాటూ, బ్రాండ్ కూడా బాగుండే వాటికే ఇంపార్టెన్స్ ఇవ్వండి. లేకపోతే అసలుకే ప్రమాదం.
- ఎక్కువ కాలం ఉండే రంగు, బ్రాండ్‌నే ఎంచుకోండి. మాటి మాటికీ మారిస్తే వెంట్రుకలు సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.
- మీ చర్మం రంగుకు నప్పే రంగును మాత్రమే సెలక్ట్ చేసుకోండి. అప్పుడే చూడడానికి అందంగా ఉంటుంది.



విధిని గెలిచిన ధీశాలి!

పుట్టుకతోనే పోలియో దాడి చేసి ఆమె కాళ్లూ చేతులు కదులకుండా చేసింది. కానీ విధి ఆమె ఆలోచనలకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయింది. ఫలితంగా.. ఆమె చేస్తున్న పని ఆ ఇంటి ఆదాయానికి ప్రధాన ఆధారమైంది. ఇంతకీ ఆమె ఎవరు? ఏం చేసింది?

ఈ ఫొటోలో కనిపిస్తున్న యువతి పేరు నుర్సమవతి. కాళ్లూ, చేతులు సక్రమంగా ఉండి కూడా ఎవరో ఒకరి దగ్గర ఉద్యోగం చేస్తూ.. వచ్చిన జీతం సరిపోలేదని నిత్యం బాధపడే వారికి ఈమె స్ఫూర్తి. పుట్టుకతోనే పోలియో కారణంగా రెండు కాళ్లు, రెండు చేతులు చచ్చుబడిపోయినా ఆమె మెదడుకు పనిచెప్పింది. తల్లి చేస్తున్న చిల్లీ సాస్ వ్యాపారానికి ప్రచారకర్తగా మారింది. అదెలాగో తెలుసా? ఇప్పుడు ప్రతీ విషయం మీడియాలో కంటే సోషల్ మీడియాలో జనాలకు తొందరగా తెలుస్తుంది. అందుకే తల్లి చేస్తున్న వ్యాపారానికి సోషల్ మీడియాలో ప్రచారం చేయదలిచింది నుర్సమవతి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వ్యాపారానికి సంబంధించిన యాడ్స్ పోస్ట్ చేస్తున్నది. నాలుకతో ల్యాప్‌టాప్, మొబైల్ ఆపరేట్ చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నది ఈ ధైర్యవంతురాలు. నుర్సమవతికి ఫేస్‌బుక్‌లో వెయ్యిమంది ఫ్రెండ్స్ ఉన్నారు. 2015 నుంచి ఈ వ్యాపారానికి తనవంతుగా ప్రచారం నిర్వహిస్తూ ఆదాయం పెరిగే మార్గాలు అన్వేషిస్తున్నది. నుర్సమవతి ప్రచారం వల్ల వాళ్లు నెలకు నాలుగు వేల సాస్ బాటిల్స్ అమ్మగలుగుతున్నారు. చేయాలన్న తపన, చేస్తే తప్ప పూట గడువని పరిస్థితి మనిషి చేత ఎంతటి అసాధ్యాన్నైనా సుసాధ్యం చేస్తుంది అనడానికి నుర్సమవతి మంచి ఉదాహరణ.

కలల తీరాన్ని చేరింది!

పేదరికం చాలామందికి ఎంతో నేర్పింది. నిరుపేద స్థాయి నుంచి రాజ్యాధినేతలైన వారూ ఉన్నారు. పేదవారిగా పుట్టడం తప్పుకాదు.. పేదవారిగా చనిపోవడం మాత్రం కచ్చితంగా తప్పేనంటున్నది మిత్లేష్ చౌదరి. నిరుపేద నుంచి అంతర్జాతీయ మోడల్‌గా ఎదిగిన తన ప్రస్థానం అమోఘం.

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌కు చెందిన డింపుల్ మిత్లేష్ చౌదరి చిన్నతనం నుంచి ఎన్నో కష్టాలను అనుభవించింది. కానీ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. తండ్రి ప్రైవేట్ డ్రైవర్. నలుగురు పిల్లలు. చాలీచాలని జీతం. అందుకే చదువుకుంటూనే తండ్రికి ఆసరాగా పార్ట్‌టైం జాబ్ చేసింది మిత్లేష్. కొంత డబ్బులు కూడగట్టుకొని ఓ కెమెరా కొనుక్కొని తనకిష్టమైన ఫొటోగ్రఫీవైపు అడుగులు వేసింది. డింపుల్ తీసిన ఫొటోలకు అంతర్జాతీయ అవార్డులే వచ్చాయి. నెదర్లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్ట్ అండ్ ఫొటో పోటీల్లో విజేతగా నిలిచింది. ఇందుకు గాను 78 వేల రూపాయల బహుమతి లభించింది. ఫొటోగ్రఫీయే కాకుండా బైక్‌రైడింగ్ అంటే మక్కువే. ఈ మధ్యనే అంతర్జాతీయ మహిళా బైక్ రైడర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం కూడా తీసుకున్నది. డచ్ ఫొటోగ్రాఫర్ సూచన మేరకు మోడల్‌గా మారి తన సత్తా ఏంటో నిరూపించింది డింపుల్ మిత్లేష్. పేదరికాన్ని జయించి ఉన్నత స్థానాలకు చేరుకొని, తన కలలను నెరవేర్చుకొన్నది. వచ్చిన డబ్బులను పేద పిల్లల సంక్షేమానికి కృషి చేస్తూ.. పలు రంగాల్లో రాణిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నది.





హాట్ యోగా అనర్థమే!

మామూలుగా ఆరు బయట.. మైదానంలో ఉల్లాసభరిత వాతావరణంలో ఎక్సర్‌సైజ్ చేస్తుంటాం. దీనివల్ల శరీరానికి.. మనసు పనితీరుకు కావాల్సిన అన్ని చర్యలు సక్రమంగా జరిగి మానసిక.. శారీరక ప్రయోజనాలుంటాయి.

హాట్ యోగా అనేది నిర్దిష్టమైన గదిలో చేయడం వల్ల అన్ని చర్యలు సక్రమంగా జరగవట. గది ఉష్ణోగ్రత వద్ద బంధించినట్లు నిర్దిష్ట భంగిమల్లో చేయడం వల్ల దుష్ప్రభావాలు వస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీ పరిశోధకులు తాజాగా హాట్ యోగాపై అధ్యయనం చేశారు. 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో.. గదిలో బంధించి యోగా చేస్తే సత్ఫలితాలెలా వస్తాయంటున్నారు వాళ్లు. 26 భంగిమలను.. 40 డిగ్రీల ఉష్ణోగ్రతలో చేయడం వల్ల గది ఉష్ణోగ్రతతో పాటు.. శారీరక ఉష్ణోగ్రత పెరిగి బుర్ర హీటెక్కి పోతుందని హెచ్చరిస్తున్నారు. సుమారు 12 వారాల పాటు పరిశోధకులు వందలాది హాట్ యోగా అభ్యసనకారులను పరిశీలించారు. దీనివల్ల శారీరక మార్పులు జరుగవనీ.. హృద్రోగాలకు ఇది దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. హాట్ యోగాను రోజూ చేస్తే.. ఏ దశలో గుండెపోటు వస్తుందో కూడా చెప్పలేమని టెక్సాస్ యూనివర్సిటీ పరిశోధకులు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 23 జనవరి 2018

ఆడవారిలోనే జ్ఞాపకాలు పదిలం

ఇప్పుడు చాలా విషయాల్లో పురుషులతో సమానంగా దూసుకెళ్తున్నారు మహిళలు. ఈ విషయంలో మాత్రం మగవారి కంటే ఒక మెట్టు పైనే ఉన్నారట. ఇంతకీ విషయమేంటో తెలుసా?

ఓ వయసుకు వచ్చిన తర్వాత ఆడవారిలోనైనా, పురుషుల్లోనైనా మతిమరుపు సహజం. ఒకనాటి జ్ఞాపకాలు గుర్తుండవు. అయితే తాజాగా ఓ అధ్యయనం వెల్లడించిన వివరాల ప్రకారం.. పురుషుల కంటే మహిళల్లోనే జ్ఞాపక శక్తి ఎక్కువగా ఉంటుందట. 45 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళల మెమరీ పవర్ పురుషుల కంటే ఎక్కువగా ఉందని ఈ పరిశోధనలో తేలింది. సాధారణంగా 75శాతం మంది వయసు పెరుగుతున్నకొద్దీ జ్ఞాపకశక్తిని కోల్పోతుంటారు. ముఖ్యంగా ఆడవాళ్లు అల్జీమర్స్, డిమెన్షియా వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. అయితే బోస్టన్‌కు చెందిన కొందరు శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు.. పురుషుల కంటే ఎక్కువ మెమరీ పవర్‌ను కలిగి ఉన్నట్టు గుర్తించారు.

పురుషులకంటే మహిళలకే జ్ఞాపక శక్తి ఎక్కువగా ఉంటుందని, వారికే మెమరీస్ ఎక్కుగా ఉంటాయని అధికారికంగా ప్రకటించారు. ఈ అధ్యయనంలో 45 నుంచి 55 మధ్య వయస్కులైన 212 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

వివిధ దశల్లో రెండు వర్గాలకు సంబంధించి ఏర్పడిన మార్పులను గుర్తించారు. ఈ పరిశీలనలో పురుషుల కంటే మహిళలకే ఎక్కువ జ్ఞాపకశక్తి ఉందని గుర్తించారు. వారి మస్తిష్కాల్లోనే జ్ఞాపకాలు పదిలంగా భద్రమై ఉంటాయని తేల్చారు.




జారిన డిస్క్‌కు కొత్త సర్జరీ



వృత్తి రీత్యా తరచుగా ప్రయాణాలు చేసే 37 సంవత్సరాల అరవింద్‌కు ఈ మధ్య నడుము నొప్పి విపరీతంగా వస్తున్నది. డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుంటే డిస్క్‌ప్రొలాప్స్ అయ్యిందని చెప్పారు. కొన్నాళ్ల చికిత్స తర్వాత కూడా పెద్దగా ఫలితం లేకపోయేసరికి ఇక సర్జరీ తప్పదన్నారు. 'వెన్నెముకకు సర్జరీ..?! అబ్బో కష్టం' అని అతని స్నేహితులు భయపెట్టారు. కానీ నిపుణులు అంత భయం అవసరం లేదు అని చెబుతున్నారు. ఇప్పుడు చాలా ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వెన్నెముక ఆధునిక చికిత్సలకు సంబంధించిన సదస్సు జరిగింది. ఈ నేపథ్యంలో డిస్క్ ప్రొలాప్స్ చికిత్సలో వచ్చిన నూతన ఒరవడి గురించి పంచుకున్నారు నిపుణులు.

ఈ రోజుల్లో జీవన వేగం విపరీతంగా పెరిగిపోయింది. ఆ వేగాన్ని అందుకునే క్రమంలో శరీరం చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ ఒత్తిడి ఒక్కో శరీర భాగం మీద ఒక్కోరకంగా ఉంటున్నది. అందుకు వెన్నెముక కూడా అతీతం కాదు. వెన్నెముక సమస్యలు ఈ మధ్య కాలంలో చాలా పెరిగిపోయాయి. అందులో ముఖ్యమైంది డిస్క్ ప్రొలాప్స్ సమస్య. ఇది వరకు ఈ సమస్యకు చికిత్సగా వీలైనంత వరకు మందులు, ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించేవారు.



డిస్క్‌ప్రొలాప్స్ అంటే...?

రెండు వెన్ను పూసల మధ్య మెత్తని పదార్థం ఉంటుంది. దాన్ని డిస్క్ అంటారు. వెన్నెముక మీద ఒత్తిడి పెరిగినపుడు ఈ డిస్క్‌ల మీద ఒత్తిడి కలిగిన భాగంలో ఉన్న డిస్క్‌లు జారిపోతాయి. ఇలా జారిపోవడాన్ని డిస్క్ ప్రొలాప్స్ అంటారు. డిస్క్ అది ఉండే భాగం నుంచి పక్కకు తొలగడం వల్ల పరిసరాల్లో ఉన్న నాడుల మీద ఒత్తిడి కలిగి, నొప్పి వస్తుంది. ఈ నొప్పి వెన్నెముకలోని ఏ భాగంలో డిస్క్ జారిపోయిందనే అంశం మీద ఆధారపడి ఉంటుంది. మెడ భాగంలో ఉండే డిస్క్‌లు జారిపోయినపుడు చేతులు, మెడ, భుజాల్లో నొప్పి వస్తుంది. దీన్ని సర్వైకల్ స్పాండిలోసిస్ అంటారు. అదే వెన్నెముకలోని కింది భాగం అంటే నడుము భాగంలో డిస్క్ జారిపోవడం వల్ల శరీరంలోని కింది భాగాలైన కాళ్లు, నడుములో నొప్పి, స్పర్శ కోల్పోవడం, బలహీనంగా అనిపించడం, తిమ్మిర్లు రావడం, మల మూత్ర విసర్జన మీద అదుపు కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి. దీన్ని లంబార్ డిస్క్ ప్రొలాప్స్ అంటారు.

సాధారణంగా ఎల్4 ఎల్5, ఎల్5 ఎస్1 వెన్నుపూసల మధ్య ఉన్న డిస్క్‌ల్లో సమస్య వచ్చినపుడు దాని ప్రభావం సయాటికా నాడి మీద ఉంటుంది. దీని ప్రభావం వల్ల సయాటికా సమస్య వస్తుంది. ఇందులో నొప్పి నడుములో మొదలై తొడలు, కాళ్లలోకి పాకినట్టుగా ఉంటుంది. ఈ నొప్పి తీవ్రంగా ఉంటుంది. ఈ నాడి మీద ఒత్తిడి సెంట్రల్ భాగంలో ఉంటే దాన్ని మైలోపతి అంటారు. పారా సెంట్రల్ లేదా ఒక పక్కగా ఒత్తిడి పడుతున్నప్పుడు రెడిక్యులోపతి అంటారు. మైలోపతిలో మూత్ర విసర్జన మీద ప్రభావం ఉండొచ్చు. ఒక్కోసారి మూత్రం పూర్తిగా ఆగిపోవచ్చు కూడా.

చికిత్స..?

సాధారణంగా కేవలం నొప్పి మాత్రమే ఉన్నపుడు మందులు, ఫిజియోథెరపీతో చికిత్స అందించవచ్చు. చాలా మందిలో ఈ చికిత్సలతో సమస్య తగ్గుముఖం పడుతుంది. కానీ కొంత మందిలో నొప్పితో పాటు కాళ్లు, చేతుల్లో బలం తగ్గిపోవడం, స్పర్శలేకపోవడం, తిమ్మిర్లు, మూత్రసంబంధ సమస్యలు కనిపిస్తాయి. ఇలాంటి వారికి సర్జరీ తప్పదు.

మైక్రోస్కోపిక్ లేదా ఎండోస్కోపిక్ సర్జరీ

ఈ సర్జరీలో జారిపోవడం వల్ల వెన్నెముక నుంచి బయటికి వచ్చి పరసరాల్లోని నాడుల మీద ఒత్తిడి పెంచుతున్న డిస్క్ భాగాన్ని తొలగిస్తారు. ఇది వరకు ఈ సర్జరీ చాలా సంక్లిష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు పెద్దకోతతో సర్జరీ చెయ్యడం చాలా అరుదుగా జరుగుతున్నది. ఇప్పుడు మైక్రోస్కోపిక్ లేదా ఎండోస్కోపిక్ సర్జరీల ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఈ విధానాల్లో కేవలం చిన్న కోత మాత్రమే సరిపోతుంది. చిన్న గాటుతో వెన్నుపూసల మధ్య జారిపోయిన డిస్క్ భాగాన్ని తీసివేస్తారు. ఇలా జారిపోయిన డిస్క్ తొలగించడం వల్ల నాడి మీద పెరిగిన ఒత్తిడి తొలగిపోయి ఆ ఒత్తిడి ఫలితంగా వచ్చే సమస్యలన్నీ కూడా పరిష్కారం అవుతాయి. ఈ విధానంలో ఎముక భాగంలో కోత ఉండదు. కేవలం 2–3 సెంటీ మీటర్ల కోత మాత్రమే ఉంటుంది. ఫలితంగా గాయం త్వరగా మానిపోవడం, కోలుకునేందుకు తక్కువ సమయం పట్టడం, కేవలం 2,3 రోజుల్లో ఇంటికి వెళ్లిపోవచ్చు. దుష్ప్రభావాలు దాదాపు ఏమీ ఉండకపోవచ్చు. కేవలం లోకల్ ఎనస్తీషియాతో ఈ సర్జరీ పూర్తి చెయ్యవచ్చు.

ట్రాన్స్‌ఫోరమినల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ

ఇది అత్యాధునికమైన వెన్నెముక సర్జరీ విధానం. దీనిలో కేవలం 7 మిల్లీమీటర్ల అత్యంత చిన్న కోతతో జారిపోయిన డిస్క్ భాగాన్ని తొలగిస్తారు. ఇందుకు ఉపయోగించే స్కోప్ కేవలం 1–3 మిల్లీమీటర్ల పరిమాణంలో ఉంటుంది. ఈ విధానంలో శరీరంలో ఏదో ఒక పక్క భాగం నుంచి కోత పెట్టి అక్కడి నుంచి డిస్క్ వద్దకు చేరుకొని జారిపోయిన డిస్క్ భాగాన్ని తొలగిస్తారు. కేవలం డిస్క్‌ప్రొలాప్స్ సమస్యలో మాత్రమే కాదు, ప్రమాదాల్లో డిస్క్ దెబ్బతిన్న సందర్భాల్లో వెన్నుపూసల్లో ఎలాంటి ఫ్రాక్చర్స్ లేకపోతే ఈ విధానాన్ని ఉపయోగించవచ్చు.



డా. బాల రాజశేఖర్
కన్సల్టెంట్ న్యూరోసర్జన్
స్టార్ హాస్పిటల్స్
హైదరాబాద్

లాభాలు

- ఈ విధానంలో కండరంలో కూడా కోత పెట్టాల్సిన అవసరం ఉండదు. కుట్లు కూడా ఉండవు. కేవలం చిన్న ప్లాస్టర్‌తో గాయాన్ని మూసివేస్తే సరిపోతుంది.
- హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం కూడా ఉండదు. ప్రక్రియ పూర్తయిన తర్వాత 1,2 గంటల్లో ఇంటికి వెళ్లిపోవచ్చు.
- ఒక వారం రోజుల్లో తిరిగి పనులు చేసుకోవచ్చు.
- కేవలం 4 వారాల పాటు బరువైన పనులు చెయ్యకుండా ఉంటే చాలు.

బరువు తగ్గించే కొవ్వు..!

కొవ్వు కలిగిన పదార్థాలను తింటే బరువు పెరుగుతారని భయపడిపోతుంటారు. కానీ కొన్ని కొవ్వుపదార్థాల్లోనూ బరువును తగ్గించే గుణాలుంటాయని మీకు తెలుసా? తాజాగా ఓ అధ్యయనం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నది.



కొవ్వును తగ్గించుకొనేందుకు చాలామంది చాలారకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరేమో కొవ్వు పదార్థాలను తినడం మానేస్తుంటారు. నిజం చెప్పాలంటే ఆరోగ్యకరమైన జీవితానికి కొవ్వుపదార్థాలు కలిగిన ఆహారం ఎంతో మేలు చేస్తుందట. వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలో ఇదే విషయం వెల్లడైంది. కొవ్వు కణాలను ఎలుకపై ప్రయోగించి.. అది అధిక బరువు కాకుండా నిరోధించగలిగారు. ఊబకాయానికి సరికొత్త చికిత్సను కనుగొనడమే లక్ష్యంగా అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు.. శరీరంలో కొవ్వు పెరిగే విధానాన్ని కనుగొన్నారు. ప్రధానంగా ప్రతీ కొవ్వు కణం పెద్దగా విస్తరించడం వల్ల.. మరిన్ని కొవ్వు కణాలు ఉత్పత్తి కాకుండా మనిషి అధికంగా బరువు పెరుగుతున్నట్టు వివరించారు. శాస్త్రవేత్తల బృందం హెడ్జ్‌హాగ్‌గా పిలువబడుతూ కణజాలాల్లో చురుకుగా ఉండే ప్రొటీన్‌పై దృష్టిపెట్టారు. ఎలుకలకు అధిక కొవ్వుపదార్థాలను తినిపించిన శాస్త్రవేత్తల బృందం.. హెడ్జ్‌హాగ్ ప్రొటీన్‌ను యాక్టివేట్ చేశారు. ఎనిమిది వారాల పాటు పరిశీలించిన శాస్త్రవేత్తలు ఎలుకలు బరువు పెరుగకపోవడాన్ని గుర్తించారు. హెడ్జ్‌హాగ్ ప్రొటీన్.. కొవ్వు కణాలను పెరుగకుండా నియంత్రించడంతో పాటు, కొవ్వు బిందువులను సేకరించడం ద్వారా ఊబకాయాన్ని నిరోధించగలిగింది. దీంతో అధిక కొవ్వు కలిగిన పదార్థాల్లోనూ ఆరోగ్యానికి మంచి చేసే గుణాలున్నాయని పరిశోధకులు కనుగొన్నారు.

- అధిక కొవ్వుతో కూడిన ఆహారం చాలా మృధువైనది. శరీరంలో చక్కెర స్థాయిని స్థిరంగా ఉంచేందుకు ఉపయోగపడుతుంది. సాధారణంగా తక్కువ కొవ్వు ఉండే పదార్థాలను తీసుకొన్నప్పుడు కడుపునిండనట్టుగా, అర్థాకలితో ఉన్నట్టుగా అనిపిస్తుంది.
- కొవ్వు కలిగిన పదార్థాలను తీసుకోవడం పేగులకు కూడా మంచిదే. రోగనిరోధక శక్తిని పెంచి విషపూరిత రసాయనాలను బయటకు పంపేందుకు సహాయపడుతాయి.
- తిన్న కొవ్వు పదార్థాలన్నీ మిమ్మల్ని లావుగా మార్చవు. మీకు ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలను ఎంచుకొంటే శరీరంలో అనవసరమైన కొవ్వు కరిగిపోయి శక్తి పెరుగుతుంది. ఫలితంగా అధిక బరువూ తగ్గుతుంది.
- ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు మెదడుకు మంచివి. ఒమెగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్, డోకోసా హెక్సానోయిక్ యాసిడ్‌లను కలిగి ఉన్న మానవ మెదడు మానసిక ఒత్తిడి, ఆందోళనలు అధిగమించేందుకు ఈ కొవ్వు కణాలు తోడ్పడుతాయి.

ఆరోగ్యానికి సంత్రా



సిట్రస్‌ను కలిగి ఉన్న పండ్లలో సంత్రాలు ప్రత్యేకమైనవి. ఈ పండ్లు చిన్నవి, తీయనైనవి. అంతకు మించి ఆరోగ్యమైనవి. ఇంతకీ వాటి వల్ల కలిగే ఆరోగ్యప్రయోజనాలేమిటో తెలుసా?

- ఆరోగ్యమైన చర్మానికి సంత్రాపండ్లు మంచి ఔషధంగా ఉపయోగపడుతాయి. రెగ్యులర్‌గా వీటిని తినడం వలన చర్మం మేలైన కాంతిని పొందుతుంది.
- వీటితో సహజమైన ఫేస్‌మాస్క్ వేసుకోవడం ద్వారా చర్మం నిగారిస్తుంది. మూడు లేదా నాలుగు సంత్రాపండు ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ ప్లెయిన్ యొగర్ట్, ఒక టీస్పూన్ తేనెను కలిపి పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రుద్దుకొని పది నుంచి పదిహేను నిమిషాలు ఆరనివ్వాలి. సున్నితంగా మసాజ్ చేసి కడిగేస్తే చర్మంపై ఉన్న బ్యాక్టీరియా తొలిగిపోతుంది. ముఖం కాంతివంతమవుతుంది.
- సంత్రాలల్లో ఉండే విటమిన్ సి.. దంతాలు చిగుళ్లను దృఢంగా చేసేందుకు ఉపయోగపడుతుంది. దరహాసాన్ని మరింత అందంగా చేస్తుంది.
- ఈ పండ్లను రెగ్యులర్‌గా తినడం ద్వారా శరీరానికి అవసరమైన ఐరన్ పొందవచ్చు.
- వీటిలో ఉండే సిట్రస్.. ఆశ్చర్యకరంగా మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తుంది. వీటిని వాసన చూస్తే చాలు.. ఒత్తిడి తగ్గి మనసు తేలికవుతుంది.
- జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు వీటిలో ఉండే విటమిన్ ఎ దోహదం చేస్తుంది.
- గుండెను ఆరోగ్యంగా ఉంచేందుకు సంత్రాలు ఉపయోగపడుతాయి.

ఇన్‌ఫ్లమేషన్ మందులతో గుండెకు చికిత్స



గుండె జబ్బులకు ఇన్లఫేమేషన్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని గురించి మొట్టమొదటి సారిగా పరిశోధకులు వివరించారు. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు ఇక ముందు హార్ట్‌ఎటాక్‌కు కొత్త చికిత్స కావచ్చు.

హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పాల్ రిడ్కర్ ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ అధ్యయనానికి 10వేల మంది హార్ట్‌ఎటాక్ పేషెంట్లను గమనించడం జరిగింది. వీరిలో వివిధ కారణాలతో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు వాడడం వల్ల రెండో సారి హార్ట్‌ఎటాక్ వచ్చే ఆస్కారం దాదాపు 15 శాతం వరకు తగ్గిందని అన్నారు. కనకీనూబమ్ అనే ఇంజక్షన్ సంవత్సరానికి నాలుగు సార్లు తీసుకున్న వారిలో క్యాన్సర్‌తో బాధతున్న వారిలో కూడా గమనించతగిన మెరుగైన ఫలితాలు కనిపించాయని ఈ అధ్యయనకర్తలు. ఇప్పుడు యాంటీఇన్‌ఫ్లమేటరీ మందులు పనిచేసే విధానం గురించి విస్తృతస్థాయిలో అధ్యయనాలు జరగాల్సిన ఆవశ్యకతను గుర్తించాల్సి ఉందని పాల్ రిడ్కర్ అభిప్రాయపడుతున్నారు.

మధుమేహం రావొద్దంటే...

మధుమేహం వస్తుందేమోనని అందరికీ భయమే. దాని గురించి ఎంత తెలుసుకున్నా ఇంకా ఏమీ తెలియనట్టే ఉంటుంది. మధుమేహం రాకముందే ఆహారంలో జాగ్రత్తపడాలి. నిజమే.. కానీ చాలా సందర్భాల్లో ఈ ఆహారంలోని మార్పుల పట్ల పలు అపోహలు కూడా వ్యక్తమవుతుంటాయి. స్వీట్లు తింటే మధుమేహం వస్తుందనేది ఇలాంటిదే. ఇందులో కొంతవరకు నిజం లేకపోయినా పూర్తిగా స్వీట్లు మానక్కరలేదు. ఇలాంటి కొన్ని నమ్మకాల్లో నిజమెంతో తెలుసుకుందాం.



షుగర్ సమస్య లేదు కాబట్టి స్వీట్లు తినొచ్చు!

ఏ చాక్లెట్టో, స్వీటో తింటేనే చక్కెరలు వస్తాయనుకుంటాం. కానీ చాలా రకాల ఆహారాల్లో చక్కెర పదార్థాలుంటాయి. 2015 డయెటరీ గైడ్‌లైన్స్ ప్రకారం మనం రోజూ తీసుకునే కేలరీల్లో 10 శాతం అదనంగా తీసుకునే చక్కెర పదార్థాల ద్వారానే వస్తాయి. ఇది 50 గ్రాములు లేదా 12 టీ స్పూన్ల అదనపు షుగర్‌కి సమానం. అయితే ప్రతిరోజూ మనం ఇంతకు రెండింతలు ఎక్కువ చక్కెరలను తీసుకుంటున్నాం. 75 శాతం మంది ఆహార పదార్థాల ద్వారా అధిక మోతాదులో చక్కెరలను తీసుకుంటూ ఉంటారు. కాబట్టి ఇక స్వీట్లు కూడా ఎక్కువగా తింటే కేలరీలు ఎక్కువై, మధుమేహ సమస్య మొదలయ్యేందుకు ఆస్కారం ఉంటుంది.

కొన్ని రకాల ఆహారాలను దూరంగా ఉంచడంపై దృష్టి పెట్టాలి

మనం తీసుకునే ఆహారంలో నుంచి తొలగించాల్సిన వాటి మీద కంటే తీసుకోవాల్సిన వాటిపై దృష్టి పెట్టడం ఎక్కువ మేలు చేస్తుంది. ముఖ్యంగా షుగర్లు కలిసివున్న పదార్థాలపై దృష్టి పెట్టాలి. అదనంగా చక్కెరలు కలవకుండా జాగ్రత్తపడాలి. అతి తక్కువ ప్రాసెస్ చేసిన కూరగాయలు, పండ్లు, ముడి గింజలు, సముద్రపు ఆహారం, చిక్కుళ్లు, గింజ ధాన్యాలు, విత్తనాలు తీసుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలి. ఇలాంటి ఆహారంలో హానకరమైన వాటికన్నా మేలు చేసే పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

ఆహారంలో ఎక్కడ చక్కెర ఉన్నా తెలిసిపోతుంది.

పండ్లు, స్వీట్లు, కేకులు, సాఫ్ట్ డ్రింక్స్ లాంటి వాటిలోనే కాకుండా ఇంకా అనేక చోట్ల, అనేక పదార్థాల్లో చక్కెర దాగి ఉంటుంది. రెడీ టు ఈట్ వాటిలో కూడా చాలా పదార్థాలు చక్కెరలను కలిగివుంటాయి. కాబట్టి అదనంగా చక్కెరను ఆహారంలో చేర్చడం మంచిది కాదు. క్యాండీలు, కుకీస్, బేక్డ్ పదార్థాలు తీసుకోకపోవడమే మంచిది. అంతేకాదు కార్న్ సిరప్, కేన్ షుగర్, కార్న్ స్వీట్నర్, పండ్ల రసాల్లో కూడా ఫ్రక్టోస్ అధిక మోతాదులో ఉంటుంది. మార్కెట్లో దొరికే పదార్థాల్లో వాటిలో వాడిన ఇన్‌గ్రిడియెంట్స్ జాబితాలో మొదటి మూడిట్లో షుగర్ ఉందంటే ఆ ఉత్పత్తిని తీసుకోకపోవడమే మంచిది.

పండ్లు తినొద్దు..

నిజానికి పండ్లు ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం.

పండ్లలో చక్కెరలుంటాయి కాబట్టి పండ్లను తీసుకోవద్దనుకుంటారు. కానీ పండ్లలో ఫ్రక్టోస్ ఉన్నప్పటికీ డయెటరీ ఫైబర్, విటమిన్లు, మినరల్స్, యాంటి ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాల వల్ల అనేక ఆరోగ్యకరమైన ఫలితాలుంటాయి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. దీర్ఘకాలిక సమస్యల నుంచి నివారణ కలుగుతుంది. గుండె ఆరోగ్యాన్ని పెంచుతాయి. కాబట్టి పండ్లు ఎక్కువగా తినడం వల్ల మధుమేహ అవకాశం ఉంటుందేమో అనే సందేహం అక్కరలేదు. అర్థం లేనిది కూడా.

డెజర్ట్స్. అంటే చిన్న చిన్న స్వీట్లు కూడా తినొద్దు

అదనంగా చక్కెరలు తీసుకోవద్దు అన్నంత మాత్రాన భోజనంలో డెజర్ట్స్‌గా తీసుకునే ఫ్రూట్ సలాడ్స్, చిన్న చిన్న స్వీట్లు కూడా మానేయాల్సిన అవసరం లేదు. వీటిలో ఇంట్లో తయారుచేసినవాటినే ఎంచుకోవడం మంచిది. తియ్యగా రుచిగా ఉందని ఎక్కువగా కాకుండా తక్కువ మోతాదులో తీసుకోవాలి.

అధిక బరువు/సొరియాసిస్

సొరియాసిస్‌తో బాధ పడుతున్న వారు అధిక బరువు కూడా కలిగి ఉంటే సమస్య తాలూకు లక్షణాలు మరింత తీవ్రంగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న శరీర బరువు సొరియాసిస్ సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. స్థూలకాయం ప్రోఇన్‌ఫ్లమేటరీకి కారణం అవుతుంది కాబట్టి ఇది సొరియాసిస్ లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. కాబట్టి సొరియాసిస్‌తో బాధపడుతున్న వారు అధిక బరువుతో ఉంటే తప్పనిసరిగా బరువు తగ్గేందుకు ప్రయత్నించడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచుకోవడం సాధ్యపడుతుందని నిపుణుల సలహా.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 23 జనవరి 2018




బిడ్డను పుట్టించే చర్మకణాలు!

రాబోయే రోజుల్లో కాబోయే తల్లిదండ్రులు ఇక చర్మ కణాలు ఇస్తే చాలు.. అంటున్నారు పరిశోధకులు. భవిష్యత్తులో బిడ్డ పుట్టడానికి తల్లిదండ్రుల నుంచి అండం, వీర్యకణాల అవసరం ఇక ఉండదంటున్నారు. చర్మ కణాల నుంచి కృత్రిమంగా వీటిని ఉత్పత్తి చేయవచ్చంటున్నారు. ప్రత్యుత్పత్తి అవయవాల అవసరం లేకుండానే బిడ్డను కనడం సాధ్యమవుతుందిక. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చర్మ కణాల నుంచి అండాన్ని తయారుచేశారు. తద్వారా ఇద్దరు తండ్రులు లేదా ఇద్దరు తల్లుల నుంచి బిడ్డల్ని పుట్టించడానికి ఇది మార్గం వేసిందంటున్నారు. అందుకే భవిష్యత్తులో బిడ్డ కోసం వీర్యకణం లేదా అండాన్ని ఉపయోగించాల్సిన అవసరం లేదంటున్నారు ప్రొఫెసర్ స్టీఫెన్ హిలియర్. బ్రిటన్‌లోని మొదటి ఐవిఎఫ్ యూనిట్‌ను ప్రారంభించినవారిలో ఆయన ఒకరు. నిజానికి శరీరంలోని ఏ కణాల నుంచైనా అండాలు లేదా వీర్యకణాలను తయారుచేయవచ్చని జంతువుల్లో చేసిన ప్రయోగాలు తెలుపుతున్నాయంటున్నారు ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ ప్రొఫెసర్.

ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్ (ఐవిఎఫ్) ప్రయోగాలు జరిగినప్పుడు అదేదో సైన్స్ ఫిక్షన్‌లా అనిపించింది. కాని ఇప్పుడు వేలకొద్దీ శిశువులు ఐవిఎఫ్ ద్వారా పుడుతున్నారు. అదేవిధంగా చర్మకణాలు అండం, వీర్యకణాలను ఉత్పత్తి చేయగలవన్నది ఇప్పుడు ఫిక్షన్‌లా, ఫాంటసీలా కనిపిస్తుంది గానీ త్వరలోనే అది లైంగిక కణాల్లో లోపాలున్నవాళ్లను కూడా తల్లిదండ్రులను చేయగల గొప్ప ప్రయోగం అవుతుందంటున్నారు మాంచెస్టర్‌లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ రాజ్ మాథుర్.

కొత్త లోహం

వచ్చేస్తుంది హైడ్రోజన్ లోహం



ఎలక్ట్రిక్ గ్రిడ్‌లలో శక్తి నష్టం ఇక ఉండదు.. సూపర్ కండక్టింగ్ మ్యాగ్నెటిక్ స్టోరేజ్ తయారీ ఎంతో దూరంలో లేదు.. రాకెట్లను ఒక్క దశలోనే కావలసిన కక్ష్యలో ప్రవేశపెట్టడం ఇక సుసాధ్యం! భారీ ఉపగ్రహాలను ఒకేసారి ఎత్తడమూ వీలవుతుంది..! వైద్యరంగంలో వాడే ఎంఆర్ఐ (మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్) యంత్రాలకు కొత్త రూపు రానుంది... వీటన్నింటికీ కారణం... మెటాలిక్ హైడ్రోజన్! హైడ్రోజన్ వాయువు కాస్తా హైడ్రోజన్ లోహంగా మన ముందుకు రాబోతున్నది. హార్వర్డ్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞులు ఇటీవలే హైడ్రోజన్ లోహాన్ని తయారుచేశారు.

హైడ్రోజన్ అనగానే వాయురూపంలో ఉండే హైడ్రోజనే అన్పిస్తుంది. అంతకు మించి వేరే ఏ స్థితిలోనూ హైడ్రోజన్‌ని ఊహించలేం. నైట్రోజన్ లాంటి వాయువులు ద్రవరూపంలో లిక్విడ్ నైట్రోజన్‌గా లభిస్తాయి గానీ హైడ్రోజన్ గురించి ఇంతవరకు అటువంటి పరిశోధన జరుగలేదు. ఇప్పుడు సైంటిస్టులు హైడ్రోజన్‌ను ద్రవరూపంలోకి మార్చడమే కాకుండా లోహ రూపంలో ఉండే హైడ్రోజన్‌ను కూడా తయారుచేశారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రజ్ఞులు ఇప్పటివరకూ కనీ వినీ ఎరుగని ఈ ఘనత సాధించారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ఫిజీసిస్టులు ఐజాక్ సిల్వేరా, రంగా డయాస్ ఈ అంశం మీద 45 ఏళ్లుగా పరిశోధనలు జరుపుతున్నారు. కాగా ఇటీవలే విజయం సాధించారు. ఈ పరిశోధన ఫలితాలు సైన్స్ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఎలా?

లోహపు హైడ్రోజన్ తయారీలో భాగంగా ముందుగా 4.95 మిలియన్ అట్మాస్ఫియర్ల పీడనాన్ని లిక్విడ్ హైడ్రోజన్‌కి పంపించారు. దాని నుంచి లోహపు స్థితిలో ఉండే హైడ్రోజన్‌ను తయారుచేశారు. భూమి పైన ఇప్పటివరకూ ఎక్కడా కూడా హైడ్రోజన్ లోహ రూపంలో లేదు.

లోహపు హైడ్రోజన్‌ను తయారుచేయడానికి ముందుగా వాయురూప హైడ్రోజన్‌ను కంప్రెస్ చేయడం కోసం రెండు వ్యతిరేక భార వజ్రాలను గట్టిగా అదిమిపెట్టారు. ఆ తరువాత నెమ్మదిగా ఉష్ణోగ్రతలను తగ్గిస్తూ, హైడ్రోజన్‌ను ద్రవ రూపంలోకి తీసుకువచ్చారు. సాధారణంగా –252 డిగ్రీ సెంటీగ్రేడ్ (–423 డిగ్రీ ఫారన్‌హీట్) దగ్గర హైడ్రోజన్ ద్రవ రూపంలోకి వస్తుంది. ఇప్పుడు నెమ్మదిగా వజ్రపు కడ్డీలోకి ఒక స్టీల్ స్క్రూను తిప్పుతూ బలంగా తీసేయడం ద్వారా అత్యధిక పీడనాన్ని కలిగించారు. తద్వారా ఘనరూప హైడ్రోజన్ లభ్యమైంది. 2 మిలియన్ల అట్మాస్ఫియర్ (లేదా 200 జిగాపాస్కల్) పీడనంలో హైడ్రోజన్ పారదర్శకంగానూ, 4 మిలియన్ల అట్మాస్ఫియర్ పీడనం దగ్గర నలుపురంగులో ఉండే ఒపేక్ పదార్థంగా మారినట్టు గమనించారు. ఈ పీడనాలు భూమి కేంద్రభాగంలో కన్నా ఎక్కువ. 4.95 మిలియన్ అట్మాస్ఫియర్ పీడనంలో హైడ్రోజన్ 90 శాతం కాంతిని ప్రతిబింబింపచేసింది. అంటే అది ఇంతకుముందెన్నడూ భూమిపై లభ్యం కాని లోహ రూపంలోకి అది మారినట్టు.

ఇలా వాయురూప హైడ్రోజన్‌ను లోహరూపంలోకి మార్చడాన్ని విగ్నర్–హంటింగ్‌టన్ ట్రాన్సిషన్ అంటారు. 1935లో కూడా ఇందు కోసం ప్రయత్నాలు చేశారు. కాని విజయవంతం కాలేదు.

పీరియాడిక్ టేబుల్‌లో హైడ్రోజన్ మొట్టమొదటి మూలకం. దీనిలో కేవలం ఒక ప్రొటాన్, ఒక ఎలక్ట్రాన్ ఉంటాయి. అయితే ఇది దాని లోహపు రూపంలో అద్భుతమైన సామర్థ్యాన్ని కలిగివుండగలదు. ఈ మెటాలిక్ హైడ్రోజన్ ఒక సూపర్ కండక్టర్‌గా పనిచేస్తుందంటున్నారు శాస్త్రజ్ఞులు. దీన్ని ఇలాగే స్థిరంగా ఉంచగలిగితే శక్తిని నిల్వ ఉంచగలిగే వాటికోసం ఇది పనిచేస్తుంది. రాకెట్‌లలో వాడడానికి కూడా ఉపయోగపడుతుంది.

అన్నీ ప్రయోజనాలే!

సూపర్‌కండక్టింగ్ లోహపు హైడ్రోజన్ ద్వారా వైర్లను తయారచేయవచ్చు. లోహపు హైడ్రోజన్‌కు నిరోధకత లేదు కాబట్టి దీని ద్వారా శక్తిని ప్రసారం చేయడం సులువవుతుంది. మనకు ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రిక్ గ్రిడ్‌లలో వైర్లను వేడిచేయగానే శక్తి ప్రసారం చెందేప్పుడు కొంత శక్తిని నష్టపోతాం. దీని ద్వారా సూపర్ కండక్టింగ్ కాయిల్స్ ద్వారా సూపర్ కండక్టింగ్ మ్యాగ్నెటిక్ స్టోరేజ్‌ను తయారుచేసుకోవచ్చంటున్నారు డాక్టర్ డయాస్. సౌర, వాయు శక్తి వనరులను వినియోగించుకునేప్పుడు పవర్ గ్రిడ్‌లో సమతుల్యత కాపాడడం కోసం వీటిని ఉపయోగించుకోవచ్చంటున్నారాయన. అంతేకాదు ప్రస్తుతం ఎంఆర్ఐ (మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్) స్కాన్ యంత్రాల్లో వాడుతున్న అయస్కాంతాలకు బదులుగా ఈ లోహపు హైడ్రోజన్‌ను వినియోగించుకోవచ్చు. తద్వారా వైద్యరంగంలో కూడా ఇది అనూహ్య మార్పులను తీసుకురానుంది.

లోహరూప హైడ్రోజన్‌ను హై స్పీడ్ ట్రెయిన్లలో మ్యాగ్నెటిక్ లెవిటేషన్ కొరకు ఉపయోగించవచ్చు. సూపర్ కండక్టర్ల డయామ్యాగ్నెటిజమ్ ఆధారంగా ఇవి పనిచేస్తాయి. కాబట్టి ప్రయాణ సాధనాల్లో కూడా ఈ పరిశోధన విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుంది.

రాకెట్రీలో లోహపు హైడ్రోజన్ పాత్ర కీలకంగా మారుతుంది. అతి శక్తి వంతమైన రాకెట్ ప్రొపెల్లెంట్‌గా లోహపు హైడ్రోజన్ పనిచేస్తుందంటున్నారు సిల్వేరా. ప్రస్తుతం ఉన్న రాకెట్ ప్రొపెల్లెంట్స్ కన్నా నాలుగు వంతులు ఎక్కువ సమర్థంగా ఇది పనిచేయగలదు. బాగా వేడిచేసినప్పుడు లోహపు హైడ్రోజన్ హైడ్రోజన్ అణువులుగా మారుతుంది. తద్వారా శక్తి ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇది రాకెట్‌లలో కూడా కీలకంగా మారుతుందంటున్నారాయన. ఇతర గ్రహాలను అన్వేషించడానికి, రాకెట్లను ఒకే దశలో కక్ష్యలో ప్రవేశపెట్టడానికి, భారీ ఉపగ్రహాలను ఒక్కసారిగా ఎత్తడానికి ఇది అద్భుతంగా పనిచేయగలదు. అందుకేనేమో! ఈ పరిశోధన కోసం నాసా కూడా ఫండింగ్ చేసింది.



అయితే ఈ లోహపు హైడ్రోజన్ స్థిరంగా ఉండగలదా లేదా అనేది ఇంకా తేల్చుకోవాల్సి ఉంది.

టెక్నాలజీలో మాణిక్యాలు మట్టి పాత్రలు

టెక్ టెక్ అంటూ నేడు చెప్పుకొంటున్న టెక్నాలజీ.. ఆ కాలంలోనే ఈ మట్టిపాత్రలకు సొంతమనే విషయం చాలామందికి తెలియదు. ఇందులో ఉండే ఆ సైన్స్ టెక్నాలజీ గురించి తెలిస్తే.. అబ్బా! అంతుందా అని ఆశ్చర్యపోకుండా ఉండలేరు. మట్టి పాత్రల్లో వండుకొనే ఖర్మ మాకేమిటి? అనే ఫీలింగ్ నుంచి ఈజీగా బయటకొచ్చేస్తారు. అల్యూమినియమ్, స్టీల్ పాత్రలకు అలవాటుపడిన వాళ్లు సైతం.. మట్టిపాత్రలే శ్రేష్ఠమని ఒప్పుకొంటారు. ఇది మేం చెబుతున్న మాట కాదు. నిపుణులు వ్యక్తం చేస్తున్న స్పష్టమైన అభిప్రాయం.



ఈ జనరేషన్‌వాళ్లు ముప్పై ఏళ్లకే మూలుగుతున్నారు. రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అదే మన ఇండ్లలో ఉండే ముసలవ్వలు మాత్రం.. ఎనభైలు దాటినా ఆరోగ్యంగానే ఉంటారు. చిన్నాచితక జలుబు, దగ్గు వంటివి తప్ప.. ఎలాంటి ఇబ్బందులూ ఉండవు వాళ్లకు. తమ పనులు తామే చేసుకుంటారు. వాళ్లు అంత ఆరోగ్యంగా ఉండడానికి పూర్వకాలపు జీవనవిధానమే కారణం. ముఖ్యంగా వాళ్లు వాడిన మట్టిపాత్రలే వారి పాలిట ఆరోగ్య మాణిక్యాలయ్యాయి.

సాధారణంగా స్టీల్, అల్యూమినియం పాత్రల్లో వండిన ఆహారం 24 గంటలకు మించి నిలువ ఉండదు. కానీ మట్టి పాత్రల్లో వండిన వంటలు.. ఎక్కువ కాలం చెడిపోకుండా ఉంటాయి. కావాలంటే ఇంట్లో నానమ్మనో, అమ్మమ్మనో అడుగండి. ఆ మట్టిపరిమళం గురించి చెబుతారు. ఆ మట్టి పాత్రల్లో 18 రకాల పోషకాలు దాగుంటాయట. తాజాగా జరిపిన ఒక పరిశోధనలో వెల్లడైన విషయమిది. మామూలు పాత్రల్లో వండిన ఆహారంలో ఏడు నుంచి పదమూడు శాతం పోషకాలు ఉంటే, మట్టిపాత్రలో వండిన వంటల్లో వందశాతం న్యూట్రియంట్స్ ఉన్నాయని తేలింది. అంతేకాదు, ఈ మట్టిపాత్రల్లో తయారు చేసిన పదార్థాలకు రుచి కూడా అద్భుతంగా ఉంటుంది.

మట్టి పాత్రలను తయారు చేసేందుకు ఉపయోగించే మట్టిని సిరామిక్ అంటారు. పొయ్యిపై పాత్రను పెట్టగానే ఈ సిరామిక్‌కు వేడి తగిలి.. ఇన్‌ఫ్రారెడ్ కిరణాలు విడుదలవుతాయి. పాత్రను పూర్తిగా శుద్ధి చేస్తాయి. కంటి కనిపించని ఈ కిరణాలకు ఆ పరిసరాలను శుద్ధిచేసే లక్షణం ఉంటుంది. కాబట్టి మట్టిపాత్రలో వండిన వంటను శుభ్రత విషయంలో శంకించాల్సిన అవసరం లేదు.

'అనారోగ్యంతో పుట్టిన శిశువులను ఇంక్యుబేటర్‌లో పెడుతుంటారు వైద్యులు. కొన్ని రోజుల పాటు వాళ్లను ఒక లైటు కింద పడుకోబెడుతారు. ఎందుకంటే ఆ లైట్‌లో వచ్చే ఇన్‌ఫ్రారెడ్ కిరణాలు.. శిశువు శరీరాన్ని పూర్తిగా శుద్ధి చేస్తాయి. కొన్ని గంటల్లోనే శిశువు అనారోగ్యాన్ని తగ్గించే శక్తి ఈ కిరణాలకు ఉంది. అలాంటి కిరణాలే ఈ మట్టిపాత్రల్లో ఉండడం వల్ల.. వాటిలో వండిన ఆహారం శుద్ధితో కూడుకున్నద'ని చెబుతున్నారు నిపుణులు. ఇంతటి టెక్నాలజీ కలిగిన మట్టిపాత్రలు ఉపయోగిస్తే నిండు నూరేళ్లు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపొచ్చు. ముఖ్యంగా షుగర్‌వ్యాధితో బాధపడేవాళ్లకు ఈ మట్టిపాత్రల్లో వండిన ఆహారం తినిపిస్తే.. కొన్ని నెలల్లోనే ఆరోగ్యం కుదుటపడుతుందట. ఇదన్న మాట మట్టిపాత్రల్లో దాగున్న మహా అద్భుతమైన టెక్నాలజీ.

సలహా

జీర్ణాశయ క్యాన్సర్‌కు ఆధునిక చికిత్స



ఆహారపదార్థాలన్నీ జీర్ణించుకొని శరీరానికి అవసరమైన శక్తినంతా సరఫరా చేసేది జీర్ణాశయం. శిశుదశ నుంచి వృద్ధాప్యం దాకా ఆ జీర్ణక్రియ నిరంతరంగా సాగుతూనే ఉంటుంది. అయితే ఒకవేళ ఆ జీర్ణాశయం రోగగ్రస్తమైతే? ప్రత్యేకించి క్యాన్సర్ బారిన పడితే అసలు జీవితమే ప్రశ్నార్థకమవుతుంది. అయితే ఆధునిక వైద్య విధానాలు ఈ సమస్యను సమర్థవంతంగా నివారించగలుగుతున్నాయి. కాకపోతే జీర్ణాశయ క్యాన్సర్ లక్షణాలను గురించిన అవగాహనతో మునుముందే డాక్టర్‌ను సంప్రదిస్తే ఆ క్యాన్సర్ నుంచి పూర్తిగా బయటపడవచ్చు.
జీర్ణాశయ క్యాన్సర్‌లు మనదేశంలో దక్షిణ భారతీయుల్లోనే ఎక్కువ. ఈ క్యాన్సర్ స్త్రీలతో పోలిస్తే మూడింట రెండు వంతులు పురుషులే ఎక్కువగా ఈ క్యాన్సర్ బారిన పడుకుంటారు. ప్రత్యేకించి 50 ఏళ్లు దాటిన వారిలో జీర్ణాశయ క్యాన్సర్లు ఎక్కువగా కనబడతాయి.

ఇన్‌ఫెక్షన్లు వల్లా..?

హెచ్ పైలోరీ ఇన్‌ఫెక్షన్లు ఉన్న వారి జీర్ణాశయంలో లింఫోమాలు వచ్చే అవకాశం ఉంది. జీర్ణాశయ క్యాన్సర్ వస్తే వాటిలో ఎక్కువగా లోలోపల పెరిగే ఎడినో కార్సినోమా క్యాన్సర్ అయ్యే అవకాశం ఎక్కువ. కొన్ని రకాల అధ్యయనాల్లో పొగమంటలతో అంటే కట్టెల మీద గానీ, పొట్టు మీద గానీ వండే పదార్థాలు తినేవారిలో ఈ క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ అని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉప్పు ఎక్కువగా కలిసే కూరలు, పచ్చళ్లు తినే వారిలో కూడా ఈ క్యాన్సర్లు ఎక్కువే. పొగతాగే వారు కూడా ఈ క్యాన్సర్ బారిన ఎక్కువగా పడుతుంటారు. స్థూలకాయుల్లోనూ ఈ క్యాన్సర్ ఎక్కువగానే కనిపిస్తుంది. డియోడినల్ అల్సర్ ఉన్న వారికి వెగాటమీ జిజెసర్జరీ అంటూ చేస్తారు. అలా సర్జరీ చేయించుకున్న వారిలో కూడా జీర్ణాశయ క్యాన్సర్ బారిన పడేవారి సంఖ్య మిగతా వారితో పోలిస్తే కొంచెం ఎక్కువగానే ఉంటుంది. పర్నీషియస్ ఎనిమియా ఉన్న వారిలో కూడా ఈ జీర్ణాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. కారణం ఏమిటో తెలియదు గానీ, ఏ గ్రూపు రక్తం ఉన్న వారు కూడా ఈ క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారసత్వంగా పూర్వికుల్లో నాన్‌పాల్‌ఫోసిస్ కొలరెక్టల్ క్యాన్సర్, రొమ్ము, అండాశయ క్యాన్సర్ ఉన్నవారి వారసుల్లో కూడా జీర్ణాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బొగ్గు, లోహాలు, రబ్బరు పరిశ్రమల్లో పనిచేసే వారిలో కూడా ఈ క్యాన్సర్లు వచ్చే అవకాశాలు కొంచెం ఎక్కువగా ఉంటాయి.

నివారించలేమా?

ఆహార నియమాలు పాటిస్తూ శరీరం బరువును నియంత్రణలో ఉంచుకుంటూ, క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయడం ద్వారా ఈ క్యాన్సర్‌ను చాలా వరకు నియంత్రించవచ్చు. రిఫ్రిజిరేటర్లు లేని రోజుల్లో ఆహార పదార్థాలను ముఖ్యంగా మాంసం, చేపలు, పచ్చళ్లు నిలువ ఉంచడానికి ఉప్పు ఎక్కువగా వాడే వారు. రిఫ్రిజిరేటర్లు వాడడం ఎక్కువవుతున్న క్రమంలో జీర్ణాశయ క్యాన్సర్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దంపుడు బియ్యం వాడటం, తాజా ఆకుకూరలు, కూరగాయలను విరివిగా వాడడం ద్వారా ఈ జీర్ణాశయ క్యాన్సర్‌ను చాలా వరకు నిరోధించే అవకాశాలు ఉన్నాయి. విటమిన్ ఎ,సి,ఇ విటమిన్లు, సెలీనియం వంటి లవణాలు తీసుకుంటూ ఉంటే ఈ జీర్ణాశయ క్యాన్సర్ బారిన పడకుండా తమను తాము కాపాడుకునే అవకాశాలు ఉన్నాయి. గమనిస్తే, పళ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకునే వారిలో ఈ జీర్ణాశయ క్యాన్సర్ చాలా అరుదుగా కనిపిస్తుంది. అవేమీ తీసుకోకుండా, కారం, మసాలా ఆహార పదార్థాలు, పచ్చళ్లు ఎక్కువగా తినే వారిలోనే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే హెచ్ పైలోరీ బ్యాక్టీరియా నివారణకు సకాలంలో వైద్యం తీసుకోగలిగితే ఈ జీర్ణాశయ క్యాన్సర్ బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రక్తం పలచబడానికో, మరే ఇతర కారణం గానోరోజు ఆస్పిరిన్ మాత్రలు వేసుకునే వారికి పేగు క్యాన్సర్ లేదా జీర్ణాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

ఎలా తెలుస్తుంది?

ఈ క్యాన్సర్ లక్షణాల్లో ప్రధానంగా ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, పొత్తికడుపులో నొప్పి రావడం, కడుపులో ఎప్పుడూ ఏదో అసౌకర్యంగా అనిపించడం వంటివి కనిపిస్తాయి. వీటితో పాటు ఏ కొంచెం అన్నం తిన్నా కడుపు నిండిపోయినట్లు అనిపించడం, ఏదీ రుచిగా అనిపించకపోవడం, ఛాతీలో మంట అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలను చాలా మంది కడుపు ఉబ్బరం సమస్య అనుకుంటారు. కానీ, ఒక్కోసారి అది జీర్ణాశయ క్యాన్సర్ లక్షణం కావచ్చు. కొంత మందికి అజీర్తి సమస్యగా కూడా అనిపిస్తుంది. వికారం, వాంతులు, వాంతిలో కొన్ని సార్లు రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కడుపు మీద నుంచి తడిమితే చేతికి గడ్డలా తగలడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది ఈ లక్షణాలన్నింటిని గ్యాస్ సమస్యగా భావించి డైజిన్, జెంటాక్ వంటి మాత్రలు వేసుకంటూ ఉండిపోతారు. క్యాన్సర్ కణితి తాలూకు రక్తం కొన్ని సార్లు బయటికి రాకుండా పేగుల్లోకి వెళ్లిపోయి రక్తం కూడా జీర్ణమవుతుంది. అందుకే నల్లటి విరేచనాలు కావచ్చు. అలా రావడాన్ని మెలీనా అంటారు. అప్పటికే క్యాన్సర్ ముదిరిపోయి ఉంటే పొట్ట ఉబ్బిపోవడం, పొట్టలోకి నీరు చేరడం, కామెర్ల వంటి లక్షణాలు కనిపిస్తాయి.


వ్యాధినిర్ధారణ

కొన్ని లక్షణాలు ఎక్కువ రోజులుగా కనిపిస్తున్నపుడు వెంటనే డాక్టర్‌ను కలవడం ఎంతో అవసరం. వ్యాధి నిర్ధారణకు ఎండోస్కొపీ ఎంతో ఉపయోగపడుతుంది. నిజంగానే అది క్యాన్సరా? లేక అల్సరా తెలిసిపోతుంది. ఒకవేళ క్యాన్సర్ కణితే అయితే అది ఏ భాగంలో ఉంది, ఇతర భాగాలకు వ్యాపించిందా తెలిసిపోతుంది. అదే సమయంలో బయాప్సీ కూడా తీసుకుంటారు. ఆ తర్వాత సీటీ స్కాన్ గానీ, పెట్ సీటీ స్కాన్ గానీ అవసరమవుతుంది. దీని ద్వారా కణితి జీర్ణాశయంలోనే ఉందా? ఇతర భాగాలకు వ్యాపించిందా అనే విషయాలను తెలుసుకోవచ్చు.

చికిత్సలు

వైద్య చికిత్సలు ప్రధానంగా సర్జరీ, కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, రేడియేషన్ థెరపీ అంటూ నాలుగు రకాలుగా ఉంటాయి. వ్యాధి నిర్ధారణ కాగానే సర్జరీ ద్వారా ఆ కణితులను తొలగిస్తారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించగలిగితే ఎండోస్కొపీ ద్వారా కూడా సర్జరీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇలా చేయడాన్ని ఎండోస్కోపిక్ మ్యూకోజల్ డిసెక్షన్ అంటారు. రెండవది పార్షియల్ రాడికల్ గ్యాస్ట్రెక్టమీ చేస్తారు. దీన్నే సబ్ – టోటల్ గ్యాస్ట్రెక్టమీ అని అంటారు. ఒకవేళ క్యాన్సర్ కణితులు బాగా విస్తరించి ఉండే జీర్ణాశయాన్ని మొత్తంగానే తీసేయ్యాల్సి ఉంటుంది. దీన్నే టోటల్ గ్యాస్ట్రెక్టమీ అంటారు. మొత్తం జీర్ణాశయం మొత్తంగా తీసేస్తే జీర్ణక్రియకు ఇబ్బంది ఏర్పడుతుందని అనుకుంటారు, కానీ నిజానికి జీర్ణక్రియ దాదాపుగా చిన్న పేగుల్లోనే జరుగుతుంది. లింఫ్‌నోడ్స్‌లోకి వ్యాపించి ఉంటే అప్పుడు లింఫ్ నోడ్స్ కూడా తీసేయాల్సి రావచ్చు. సర్జరీ తర్వాత పరిస్థితి అనుసరించి కీమోథెరపీ గానీ, కీమో– రేడియో థెరపీ గానీ ఇవ్వాల్సి ఉంటుంది. కీమో థెరపీతో పాటు కొందరికి మెరెసెప్టిన్ కూడా ఇవ్వడం జరుగుతంది. దీన్నే టార్గెటెడ్ థెరపీ అంటారు. చివరకు టార్గెటెడ్ థెరపీ ఇస్తారు. జీర్ణాశయ క్యాన్సర్ అనగానే వణికిపోవడం ఒకప్పటి మాట. ఆధునిక వైద్య విధానాలు ఆ క్యాన్సర్‌ను సమూలంగా తొలగించగలుగుతున్నాయి. కాకపోతే వ్యాధిని ఎంత త్వరితంగా గుర్తించగలిగితే అంత ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది.

డా. సి.హెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్
హైదరాబాద్
9848011421



సుడోకు

డైలీ సుడోకు 107 సమాధానం

6	3	5	1	7	2	4	9	8
8	9	7	4	3	6	1	2	5
2	1	4	9	8	5	7	3	6
3	4	6	2	9	1	5	8	7
5	7	9	8	4	3	2	6	1
1	2	8	6	5	7	3	4	9
7	5	2	3	6	8	9	1	4
4	6	3	5	1	9	8	7	2
9	8	1	7	2	4	6	5	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -108

				8	3			2
1		5	6					
		3			7			
7		4				6	2	
3								5
	6	9				7		4
			8			2		
					5	9		3
4			9	1				

అనుష్క.... ప్రస్తుతం ఈ పేరే ఒక విజయమంత్రం. మహిళా ప్రధాన ఇతివృత్తాలు, చారిత్రక కథాంశాలు, శక్తివంతమైన పాత్రలకు దక్షిణాదిలో కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హీరోలతో సమానమైన స్థాయిలో స్టార్‌డమ్‌ను సొంతం చేసుకుంది. రుద్రమదేవి, బాహుబలి చిత్రాలు ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టాయి. విజయాల్ని చూసి ఎప్పుడూ గర్వపడనని, తానొక నిత్యవిద్యార్థినని చెబుతున్నది అనుష్క. చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి పన్నెండేళ్లయినా నేర్చుకోవాలనే తపన, నటనపట్ల మక్కువ కొంచెం కూడా తగ్గలేదని చెప్పింది. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'భాగమతి'. యు.వి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. జి. అశోక్ దర్శకుడు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈసందర్భంగా అనుష్క 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించింది. ఆ విశేషాలివి...

నాకు తప్పులే ఎక్కువ కనిపిస్తాయి!



అనుష్క

'భాగమతి' కథ కోసం ఐదేళ్లు వేచిచూశారట?

• కథతో పాటు యు.వి క్రియేషన్స్ నిర్మాణ సంస్థ కోసం ఈ సినిమా చేశాను. 'మిర్చి' చేస్తున్న సమయంలో ఈ కథ విన్నాను. ఇందులోని నవ్యత నన్ను ఆకట్టుకుంది. మంచి సినిమా అవుతుందనిపించింది.

మూడు భాషల్లో ఒకేసారి నటించడం ఇబ్బందిగా అనిపించలేదా?

• తెలుగు, తమిళ భాషల్లోనే ఈ సినిమా చేశాం. మలయాళంలో అనువాద రూపంలో విడుదలచేస్తున్నాం. బాహుబలి, రుద్రమదేవి సినిమాలకు తమిళంలో మంచి ఆదరణ లభించడంతో ఒకే సారి రెండు భాషల్లో రూపొందించాలని నిర్ణయించుకున్నాం.

ఇంతకీ భాగమతి కథేమిటి? ఇందులో మీరు రెండు పాత్రల్లో కనిపించబోతున్నట్లు తెలిసింది? నిజమేనా?

• అది మాత్రం సస్పెన్స్(నవ్వుతూ). ట్రైలర్‌లోనే కథేమిటో కొంత చెప్పాం. మిగతాది తెరపై చూడాల్సిందే. చంచల అనే ఐఏఎస్ అధికారిణిగా ఈ సినిమాలో కనిపించబోతున్నాను. వృత్తి నిర్వహణతో పాటు తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఆటుపోట్లను ఆమె ఎలా అధిగమించిదన్నది ఆసక్తిని పంచుతుంది. నాతో పాటు ప్రతి ఒక్కరి పాత్రకు ప్రాధాన్యముంటుంది.

ఒక్కో సినిమా కోసం సంవత్సరాల పాటు సమయాన్ని కేటాయించడం ఇప్పడున్నా పోటీ పరిస్థితుల్లో సరైన నిర్ణయమేనని అనుకుంటున్నారా?

• మంచి కథలు అరుదుగా వస్తుంటాయి. అలాంటి కథలు దొరికినపుడు రెండు, మూడేళ్లు సమయాన్ని కేటాయించడం సబబేనని అనుకుంటున్నాను. అప్పుడే ఆ కథలు, పాత్రలకు పూర్తిగా న్యాయం చేయగలిగే అవకాశం దొరుకుతుంది. నటన పరంగా చాలా నేర్చుకునే అవకాశం లభిస్తుంది.

'బాహుబలి' మీ ఇమేజ్‌లో ఎలాంటి మార్పును తీసుకొచ్చిందని అనుకుంటున్నారు?

• ఆ సినిమా విడుదలైన తర్వాత ఇండియాలో ఎక్కడికి వెళ్లినా నన్ను గుర్తుపడుతున్నారు. ఆ స్థాయిలో పేరుప్రఖ్యాతులు వస్తాయని ఊహించలేదు. అలాగని ప్రతిసారి 'బాహుబలి' లాంటి సినిమాలే చేయాలంటే కుదరదు. లైఫ్‌లో ఎప్పుడో ఒకసారి అలాంటి అవకాశాలు వస్తాయి. అయితే వ్యక్తిగతంగా ఆ సినిమా నాలో ఎలాంటి మార్పులు తీసుకురాలేదు.

ప్రభాస్‌తో మీరు ప్రేమలో ఉన్నారని, పెళ్లిచేసుకోబోతున్నారని ప్రచారం జరుగుతున్నది?

• గాసిప్స్ చిత్ర పరిశ్రమలో సహజం. కొత్తగా ఇప్పుడే నాతో అవి మొదలవ్వలేదు. సినీ పరిశ్రమలోని ప్రతి ఒక్క హీరోయిన్‌పై ఇలాంటి పుకార్లు వినిపించాయి. అవి అబద్ధాలని చెప్పడం తప్ప వాటిని మార్చడం ఏ ఒక్కరి వల్ల కాదు. ప్రభాస్ పదేళ్లుగా నాకు మంచి మిత్రుడు. బాహుబలి, దేవసేన పాత్రలు చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అలాంటి భాగస్వాములు దొరికితే బాగుండునని కోరుకుంటారు. ఆ సినిమాలో మమ్మల్ని చూసి కొందరు ఇలాంటి గాసిప్స్‌ను సృష్టించారని అనుకుంటున్నాను.

వ్యక్తిగతంగా మీరు ఎలాంటి సినిమాల్ని చేయడానికి ఇష్టపడతారు?

• డ్రామా, రొమాన్స్, ఫాంటసీ కథాంశాలతో కూడిన సినిమాల్ని చేయాలని ఉంటుంది. యాక్షన్, థ్రిల్లర్‌లు నచ్చవు. కానీ అన్ని అలాంటి అవకాశాలే వెతుక్కుంటూ వస్తున్నాయి.

థ్రిల్లర్ సినిమాలు నచ్చవని చాలా సందర్భాల్లో చెప్పారు. అలాంటిది థ్రిల్లర్ సినిమాలో నటించడం ఎలాంటి అనుభూతినిచ్చింది?

• హారర్, థ్రిల్లర్ సినిమాలన్నా, కత్తియుద్ధాలు, చంపే సన్నివేశాలంటే నాకు భయం. వ్యక్తిగతంగా అలాంటి సినిమాల్ని నేను చూడను. అలాగని ఆ సినిమాలు చేయకూడదనే నియమాలేవి నాకు లేవు. నటిగా అన్ని రకాల కథాంశాల్లో ఒదిగిపోవడానికే తపిస్తాను. ఆ సిద్ధాంతాన్ని నమ్మే ఈ సినిమాకు అంగీకరించాను.

ట్రైలర్‌లో చెప్పినట్లుగా ఒంటరిగా మీరు ఒక్కరే ఇంట్లో ఉండే సందర్భం వస్తే ఏం చేస్తారు?

• నేను అలా అస్సలు ఉండలేను(నవ్వుతూ). ఒంటరితనం నాకు నచ్చదు. అలాంటి చోట ఒక్క క్షణం కూడా ఉండను. నా చుట్టూ మనుషులు ఉండాలి. ఇంట్లో ఎప్పుడూ సందడి కనిపించాలి.

మహిళా ప్రధాన ఇతివృత్తాలు, ప్రయోగాలకు ప్రాధాన్యతనిస్తున్న మీరు కమర్షియల్ సినిమాలకు కొంత దూరమైనట్లు కనిపిస్తున్నారు?

• గత పది, పన్నెండేళ్లుగా విరామం లేకుండా సినిమాలు చేస్తూనే ఉన్నాను. కొన్నాళ్ల పాటు వ్యక్తిగతంగా నాకంటూ కొంత సమయం కావాలనిపించింది. అందుకే 'బాహుబలి' తర్వాత విరామం తీసుకున్నాను. అంతే తప్ప సినిమాలకు ఎప్పుడూ దూరమవ్వలేదు. మంచి కథ లభిస్తే తప్పకుండా కమర్షియల్ సినిమా చేస్తాను.

నటిగా మీలోని తప్పొప్పుల్ని ఎలా విశ్లేషించుకుంటారు?

• నా సినిమాల్నిచూసుకుంటునప్పుడు తప్పులే ఎక్కువగా కనిపిస్తుంటాయి. అందుకే నన్ను నేను తెరపై చూసుకోవాలంటే ఒత్తిడికి గురవుతాను.

సైరా నరసింహారెడ్డి, సాహో సినిమాల్లో అవకాశాల్ని వచ్చినా కాదనుకున్నారని తెలిసింది?

• 'సైరా...' నుంచి అధికారికంగా నన్ను ఎవరూ సంప్రదించలేదు. కానీ 'సాహో' కోసం తొలుత నన్ను అడిగారు. 'బాహుబలి' తర్వాత విరామం తీసుకోవాలనే ఆలోచనతో పాటు 'భాగమతి' షూటింగ్‌తో బిజీగా ఉండటంతో కుదరలేదు.

తదుపరి సినిమా విశేషాలేమిటి?

• గౌతమ్‌మీనన్‌తో ఓ సినిమా చేయబోతున్నాను.

మీ పెళ్లి గురించి చాలా రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి?

• అవన్నీ బయటి నుంచి వస్తున్న వార్తలే. నాకు నేనుగా పెళ్లి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. నేనంటే అభిమానంతో అభిమానులు పెళ్లి గురించి మాట్లాడుతున్నారు. అలాంటి వారిని వద్దని వారించలేను.

ప్రభాస్‌ను అన్నయ్య అని పిలవలేనని ఇటీవలే ఓ వేడుకలో చెప్పారు?

• నేనలా ఎప్పుడు అనలేదు. నేను చెప్పింది వేరు. దానిని తిరగేసి రాశారు. పదేళ్లుగా స్నేహితుడిగా ఉన్న వ్యక్తిని అన్నయ్య అని నేనేందుకు పిలుస్తాను. నాకు ఇద్దరు అన్నయ్యలు ఉన్నారు. వారిని వదిలి పెట్టి ప్రభాస్‌ను అన్నయ్య అని పిలవాల్సిన అవసరం లేదు.

నాగార్జునతో మీకు విభేదాలు వచ్చాయని, అందుకే నాగచైతన్య పెళ్లికి హాజరు కాలేదని వార్తలు వచ్చాయని చెబుతున్నారు?

• నాగార్జున నాకు అత్యంత ఆత్మీయుడు. ఆయనతో నాకు ఎలాంటి విభేదాలు లేవు. అవన్నీ రూమర్సే.





తమన్నా, విక్రమ్

మళ్లీ పాత విక్రమ్‌ను చూస్తారు!

'పూర్తిస్థాయి మాస్ సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. 'స్కెచ్' ఆ లోటును తీర్చింది. చాలా కాలం విరామం తర్వాత నేను చేసిన మాస్‌మసాలా చిత్రమిది. ప్రేక్షకులకు మళ్లీ పాత విక్రమ్ గుర్తొస్తాడు' అన్నారు విక్రమ్. ఆయన కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'స్కెచ్' అదే పేరుతో తెలుగులో విడుదలవుతున్నది. తమన్నా కథానాయిక. విజయ్‌చందర్ దర్శకుడు. త్వరలో ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ 'తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం చక్కటి విజయాన్ని సాధించింది. తెలుగులో అంతకుమించి సక్సెస్ అవుతుందనే నమ్మకం వుంది. నేను మాస్ సినిమా చేసి చాలా ఏళ్లయింది. నాలోని హీరోయిజాన్ని కొత్తగా ఆవిష్కరించే చిత్రమిది. మాస్‌తో పాటు సినిమాలో ఫాంటసీ అంశాలు కూడా ఉంటాయి. ఇలాంటి సినిమాలు అభిమానులతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకుంటాయి. 'స్కెచ్' నా కెరీర్‌లో ఓ విభిన్న చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థతో నాకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం వుంది. వారు ఈ చిత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా వుంది' అన్నారు. తమన్నా మాట్లాడుతూ ' కెరీర్ ఆరంభం నుంచి విక్రమ్‌తో పనిచేయాలనుకుంటున్నాను. పదేళ్ల తర్వాత నా కల నెరవేరింది. నాకు కమర్షియల్ సినిమాల చేయడం చాలా ఇష్టం. ఈ కథ విన్నప్పుడు చాలా ఎక్సైట్ అయ్యాను. ఇందులో నా పాత్ర చిత్రణ వినూత్నంగా వుంటుంది' అని చెప్పింది. సురేష్‌బాబు మాట్లాడుతూ 'విక్రమ్‌తో నాకు సుదీర్ఘ అనుబంధం వుంది. కష్టపడి ఉన్నతస్థానానికి చేరుకున్నాడు. 25ఏళ్ల క్రితం ఎలా వున్నాడో ఇప్పుడూ అదే ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్స్ చూశాను. చాలా బాగున్నాయి. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని కూడా మెప్పిస్తుందని నమ్ముతున్నాను. ఇలాంటి మంచి సినిమాలు వచ్చినప్పుడు ఇండస్ట్రీ ఆరోగ్యవంతంగా వుంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథ, కథనాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తమిళంలో మాదిరిగానే తెలుగులో కూడా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే విశ్వాసముంది' అని పేర్కొన్నారు.

అంతరిక్ష నేపథ్య తొలిచిత్రమిది



జయం రవి

'అంతరిక్షం నేపథ్యంలో తెరకెక్కిన తొలి భారతీయ చిత్రమిది. ఈ ప్రయత్నాన్ని చేసిన తొలి కథానాయకుడిని నేనే అయినందుకు గర్వపడుతున్నాను' అని అన్నారు జయంరవి. ఆయన కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'టిక్ టిక్ టిక్'. ఈ సినిమాను అదే పేరుతో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. పద్మావతి చదలవాడ నిర్మాత. శక్తి సౌందర్‌రాజన్ దర్శకుడు. త్వరలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. జయం రవి మాట్లాడుతూ ' దేశానికి ఎదురైన ఆపదను ఓ ఇంద్రజాలికుడు తన శక్తియుక్తులతో ఎలా పరిష్కరించాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. హాలీవుడ్ తరహాలో అంతరిక్ష కథాంశంతో మనమెందుకు సినిమా చేయకూడదనే సానుకూల ఆలోచనతో చేసిన ప్రయత్నమిది. లార్జర్‌దెన్ లైఫ్‌గా సాగే ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది' అని అన్నారు. మరో మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ఆనందంగా ఉందని, 'బిచ్చగాడు' తరహాలోనే ఈ సినిమా విజయాన్ని సాధిస్తుందనే నమ్మకముందని నిర్మాత శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మనసు బంగారం



కీర్తిసురేష్

అసమాన నటనాకౌశలంతో తెలుగు వెండితెరపై మహానటిగా విరాజిల్లింది సావిత్రి. ఏ తరంలోనూ ఆమెకు సాటి రాగల కథానాయికలు లేరనడం అతిశయోక్తికాదు. శిఖరసమానమైన నటనతో పాటు వ్యక్తిత్వంలో కూడా గొప్ప మానవతావాదిగా సావిత్రి గురించి చెప్పుకుంటారు. ఆమె వితరణ తాలూకు అనేక విషయాలు అలనాటి పరిశ్రమలో ప్రముఖంగా వినిపించేవి. ప్రతి సినిమా షూటింగ్ చివరి రోజున లైట్‌బాయ్ మొదలుకొని యూనిట్ సభ్యులందరికి సావిత్రి బంగారు నాణాలను కానుకగా ఇచ్చేదట. కెరీర్ ఆసాంతం ఆమె ఈ సంప్రదాయాన్ని కొనసాగించింది. తాజాగా సావిత్రి జీవిత కథా చిత్రం 'మహానటి'లో టైటిల్ రోల్‌ని పోషిస్తున్న కీర్తిసురేష్ కూడా...సావిత్రి ఆనవాయితీని గౌరవిస్తూ యూనిట్ సభ్యులకు బంగారు నాణాల్ని బహూకరించిందట. ఈ విషయం టాలీవుడ్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. 'మహానటి' చిత్రానికి నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సావిత్రి పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్న కీర్తిసురేష్ అందులో రాణించడానికి శాయశక్తులా కృషిచేస్తున్నదని చిత్ర బృందం చెబుతున్నది. ప్రస్తుతం ఈ చిత్రం చివరి షెడ్యూల్‌ను జరుపుకుంటున్నది. దీంతో సావిత్రి తరహాలోనే యూనిట్ సభ్యులందరికి బంగారు నాణాలను అందించిందట కథానాయిక కీర్తిసురేష్. ఆమె సహృదయతకు చిత్ర బృందమంతా ఫిదా అయిపోయారట. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా పతాకంపై ప్రియాంకదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



సి.వి.రావు, కల్యాణ్, బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్

రికార్డులు కాదు.. ఇండస్ట్రీ బాగుండాలి!

'వ్యాపారాత్మక ధోరణి పెరగడంతో ఇండస్ట్రీ తీరు మారింది. ప్రస్తుతం నిర్మాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది' అని అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'జై సింహా'. సీకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మించారు. కె. యస్. రవికుమార్ దర్శకత్వం వహించారు. నయనతార, హరిప్రియ, నటాషాదోషి కథానాయికలుగా నటించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'నిర్మాతలకు నేను చాలా ప్రాముఖ్యతనిస్తుంటాను. సినిమాకు సంబంధించిన ప్రతి అంశాన్ని వారితో చర్చిస్తుంటాను. దాసరి నారాయణరావు దర్శకత్వంలో ఓ సినిమా చేయాలనే కోరిక ఉండేది. ఆ కల 'పరమవీరచక్ర' రూపంలో సి. కల్యాణ్ ద్వారా నెరవేరింది. ఆ సినిమాకు జాతీయ అవార్డు వచ్చింది. 'జై సింహా'తో మా కలయికలో మరో పెద్ద విజయం రావడం ఆనందంగా ఉంది. ఈ విజయంతో అందరి కళ్లల్లో ఆనందం కనిపిస్తున్నది. నా సినిమాలన్నీ రికార్డులను సృష్టించాయి. 'సమరసింహారెడ్డి' చిత్రం 32 సెంటర్స్‌లో సిల్వర్‌జూబ్లీ పూర్తిచేసుకుంది. రికార్డులు నాకు ముఖ్యం కాదు ఇండస్ట్రీ బాగుండాలి. నా సినిమా ఎన్ని రోజులు ఆడిందో, ఎంత వసూళ్లు చేసిందనే లెక్కలు నాకు తెలియవు. దర్శకుడు కె.యస్.రవికుమార్‌తో సినిమా చేయాలని ఎనిమిదేళ్లుగా ఎదురుచూశాను. నా నమ్మకానికి పూర్తిగా న్యాయం చేశారాయన. నిర్మాతల బాగోగుల్ని దృష్టిలో పెట్టుకొనే నేను సినిమాలు చేస్తాను. అందరికి లాభాలు రావాలనే కోరుకుంటాను. అభిమానులే నా కష్టసుఖాల్లో వెన్నంటి నిలిచారు. నేను సంపాదించుకున్న ధనం వారి అభిమానమే. నిర్మాతలు, సమాజం బాగుకోసమే మరిన్ని మంచిసినిమాలు చేస్తాను. అలాగే నాన్నగారి జీవితకథను అగస్టులో ప్రారంభించబోతున్నాను' అని తెలిపారు. నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ 'వందరోజులు, యాభై రోజుల పండుగలు కనుమరుగైపోయాయి. ఎన్ని కోట్లు అనే సంస్కృతి ఇండస్ట్రీలో ప్రారంభమైంది. విడుదలైన పది రోజుల్లోనే మా సినిమా యాభై కోట్ల మార్కును చేరుకోవడం ఆనందంగా ఉంది. తొలుత సంక్రాంతి పండుగకు రావద్దు అని చాలా మంది నిరుత్సాహపరిచారు. కానీ పది మంది డిస్ట్రిబ్యూటర్లు మాత్రం నాలో ధైర్యాన్ని నింపారు. వారి వల్లే ఈ విజయం సాధ్యమైంది. నా జీవితాంతం చెప్పుకోనేలా పెద్ద హిట్ ఇచ్చారు. ఇప్పటివరకు అరవై తొమ్మిది సినిమాలు చేశాను. ఇది నాదని గర్వంగా చెప్పుకునే చిత్రమిది' అని అన్నారు.

కామెడీ హీరోలు తగ్గిపోయారు!

'కామెడీ సినిమాల దర్శకుడు అనే ముద్రను ఆస్వాదిస్తున్నాను. ఆ ఇమేజ్ నుంచి దూరం అవ్వాలనే ఆలోచన నాకు లేదు' అని అన్నారు దర్శకుడు జి. నాగేశ్వరరెడ్డి. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఆచారి అమెరికాయాత్ర'. మంచు విష్ణు, ప్రగ్యా జైస్వాల్ జంటగా నటిస్తున్నారు. కీర్తి చౌదరి, కిటు నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో జి.నాగేశ్వరరెడ్డి పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...

తాత మనవరాళ్ల అనుబంధం నేపథ్యంలో ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది. కొందరు శత్రువుల కారణంగా వారి జీవితాలు ప్రమాదంలో పడతాయి. ఆ తాతమనవరాలిని ఆచారులు ఎలా కాపాడారు?అమెరికాలో వారికి ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి? పాశ్చాత్య సంస్కృతిలో ఇమడలేక ఆ ఆచారులు ఎలాంటి సంఘర్షణకు లోనయ్యారన్నదే ఈ చిత్ర కథ. పదిహేనేళ్ల క్రితం దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు సృష్టించిన ఆచారి అనే పాత్ర ఆధారంగా రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి అద్భుతమైన ఈ కథను సిద్ధంచేశారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి సన్నివేశం నవ్విస్తుంది. విష్ణు, బ్రహ్మానందం పాత్రలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.



నాగేశ్వరరెడ్డి

జాగ్రత్తలు తీసుకున్నాం...

'దేనికైనా రెడీ' సినిమాలో బ్రాహ్మణులపై తెరకెక్కించిన సన్నివేశాల పట్ల కొందరు అభ్యంతరాలను వ్యక్తంచేశారు. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రూపొందించాం. బ్రాహ్మణుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఈ సినిమా ఉంటుంది.

కామెడీ హీరోలు తగ్గిపోయారు..

ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో కామెడీని పండించే హీరోలు తగ్గిపోయారు. రాజేంద్రప్రసాద్, నరేష్ స్థానాన్ని భర్తీ చేసే కథానాయికలు లేకపోవడంతో పూర్తిస్థాయి వినోదభరిత సినిమాల సంఖ్య తగ్గింది. కామెడీ సినిమాల సక్సెస్ రేంజ్ తక్కువగా ఉండటంతో నూతన దర్శకులు ప్రేమకథలు, యాక్షన్ అంశాలపై దృష్టిసారిస్తున్నారు.

Dwaraka

కార్మికశాఖకు ఈ-గవర్నెన్స్ అవార్డు హర్షణీయం

హోం, కార్మికశాఖల మంత్రి నాయిని



సోమవారం సచివాలయంలో కార్మికశాఖ అధికారులను సన్మానిస్తున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్మికశాఖకు ఈ-గవర్నెన్స్ అవార్డు రావడం సంతోషంగా ఉన్నదని హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. కార్మికశాఖలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. సోమవారం సచివాలయంలో కార్మికశాఖ అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. సులభతర వాణిజ్య వ్యాపారంలో తెలంగాణకు మొదటి స్థానం వచ్చిందన్నారు. జాతీయ మీడియా దేశంలోనే నంబర్‌వన్ సీఎం కేసీఆర్ అని కితాబు ఇచ్చిందన్నారు. అవినీతికి తావులేకుండా పరిశ్రమల లైసెన్స్, కాంట్రాక్టు లైసెన్స్‌లన్నీ కార్మికశాఖ వెబ్‌సైట్ ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. కార్మిక చట్టాల ప్రకారం జరిగే రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్, వెల్ఫేర్ ఫండ్, థర్డ్ పార్టీ వెరిఫికేషన్, తనిఖీ నివేదికలు, నోటీస్ వంటి సేవలను కార్మికశాఖ పోర్టల్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. కార్మికశాఖ లైసెన్స్ పొందడానికి ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ వెబ్‌పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌సేవలు అందిస్తున్నందుకు కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ)-నిహిలెంట్ సంస్థలు కార్మికశాఖకు ఈ-గవర్నెన్స్ అవార్డును బహూకరించాయని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి శశాంక్‌గోయల్, కమిషనర్ నదీమ్ అహ్మద్, డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్ జాజు తదితరులను మంత్రి నాయిని సన్మానించారు.

స్విట్జర్లాండ్ టీఆర్‌ఎస్ శాఖ ఆవిర్భావం

జ్యూరిచ్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన మంత్రి కేటీఆర్

బంగారు తెలంగాణలో ఎన్నారైలు భాగస్వాములు కావాలని పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్విట్జర్లాండ్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ శాఖ ఆవిర్భవించింది. జ్యూరిచ్ నగరంలో జరిగిన టీఆర్‌ఎస్ శాఖ ఆవిర్భావ సమావేశంలో స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కే తారకరామారావు పాల్గొన్నారు. ఎన్నారైలు పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ఇప్పటికే పలు దేశాల్లో తన శాఖలను ఏర్పాటుచేసిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఎన్నారైలు బంగారు తెలంగాణ సాధనలోనూ తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో టీఆర్‌ఎస్ శాఖల ఏర్పాటుకు ప్రత్యేక చొరువ చూపిస్తున్న పార్టీ ఎన్నారై సమన్వయకర్త మహేశ్ బిగాల స్విట్జర్లాండ్‌లోనూ శాఖ ఏర్పాటుకు కృషిచేశారు. పదిమందితో అడ్‌హాక్ కమిటీని ఏర్పాటుచేశామని, త్వరలో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని మహేశ్ తెలిపారు. శ్రీధర్ గందే, కిశోర్ తాటికొండ, అనిల్ జాల, అల్లు కృష్ణరెడ్డి, పద్మజారెడ్డి, పవన్ దుద్దిళ్ల, పాండురంగారెడ్డి, రాజేందర్ బసెట్టి, ప్రవీణ్ గార్లపాటి , శైలేశ్ అగర్వాల్‌తో కూడిన తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈశాఖ ఏర్పాటు కోసం డెన్మార్క్ టీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి శ్యామ్ ఆకుల ప్రత్యేకంగా కృషి చేశారని మహేశ్ చెప్పారు. పార్టీశాఖ ఆవిర్భావ సమావేశంలో లండన్ నుంచి అనిల్ కూర్మాచలం, నవీన్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

పాత నేరస్థుల సర్వేపై డీజీపీ ఆరా

జిల్లాల్లో పర్యటిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లాల్లో పర్యటిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి శాంతిభద్రతల పరిస్థితితోపాటు పాతనేరస్థుల సమగ్ర సర్వేపై కూడా ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. సర్వేలో పాల్గొన్న సిబ్బందితో మాట్లాడుతూ పలు సూచనలు చేస్తున్నారు. పోలీసుశాఖలో టెక్నాలజీ వాడకాన్ని పెంచి, తెలంగాణను నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ నెల 18న పాత నేరస్థుల సమగ్ర సర్వేను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 75శాతం సర్వే పూర్తయిందని, 15శాతం మంది నేరస్థులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారని అధికారులు డీజీపీకి వెల్లడించారు. ఈ సర్వేలో భాగంగా స్టేట్ క్రైమ్ రికార్డు బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ)లో నేరస్థుల వివరాలను, జిల్లాలవారీగా రూపొందించి, సంబంధిత జిల్లా పోలీసు అధికారులకు పంపించారు. ప్రతిజిల్లాలో స్థానికంగా నివాసముండే నేరస్థుల కంటే ఇతర జిల్లాల వారే ఎక్కువగా ఉండటంతో సర్వే సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసులు నమోదైన సమయంలోనే నేరస్థుల వివరాలను వారు నివాసముంటున్న పోలీస్‌స్టేషన్‌కు ఇచ్చి ఉంటే ఇబ్బందులు వచ్చేది కావని, చాలామంది రికార్డుల్లో ఉన్న చిరునామాల్లో ఉండటంలేదని సర్వేలో పాల్గొన్న సిబ్బంది చెప్తున్నారు. కొందరు నేరస్థులు చనిపోయి చాలా కాలమైనట్టు సర్వే ద్వారా తెలుస్తున్నదని అంటున్నారు. ఒక పక్క సర్వే నిర్వహిస్తూనే, మరోపక్క సర్వేలో సేకరించిన నేరస్థుల వివరాలను కంప్యూటరీకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు.



సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీజీజీని సందర్శించిన కర్ణాటక అధికారుల బృందం

కర్ణాటక సీజీజీ భాగస్వామిగా తెలంగాణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ విభాగాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐటీ సేవలందిస్తూ పురోగమిస్తున్న హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక భాగస్వామిగా ఎంపికయింది. ఈ మేరకు కర్ణాటకలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అందించే ఐటీ ఆధారిత సేవలకు హైదరాబాద్ సీజీజీ మార్గనిర్దేశం చేయనున్నది. కర్ణాటక ప్రభుత్వానికి చెందిన అత్యున్నతస్థాయి ప్రతినిధి బృందం సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీజీజీని సందర్శించింది. కర్ణాటక అడిషనల్ చీఫ్ సెక్రటరీ రాజీవ్‌చావ్లా, ఈడీసీఎస్ డైరెక్టర్ సునిల్ పన్వర్, ఈ గవర్నెన్స్ సీఈవో కే నాగరాజ, ప్రిన్సిపల్ కన్సల్టెంట్ రిషి దీక్షిత్‌లతో కూడిన బృందం సీజీజీ పనితీరుపై అధ్యయనం చేసింది. హైదరాబాద్ సీజీజీ డైరెక్టర్ రాజేంద్రనిమ్జేతో భేటీ అయిన వీరు బెంగళూరులో ఏర్పాటు చేయబోయే సీజీజీ సెంటర్, నిర్వహణ అంశాలపై చర్చించారు.



తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న సీఎస్ ఎస్పీసింగ్. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

దేశాన్ని ఆకర్షిస్తున్న రాష్ట్ర పథకాలు

■ టీజీవోఏ డైరీ ఆవిష్కరణలో సీఎస్ ఎస్పీసింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో అందరి దృష్టిని ఆకర్షించాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ చెప్పారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం 2018 డైరీని ఆవిష్కరించారు. రాష్ట్ర సాధన కోసమే ఈ సంఘం పుట్టిందని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఇది ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వమని సంఘం అధ్యక్షురాలు మమత తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విష్ణువర్ధన్‌రావు, నాయకులు కృష్ణమూర్తి, రవీందర్‌రావు, మధుసూదన్, రవికుమార్, మీర్జాఅలీబేగ్, అరుణ్‌కుమార్, సుజాత, సబిత, జ్యోతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో లక్ష్మిపై చట్టపరమైన చర్యలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అధికారులను తప్పుదోవ పట్టించి ఉద్యోగం సంపాదించిన జోగుళాంబ గద్వాల జిల్లా ఆర్టీవో లక్ష్మిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే ఆమెను ప్రభుత్వం విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఉద్యోగం పొంది, ఎస్టీ కులం పేరుతో రిజర్వేషన్ల కోటాను దుర్వినియోగం చేసి పదోన్నతి పొందిన ఉదంతంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. 1986 నవంబర్ 28 నుంచి లక్ష్మికి లభించిన వేతనం, సౌకర్యాల బిల్లులు తిరిగి రాబట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. తప్పుడు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను దాఖలుచేసిన లక్ష్మిపై పూర్తి వివరాలను సేకరించిన అనంతరం రవాణాశాఖ కమిషనర్ కోర్టులో కేసు వేయనున్నారు.

అన్నివర్గాలకు నాణ్యమైన విద్య

అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విద్యాసంస్థలు

ఉన్నత విద్యామండలి ప్రణాళికలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అంతర్జాతీయ ప్రమాణాల మేరకు రాష్ట్రంలోని ఉన్నత విద్యారంగాన్ని తీర్చిదిద్దడానికి రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 2018-2020 రెండేండ్ల స్వలకాలిక, 2020- 2024 ఐదేండ్ల దీర్ఘకాలిక వ్యూహాలను రూపొందించింది. రాష్ట్రంలోని అన్నిగ్రామాలు, పట్టణాల్లోని అన్నివర్గాలవారికి, ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉన్నత విద్యాభివృద్ధి కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసింది. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా సంస్థలు, పరిశ్రమల అందరి భాగస్వామ్యంతో నాణ్యమైన విద్యను అందరికీ సమానంగా అందించడమే ప్రధాన లక్ష్యంగా తయారుచేసిన ప్రణాళికలను సోమవారం సీజీజీ వెబ్‌సైట్ ద్వారా రాష్ట్ర ప్రణాళిక విభాగానికి అధికారులు అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలలో మౌలిక వసతి సదుపాయాలు, ప్రమాణాలు, టీచింగ్ సిబ్బందితోపాటు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఆ దిశగా అన్ని యూనివర్సిటీలు, ప్రభుత్వ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలను నిబంధనల ప్రకారం నడిపించే లక్ష్యంతో ముందుకు పోతున్నామని చెప్పారు. ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడేవిధంగా తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అన్నిరకాల ప్రయత్నాలను కొనసాగిస్తున్నామన్నారు.

2024 ఐదేండ్ల ప్రణాళికలోని ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందరికీ సమానంగా అందించడం. విజ్ఞాన వనరుల కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం. అన్నిగ్రామాలు, పట్టణా ల్లో విద్యారంగం అభివృద్ధికి చర్యలు. అన్నియూనివర్సిటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విద్యాసంస్థలను, విద్యార్థులను తీర్చిదిద్దేందుకు చర్యలు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఉన్నతవిద్యా కోర్సులను రూపొందించడం.
- సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్‌లో ప్రపంచస్థాయికి అనుగుణంగా పాఠాలు. ఉద్యోగాలను కల్పించే దిశగా విద్యార్థులకు శిక్షణ, ప్రోత్సాహం. ఒకేషనల్ విద్య బలోపేతానికి చర్యలు, ప్రత్యేక విధానాలు. ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లను అందించే నమ్మకమైన జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు . విద్యార్థులలో నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించే విధంగా ప్రత్యేక విధానాలు. వర్సిటీలలో అమలుచేస్తున్న చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్)ను పటిష్ఠపర్చడం.
- పరిశ్రమలకు అనుగుణమైన నూతన కార్యక్రమాలకు శ్రీకారం. పరిశోధనలు, సెమినార్లు, చర్చా వేదికల ఏర్పాటు. అధ్యాపకులకు ఉన్నత విద్యాబోధనలో బాధ్యతలు విశ్వసనీయత పెంపొందించడానికి చర్యలు. విద్యాసంస్థల అభివృద్ధికి అధ్యాపకులే ప్రత్యేక విధానాలను రూపొందించేందుకు ప్రోత్సాహం. ఉత్పాదకతతో ముడిపడిన పరిశోధనల్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రోత్సాహం.
- టీచర్ అవార్డులను పెంచే యోచన. నీతి ఆయోగ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నివేదికలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నత విద్యాభివృద్ధి కోసం రోడ్ మ్యాప్. తెలంగాణ అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు. జాతీయ విధానాలకు అనుగుణంగా ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు. పరిశోధనలను ప్రోత్సహించడంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలికి అధిక ప్రాధాన్యం. అన్నివిద్యాసంస్థలలో క్వాలిటీ అస్యూరెన్స్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు.

పెట్టుబడి అమలులో రైతుసమితుల భాగస్వామ్యం

■ సభ్యుల సాయంతో చెక్కుల పంపిణీకి చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని సమర్థంగా అమలుచేసేందుకు రైతు సమన్వయ సమితులను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 559 మండలాలకు, 10,773 గ్రామాలకు సంబంధించి సమితుల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. మొత్తం 1,60,995 మంది సభ్యులు ఉన్నారు. వీరిని వ్యవసాయ పెట్టుబడి పథకానికి సన్నద్ధం చేయాలని వ్యవసాయశాఖ భావిస్తున్నది. పంటకు పెట్టుబడిని చెక్కుల రూపంలో ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిన నేపథ్యంలో గ్రామాల్లో సమన్వయంతో పంపిణీ చేసేందుకు సమితి సభ్యుల సహకారం తీసుకోనున్నది. రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేసిన అనంతరం సభ్యులను క్రియాశీలం చేయకపోవడంతో వానకాలం ధాన్యానికి మద్దతు ధర ఇప్పించలేకపోయామనే అభిప్రాయం ప్రభుత్వంలో నెలకొన్నది. దీంతో పెట్టుబడి పథకంలో రైతు సమన్వయ సమితులు క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలని సీఎం కేసీఆర్ వ్యవసాయ అధికారులకు సూచించినట్టు సమాచారం. చెక్కుల పంపిణీకి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రైతులు క్రమపద్ధతిలో తీసుకొనేలా సమన్వయ సమితుల సభ్యులు చర్యలు తీసుకోనున్నారు. గ్రామంలోని రైతులంతా ఒకేసారి బ్యాంకుకు వెళితే నగదు కొరత ఏర్పడుతుందని ఈ క్రమంలో సభ్యులు ముందుగానే బ్యాంకు అధికారులను సంప్రదించి సమన్వయం చేయనున్నారు. తద్వారా ఏకకాలంలో కాకుండా రైతులను గ్రూపులుగా చేసి, డబ్బులు తీసుకొనేందుకు సమితుల సభ్యులు సహకరించేలా ప్రభుత్వం విధివిధానాలు రూపొందించనుంది.

క్యాన్సర్ నివారణకు స్వదేశీ మందు!

మొదటిపేజీ తరువాయి...

కుదుర్చుకున్న సంస్థ ద్వారా ఈ ఔషధాన్ని భారత మార్కెట్లోకి వచ్చే ఏడాది జనవరిలోగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తున్నది.

క్యాన్సర్ చికిత్సలో కీలకం ఎరిబ్యులిన్

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి చికిత్సలో ఎరిబ్యులిన్ అత్యంత ముఖ్యమైన, నమ్మకమైన ఔషధం. ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్‌మేడ్ డ్రగ్‌గా దీనిని చెప్తారు. బ్రెస్ట్ క్యాన్సర్, లిపోసార్కోమా నివారణలో దీన్ని ప్రధానంగా వినియోగిస్తున్నారు. జపాన్‌కు చెందిన ఎసాయి కంపెనీ దీన్ని ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచ మార్కెట్‌లో దీన్ని అత్యధిక ధరకు కొనుగోలుచేసి, మన దేశానికి దిగుమతి చేసుకుంటున్నాం. ఈ డ్రగ్ ఉత్పత్తికి సంబంధించిన టెక్నాలజీ మన దగ్గర లేకపోవడంతో ఏటా పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఎరిబ్యులిన్ డ్రగ్ ఇక్కడికి చేరేసరికి ధర చాలావరకు పెరుగుతున్నది. దీంతో క్యాన్సర్ చికిత్స ఖరీదైన వ్యవహారంగా మారుతున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎరిబ్యులిన్‌ను మన దేశంలో ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ఐఐసీటీ పరిశోధన ప్రారంభించింది. ఈ ఏడాది ఆగస్టు, లేదా వచ్చే ఏడాది జనవరిలో దీన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇండ్లను గుల్ల చేస్తున్న క్యాన్సర్ చికిత్స

క్యాన్సర్ ఉన్నట్లు తేలితే బాధితునితోపాటు ఆ కుటుంబం మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నది. క్యాన్సర్ చికిత్సను భరించడం సాధారణ, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారింది. దీనికి ప్రధాన కారణం ఎరిబ్యులిన్ డ్రగ్. రొమ్ము క్యాన్సర్‌కు గురైన పేషెంట్‌కు చికిత్సలో భాగంగా ఎరిబ్యులిన్ డ్రగ్ ఇవ్వాలంటే రూ.5లక్షల దాకా ఖర్చు అవుతున్నది. చికిత్సలో భాగంగా మొత్తం ఆరు సైకిళ్లలో దీన్ని రోగికి ఇంజక్షన్ రూపంలో ఇస్తారు. ఇది రాష్ట్రంలో ఎంఎన్‌జే వంటి దవాఖానల్లో పేదలకు ఉచితంగానే అందుతున్నది. ప్రైవేటు హాస్పిటళ్లలో లక్షల్లో ఫీజులు వసూలుచేస్తున్నారు. దీంతో చాలామంది ఖర్చుకు భయపడి చికిత్స చేసుకునేందుకు రావడం లేదు. ఒక ఎంజీ ఎరిబ్యులిన్ ఔషధం కొనుగోలు చేయాలంటే రూ.30,000 నుంచి రూ.40,000 దాకా ఖర్చు చేయాల్సి వస్తున్నది. మొత్తం ఆరు సైకిళ్లలో ప్రతిసారి రెండు ఎంజీల ఎరిబ్యులిన్‌ను రోగికి ఇస్తారు. ఇంత ఖర్చుతో ఇలాంటి డ్రగ్‌ను దిగుమతి చేసుకోవడం మనదేశానికి పెద్ద భారమే.

క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించడంలో విఫలం

క్యాన్సర్.. ముఖ్యంగా మహిళలకు శాపంగా పరిణమిస్తున్న మహమ్మారి. గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పేదరికం, అవగాహనలేనితనం, జాగ్రత్తలు తీసుకోకపోవడం, చికిత్స అందుబాటులో లేకపోవడం వంటి కారణాలు మృతుల సంఖ్యను పెంచుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా ఎనిమిది లక్షల మంది మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. 2030నాటికి ఏడాదికి 32 లక్షల మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడే అవకాశముందని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఇక మన దేశంలో రానురాను క్యాన్సర్ బాధితుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశంలో ఏటా దాదాపు ఏడు లక్షల మంది ప్రాణాలు వదులుతున్నారని, పది లక్షల కంటే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని మన దేశంలో సర్వే నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే అభివృద్ధి చెందిన దేశాల్లో వంద మందికి క్యాన్సర్ వస్తే అందులో 90శాతం మంది చికిత్స ద్వారా ప్రాణాలు కాపాడుకోగలుగుతున్నారు. మనదేశంలో వంద మందిలో 50%-60% మాత్రమే క్యాన్సర్‌ను తట్టుకొని నిలబడగలుతున్నారు. క్యాన్సర్ వచ్చిన వారిలో దాదాపు 40% వరకు ఎక్కువ రోజులు బతకలేకపోతున్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకుని, ప్రాథమిక దశలోనే దీన్ని గుర్తించడంలో భారతీయులు విఫలమవడమే దీనికి ప్రధాన కారణమని నివేదికలు పేర్కొన్నాయి. ఇతర దేశాల్లో 50ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరు విధిగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలనే నిబంధన ఉండగా, మన దేశంలో వ్యాధి ముదిరేదాకా బయటపడటం లేదు. ప్రాథమిక దశలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెప్తున్నా.. ఫలితం లేకుండా పోతున్నది.

అతి త్వరలో శాంపిల్ విడుదల



ఎరిబ్యులిన్.. ప్రపంచంలోనే లార్జెస్ట్ మ్యాన్ మేడ్ డ్రగ్. ఐఐసీటీ టెక్నాలజీతో ఇది మనకు అందుబాటులోకి రానున్నది. వచ్చే ఆగస్టు లేదా వచ్చే ఏడాది జనవరిలో శాంపిల్ విడుదలకు సిద్ధంగా ఉన్నాం. ఒప్పందంతో వాణిజ్యపరంగా దేశంలోనే ఉత్పత్తి అవుతుంది. గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ప్రపంచవ్యాప్తంగా నమ్మకమైన డ్రగ్ ఇది. అగ్గువకే అన్ని వర్గాలవారికి అందుబాటులోకి వస్తుంది.

- డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, ఐఐసీటీ డైరెక్టర్

క్యాన్సర్ చికిత్స అందరికీ చేరువవుతుంది



ఎరిబ్యులిన్ ఇక్కడే ఉత్పత్తి చేయడంవల్ల ఔషధం ధర చాలావరకు తగ్గే అవకాశం ఉంటుంది. చికిత్స అందరికీ అందుబాటులోకి వస్తుంది. ఎంఎన్‌జే దవాఖానలో మాత్రమే నేరుగా మెడికల్ డిస్ట్రిబ్యూటర్ వద్ద ఎమ్మార్పీ ధరకు కొనుగోలు చేసి, బాధితులకు అందిస్తున్నాం.

- చింతమడక సాయిరాం, ఆంకాలజిస్ట్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన

గ్రేటర్ ఓటర్లు 69 లక్షలు

ఓటర్ల ఇంటింటి సర్వే వివరాలు

సెప్టెంబర్-17లో నిర్వహించిన ఇంటింటి సర్వే సందర్భంగా తొలిగించిన బోగస్ ఓట్లు	2115857
ముసాయిదా జాబితా ప్రకారం గ్రేటర్ ఓటర్లు	6568491
తొలగించిన ఓటర్ల రీసర్వే(డిసెంబర్-17) ద్వారా పొరపాటుగా తొలిగించినట్టు గుర్తించిన ఓట్లు	361724
తొలిగించిన బోగస్ ఓట్లు వాస్తవమైనవేనని తేల్చినవి	1754133
జనవరి-18 ఓటర్ల తుది జాబితా ప్రకారం గ్రేటర్ ఓటర్లు	6928873

హైదరాబాద్ జిల్లా ఓటర్ల తుది జాబితా

నియోజకవర్గం	ఓటర్లు (9-9-2016)	ముసాయిదా (నవంబర్-17)	ఓటర్లు (20-1-18)
ముషీరాబాద్	275444	236742	259531
మలక్‌పేట్	275353	252290	266532
అంబర్‌పేట్	253158	210852	223230
ఖైరతాబాద్	265683	223603	242241
జూబ్లీహిల్స్	329912	281266	311065
సనత్‌నగర్	227084	190557	210118
నాంపల్లి	287693	255820	273079
కార్వాన్	288333	267995	286436
గోషామహల్	279665	212989	225444
చార్మినార్	200410	186683	193907
చాంద్రాయణగుట్ట	293680	272069	294132
యాకుత్‌పుర	305131	306192	320870
బహదూర్‌పుర	266332	242659	250453
సికింద్రాబాద్	239790	203792	219753
కంటోన్మెంట్	251970	221720	230028
మొత్తం	4039638	3565229	3806819

మొదటిపేజీ తరువాయి...

సందర్భంగా 21,15,857 బోగస్ ఓట్లు తొలిగించారు. రీసర్వే ద్వారా పొరపాటుగా తొలిగించినట్లు గుర్తించిన ఓట్లు 3,61,724 కాగా.. బోగస్ ఓట్లు వాస్తవమేనని తేల్చినవి 17,54,133. ట్యాబ్‌లకు జియోట్యాగింగ్‌తో సర్వే గత ఏడాది సెప్టెంబర్‌లో ముమ్మర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టారు. ఇందులో 1000 నుంచి 1200 మంది ఓటర్లతో పోలింగ్ కేంద్రాల సరిహద్దులను ఖరారుచేసి వాటి నజారీ నక్షా మ్యాప్‌లను రూపొందించారు. సిబ్బందికి ట్యాబ్‌లను సమకూర్చి సర్వే నిర్వహించారు. నిజంగా ఇంటింటికీ సర్వే నిర్వహించారా లేదా? అనేది తెలుసుకునేందుకు సిబ్బందికి సమకూర్చిన ట్యాబ్‌లను జియోట్యాగింగ్ చేశారు. ఈ విధంగా గత ఏడాది నవంబర్‌లో సర్వేను పూర్తిచేసి ముసాయిదాను విడుదలచేశారు. ముసాయిదా ప్రకారం గ్రేటర్‌లోని 23 నియోజకవర్గాల్లో 21 లక్షల బోగస్ ఓట్లను తొలిగించి 65,68,491ఓటర్లు ఉన్నట్టు తేల్చారు. ఓటర్ల తొలిగింపు నేపథ్యంలో సర్వేలో భారీగా అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 7,73,425 ఓట్లను బోగస్ ఓట్లుగా గుర్తించి తొలిగించడంపై రాజకీయ వర్గాల్లో దుమారం రేగింది. మొత్తం తొలిగించిన ఓట్లలో దాదాపు 85శాతం ఓటర్లు యథావిధిగా ఆయా చిరునామాల్లో ఉన్నారని వివిధ రాజకీయపార్టీలు పేర్కొన్నాయి.

హైదరాబాద్ జిల్లాలో 5.82 లక్షల బోగస్ ఓట్లు

రాజకీయపార్టీల ఫిర్యాదుతో తొలిగించిన ఓట్లను తిరిగి పరిశీలించాలని, డిసెంబర్ 30వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో అధికారులు తొలిగించిన ఓట్ల పరిశీలనకోసం మళ్లీ ఇంటింటి సర్వే నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఓటర్ల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో ఓటర్ల నమోదుతోపాటు సవరణలకు సంబంధించి మొత్తం 4,62,191 క్లెయిమ్స్ రాగా, అందులో 4,36,940 క్లెయిమ్స్‌ను ఆమోదించి, 25,251 క్లెయిమ్స్‌ను తిరస్కరించారు. అలాగే, కొత్తగా జాబితాలో చేరిన ఓటర్ల సహా తొలిగించిన 2,07,109 ఓటర్లు ఆయా చిరునామాల్లో ఉంటున్నట్లు గుర్తించి వారిపేర్లను తిరిగి జాబితాలో చేర్చారు. మిగిలిన 5,82,420 ఓట్ల తొలిగింపు సబబేనని గుర్తించారు. వీటిని జాబితానుంచి తొలగించారు.

3.61 లక్షల ఓటర్లకు తిరిగి జాబితాలో స్థానం

గత ఏడాది నవంబర్‌లో విడుదల చేసిన ఓటర్ల జాబితా ముసాయిదాలో 21.15 లక్షల బోగస్ ఓట్లను తొలగించి 65,68, 491 మంది ఓటర్లున్నట్టు తేల్చారు. కాగా, డిసెంబర్‌లో రీసర్వే నిర్వహించగా సుమారు 3.61లక్షల ఓటర్లు నిజంగానే ఉన్నట్టు గుర్తించి తుదిజాబితాలో వారికి స్థానం కల్పిస్తూ గ్రేటర్‌లో 69,28,873 మంది ఓటర్లున్నట్టు తేల్చారు. ముసాయిదా ప్రకారం హైదరాబాద్ జిల్లాలో 7,73,425 ఓట్లు తొలిగించగా, పునఃపరిశీలన సందర్భంగా 2,07,109 ఓటర్లు యథావిధిగా వారి చిరునామాల్లో ఉన్నట్టు గుర్తించి తిరిగి జాబితాలో చేర్చారు. కాగా, మిగిలిన 5,82,420 ఓటర్ల తొలిగింపు సరైనదేనని తేల్చారు. ఈ వివరాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదముద్ర వేసిన తరువాత 20న తుది జాబితాను విడుదల చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఇంకా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు, సూచనలు, తప్పొప్పులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని, నిరంతర ఓటర్ల నమోదు ప్రక్రియ, సవరణలో భాగంగా అన్నీ సరిచేస్తామని వారు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా

నియోజకవర్గం	ముసాయిదా నవంబర్-17)	ఓటర్లు (20-1-18)
ఎల్బీనగర్	396939	401137
మహేశ్వరం	316304	323660
రాజేంద్రనగర్	373758	380494
శేరిలింగంపల్లి	519853	534221
మొత్తం	1606854	1639512

మేడ్చల్ జిల్లా

మల్కాజిగిరి	331672	356664
కుత్బుల్లాపూర్	395960	423704
కూకట్‌పల్లి	300652	307198
ఉప్పల్	368124	394976
మొత్తం	1396408	1482542
గ్రేటర్ మొత్తం	6568491	6928873



హైదరాబాద్‌నుంచి కొండగట్టుకు బయలుదేరే ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు నుదుట తిలకం దిద్దుతున్న భార్య అన్నా లెజ్నేవా



సోమవారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్

కేసీఆర్ స్మార్ట్ సీఎం

మొదటిపేజీ తరువాయి...

పరిష్కరిస్తున్నారని, ఎన్నో సవాళ్లను చాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. అలాంటి సీఎంను కలిసి అభినందిస్తే తప్పేమిటి? అని ప్రశ్నించారు. తెలంగాణలోని ఏయే జిల్లాల్లో ఏయే సమస్యలున్నాయో అవగాహన వచ్చిన తర్వాతే ముందుకు సాగుతానని చెప్పారు. ఇక్కడి కార్యకర్తలు, అభిమానులతో కలిసి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత తెలంగాణలో రాజకీయంగా ముందుకు వెళ్తానన్నారు. దశాబ్దాల పోరాటం అనంతరం తెలంగాణ వచ్చిందని, ఇక్కడి సమస్యలపై బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్నారు. ఇప్పటికీ ఏపీకి చెందిన ఉపాధ్యాయులు వరంగల్‌లో ఉన్నారని, వారిని స్వరాష్ట్రానికి పంపాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఇకనుంచి సినిమాలకు గుడ్‌బై చెప్పి, పూర్తిస్థాయి రాజకీయాల్లోనే కొనసాగుతానని స్పష్టంచేశారు. మంగళ, బుధవారాల్లో జనసేన వేదికల ద్వారా కార్యకర్తలతో సమావేశమై.. వారి నుంచి ఆలోచనలు, సలహాలు, సూచనలు తీసుకొని సమస్యలపై అవగాహన పెంచుకుంటామని చెప్పారు. ఈ నెల 27నుంచి ఏపీలోని అనంతపురంలో కరువు సమస్యలపై పర్యటన చేపడుతానని, అక్కడి నుంచే జనసేన కార్యాలయాలను ప్రారంభిస్తామని తెలిపారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల విరాళం

సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు కొండగట్టుకు చేరుకున్న పవన్‌కల్యాణ్ అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధి కోసం రూ.11 లక్షల విరాళం ప్రకటించారు. మంగళవారం విరాళం మొత్తాన్ని అందజేస్తానని తెలిపారు. ఆంజనేయస్వామి తమ ఇలవేల్పు అని, 2009లో అంజన్న దయవల్లే తాను ప్రాణాపాయం నుంచి బయటపడ్డానని పేర్కొన్నారు.

జాతీయ జెండాకు అవమానం

పవన్‌కల్యాణ్ కొండగట్టు అంజన్న దర్శనం కోసం వచ్చిన సందర్భంలో జాతీయ జెండాకు అవమానం కలిగేలా అభిమానులు, బౌన్సర్లు ప్రవర్తించడం, ఒకదశలో పవన్‌కల్యాణ్ సైతం జాతీయ జెండాను చేతితో మడిచి బౌన్సర్లకు అందజేయడం వివాదాస్పదమైంది. ఆయన ఆలయంలోకి పూజలు చేసేందుకు వెళ్లగానే.. కొందరు అభిమానులు, కార్యకర్తలు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ, అరుపులు ప్రారంభించారు. ఇష్టారాజ్యంగా జాతీయ జెండాలను ఊపడంతో అవి చిరిగిపోయాయి. పవన్ ఆలయం బయటకొచ్చి తన వాహనంపైకి చేరుకొని అభివాదం ప్రారంభించగానే.. అభిమానులు, కార్యకర్తలు జాతీయ జెండాలను ఊపడంతోపాటు వాటిని ఆయనపైకి విసిరివేశారు. అభిమానులు విసిరేసిన జాతీయ జెండాను పవన్ పట్టుకుని మడిచి, తన బౌన్సర్లకు అందజేయగా వారు జెండాను ఇష్టారాజ్యంగా నలిమి కారుపై రుద్దారు. అభిమానులు, కార్యకర్తలు, ఆలయానికి వచ్చిన భక్తులకు తీవ్రంగా ఇబ్బంది కలిగించడంతో కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు.



సోమవారం రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథితో సమావేశమైన ఈజిప్టు అధికారుల బృందం

తెలంగాణ విత్తనాలు బాగున్నాయి

- ప్రశంసించిన ఈజిప్టు వ్యవసాయ మంత్రిత్వశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ నుంచి దిగుమతి చేసుకున్న జొన్న, గడ్డిజొన్న విత్తనాలు బాగున్నాయి.. రానున్న కాలంలో పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటామని ఈజిప్టు అధికారుల బృందం తెలిపింది. ఈజిప్టు వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన కేంద్ర విత్తన ధ్రువీకరణ పరిపాలన అధిపతి, ఈజిప్టు ఎగుమతి, దిగుమతుల బాధ్యుల నేతృత్వంలోని అధికారుల బృందం భారతదేశంలో విత్తన ధ్రువీకరణ క్రమాన్ని అధ్యయనం చేయడానికి ఐదురోజుల పర్యటన కోసం హైదరాబాద్ చేరుకున్నది. సోమవారం ఈ బృందం రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథితో సమావేశమైంది. గత ఏడాది తమ దేశానికి 550 టన్నుల అంతర్జాతీయ ధ్రువీకరణ విత్తనాలను ఎగుమతి చేసినందుకు ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఈజిప్టు బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈజిప్టులో కొన్ని కంపెనీలు పేరెన్నికగన్న విత్తనాలను ఎగుమతి చేస్తుండేవని, అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణతో ఈ సమస్యను అధిగమించినట్టు అధికారులు తెలిపారు. తెలంగాణలోని వ్యవసాయ పద్ధతులు, నాణ్యమైన విత్తనోత్పత్తి క్రమాలను అధ్యయనం చేయటానికి వచ్చినట్టు పేర్కొన్నారు. దేశీయ విత్తన ధ్రువీకరణ, సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ చేస్తున్న కార్యకలాపాలను పార్థసారధి వారికి వివరించారు. సమావేశంలో విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు, డాక్టర్ మార్గాహస్సన్, ఈజిప్టు అంతర్గత నాణ్యతా పరిపాలన బాధ్యులు మహమ్మద్ అలీ, మహమ్మద్ ఇబ్రహీం, ఈజిప్టులో హైటెక్ సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ ఇబ్రహీం మహమ్మద్ ఇబ్రహీం అల్దెలియోమ్, పేరెంట్ సీడ్ మేనేజర్ మొయినుద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్, విత్తన ధ్రువీకరణ సంస్థ సీనియర్ అధికారులు జీ సుదర్శన్, భాస్కర్‌సింగ్, నర్సింగదాస్ పాల్గొన్నారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి

- 1,290కోట్లతో రహదారుల నిర్మాణం
- ఎక్స్‌ప్రెస్ హైవేలు, కలెక్టరేట్ల నిర్మాణాలపై మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.1290 కోట్ల నిధులతో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి, కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో గోదావరిపై మూడు వంతెనలు, రెండు వరుసల రహదారి నిర్మాణానికి సంబంధించి నిబంధనలను సడలించి అనుమతులు ఇచ్చేలా కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించామని వివరించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని అటవీప్రాంతాల్లో రూ. 500.32 కోట్లతో 451.57 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరుగుతున్నదని తెలిపారు. ఎన్‌హెచ్‌డీపీ పథకం కింద 2017-18సంవత్సరానికి రూ.2,398.31 కోట్లతో రోడ్ల అభివృద్ధి ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. రూ.290 కోట్లతో ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు 6 లేన్లు, నర్సాపూర్-మెదక్ నాలుగులేన్ల రోడ్డుకు ఆమోదం లభించినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. నూతనంగా నిర్మించే 26 కలెక్టరేట్లకు టెండర్లు పిలిచామని, వీటిలో 21 జిల్లాల్లో అధికార నివాసగృహాల నిర్మాణం కూడా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, సీఈలు లింగయ్య, సతీశ్, అధికారులు పాల్గొన్నారు.



సోమవారం ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో రవీందర్‌రావు, గణపతిరెడ్డి, లింగయ్య, సతీశ్ కూడా ఉన్నారు.

న్యాక్ డైరీ ఆవిష్కరణ

న్యాక్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శిక్షణ విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మంచి డిమాండ్ ఉందని, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. హైదరాబాద్‌లో న్యాక్-2018 డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బచావత్ అమలుపైనా ఏపీ కొర్రీ

- తాగునీటిలో 20 శాతం లెక్కింపును వ్యతిరేకిస్తున్న ఏపీ అధికారులు
- కేడబ్ల్యూడీటీ-2 తేలుస్తుందంటూ కమిటీ భేటీలో వాదన
- 25లోగా నివేదిక ఇవ్వాలని కృష్ణాబోర్డు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఒక అంశంలో బచావత్ ట్రిబ్యునల్ అమలుకు పట్టుబడతారు.. మరో అంశంలో బ్రిజేశ్‌ట్రిబ్యునల్ తేలుస్తుందంటూ దాటవేస్తారు.. ఇదీ కృష్ణాజలాల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ తీరు. బచావత్ ట్రిబ్యునల్‌లోని ఏడోక్లాజు ప్రకారం తాగునీటిని పంపిణీచేయాలని తెలంగాణ కోరుతుంటే.. బ్రిజేశ్‌ట్రిబ్యునల్ దానిని తేలుస్తుందంటూ ఏపీ కొత్త మెలిక పెడుతున్నది. ఈ విషయంపై తేల్చేందుకు కృష్ణాబోర్డు నియమించిన కమిటీ ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఏపీ తరపు ఇంజినీర్లు బచావత్ ట్రిబ్యునల్ అమలును వ్యతిరేకించడం గమనార్హం. అయినప్పటికీ ఈ నెల 25 లోగా నివేదిక ఇవ్వాలని బోర్డు ఆదేశాలు జారీచేసిన దరిమిలా బోర్డు తుదినిర్ణయంపై ఆసక్తి నెలకొం ది. కృష్ణాజలాల వినియోగంలో భాగంగా తాగునీటి కోసం తీసుకొన్న నీటిలో కేవలం 20 శాతం మాత్రమే వాస్తవంగా వినియోగమవుతుంది. మిగిలిన 80శాతం రీజనరేటెడ్ వాటర్‌గా అదే బేసిన్‌లోకి వస్తుంది. అందుకే తాగునీటి సరఫరాకు వినియోగించిన నీటిలో 20 శాతాన్ని మాత్రమే వినియోగ లెక్కలుగా పరిగణించాలని బచావత్ ట్రిబ్యునల్ తుదితీర్పులో ఏడోక్లాజు కింద స్పష్టంచేసింది. అయితే, కృష్ణాజలాల పంపిణీలో భాగంగా తెలంగాణ.. హైదరాబాద్, నల్లగొండ తాగునీటి అవసరాలతోపాటు మిషన్ భగీరథ కింద పెద్దఎత్తున నీటిని తీసుకుంటుంది. అందులో 20 శాతాన్ని తెలంగాణ వినియోగం కింద లెక్కించాల్సి ఉంటుంది. ఇదేవిషయాన్ని తెలంగాణ నీటిపారుదలశాఖ పలుమార్లు లేవనెత్తడంతో కృష్ణాబోర్డు ఆ అంశంపై కమిటీని నియమించింది. ఇందులో రెండు రాష్ట్రాల అధికారులున్నారు. రెండోదఫా సమావేశంలో భాగంగా ఇటీవల కమిటీ భేటీ అయింది. తొలుత రీజనరేటెడ్ వాటర్.. మూసీ ద్వారా రావడంలేదని ఏపీ అధికారులు వాదించారు. రీజనరేటెడ్ వాటర్‌ను చూపించాలనే నిబంధన ట్రిబ్యునల్‌లో ఎక్కడా లేదని తెలంగాణ అధికారులు స్పష్టంచేశారు. వితండవాదానికి దిగిన ఏపీ అధికారులు ఈ అంశాన్ని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) తేలుస్తుందని వాదించారు. బచావత్‌లోని ఏడోక్లాజును బ్రిజేశ్‌ట్రిబ్యునల్ పునః సమీక్షిస్తుందని ఏపీ అధికారులు భావించడంపై సాగునీటిరంగ నిపుణులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇదేకమిటీ సమావేశంలో.. 2017-18లో శ్రీశైలంఅవుట్‌ఫ్లో-నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో మధ్య వ్యత్యాసంపై కూడా చర్చ జరిగింది. గతంలోనూ తేడాలున్నాయనేది ఏపీ అధికారుల వాదన. తెలంగాణ అధికారులు గత వివరాలను చూపి.. గతం కంటే చాలా ఎక్కువున్నదని వాదించారు. దాదాపు 44 టీఎంసీలు తేడా వస్తున్నందున ఏపీ వినియోగఖాతాలో 29 టీఎంసీలు కలుపాల్సిందేనని స్పష్టంచేశారు. కాగా, రెండు అంశాలపై రెండుదఫాలుగా కమిటీ నిర్వహించిన సమావేశ వివరాలను క్రోడీకరించి ఈ నెల 25లోగా నివేదిక ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.

పాత విధానంలోనే టీచర్లకు సెలవులు..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పాత విధానం ప్రకారమే సెలవులను మంజూరు చేయడానికి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య హామీఇచ్చారని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పీ సరోత్తంరెడ్డి, ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి తెలిపారు. సెలవుల మంజూరుపై టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్న ఉత్తర్వులు రద్దుచేసి, విద్యాక్యాలెండర్‌లో పొందుపరిచిన విధంగా మంజూరు చేయాలని కోరుతూ విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు వారు తెలిపారు.

కులవృత్తులకు ఆధునిక శిక్షణ

- నాయీబ్రాహ్మణులకు 15 రోజుల ట్రైనింగ్
- బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ కులవృత్తులు, ఇతర రంగాలలో కొనసాగదలచిన నిరుద్యోగులకు ప్రభుత్వపరంగా వృత్తిశిక్షణ ఇస్తున్నామని బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సోమవారం సంక్షేమభవన్ ప్రాంగణంలో నాయీబ్రాహ్మణ యువతీ, యువకులకు ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బుర్రా వెంకటేశం, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ అనితారాజేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ, ఆర్థిక కార్యక్రమాలను నిరుద్యోగ నాయీబ్రాహ్మణ యువత సద్వినియోగం చేసుకోవాలని.. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. నాయీబ్రాహ్మణ వృత్తి నైపుణ్య అభివృద్ధి శిక్షణకు 31 జిల్లాల నుంచి 650 మంది యువతీ యువకులను ఎంపికచేసినట్టు తెలిపారు. మొదటిదశలో 160 మంది యువతీ, యువకులకు అధునాతన హెయిర్‌స్టైల్, బ్యూటీషియన్ కోర్సుల్లో 15 రోజుల ఆధునిక శిక్షణ ఇస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంబీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు సైదా, చంద్రశేఖర్, అలోక్‌కుమార్, మల్లయ్య భట్టు తదితరులు పాల్గొన్నారు.




నాయీ బ్రాహ్మణులకు వృత్తినైపుణ్య శిక్షణను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న బుర్రా వెంకటేశం

'సంరక్షణ క్షమత మహోత్సవ్'లో ఆర్టీసీ డ్రైవర్ల ప్రతిభ

- ఉపన్యాస పోటీల్లో ముగ్గురికి బహుమతులు
- అమీనుద్దీన్‌కు ఉత్తమ డ్రైవర్ అవార్డు
- రేపు అవార్డుల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) డ్రైవర్లకు 'సంరక్షణ క్షమత మహోత్సవ్' పేరుతో హకీంపేటలోని ఆర్టీసీ స్టాఫ్ జోనల్ ట్రైనింగ్ కాలేజీలో ఉపన్యాస పోటీలను నిర్వహించింది. కమిటీ సభ్యులు ముగ్గురు డ్రైవర్లను విజేతలుగా ప్రకటించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఎస్ ఎస్ పాషా (ఇ201139) ప్రథమ స్థానంలో నిలిచారు. మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్‌శ్రీను (ఇ176355) ద్వితీయ, కొల్లాపూర్ డిపోకు చెందిన జీ వెంకటయ్య (ఇ151265) తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. ఇటు ఆర్టీసీ బస్సు నడిపిస్తూ ఏ చిన్న ప్రమాదం కూడా చేయకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేరవేస్తున్న డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ నగదు పురస్కారాలు, అవార్డులు అందజేసి బుధవారం సన్మానించనున్నది. రాష్ట్ర, జోనల్ స్థాయిలో ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైన వారికి మంత్రి పీ మహేందర్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ అవార్డులు అందజేయనున్నారు. ప్రమాదరహిత డ్రైవింగ్‌లో రాష్ట్రస్థాయి క్యాటగిరీలో కరీంనగర్-2 డిపోకు చెంది న ఎండీ అమీనుద్దీన్ ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికయ్యారు. ఇదే డిపోకు చెందిన ఏ కృష్ణ 31 ఏండ్ల ఒక నెల సర్వీసులో ద్వితీయ, మహబూబ్‌నగర్ డిపోకు చెందిన బీ కేసయ్య 30 ఏండ్ల సర్వీసుతో తృతీయ అవార్డులకు ఎంపికయ్యా రు. జోనల్‌స్థాయి క్యాటగిరీలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ కు చెందిన డ్రైవర్లు బీ రాములు, జేటీ రెడ్డి, ఎస్ విఠల్ నిలిచారు.



ఉపన్యాసపోటీల్లో విజేతలకు బహుమతులు ఇస్తున్న సంగారెడ్డి, హైదరాబాద్ రూరల్ డీవీఎంలు రాజశేఖర్, శ్రీదేవి

దివ్యాంగులకు ఉపాధిపై దృష్టి

- నేడు ఎంసీహెచ్‌ఆర్డీలో వర్క్‌షాప్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అమలుపై రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ దృష్టి సారించింది. దివ్యాంగుల ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు మంగళవారం డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్టు ది వ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బీ శైలజ పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో జిల్లా సంక్షేమశాఖ అధికారులు, దివ్యాంగుల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొననున్నారు.

బ్రహ్మణి ఇండస్ట్రీస్‌లో డీఆర్‌ఐ సోదాలు

- గాలి జనార్దన్‌రెడ్డితోపాటు మరికొందరిపై కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీలోని కడప జిల్లా జమ్మలమడుగులో ఉన్న బ్రహ్మణి పరిశ్రమలో డీఆర్‌ఐ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండా చెన్నైపోర్టు నుంచి దిగుమతి చేసిన రూ.189 కోట్ల విలువైన యంత్రాలను సీజ్ చేశారు. ఈ పరిశ్రమ పెట్టుబడిదారు, ఓబులాపురం మైనింగ్ కంపెనీ యజమాని గాలి జనార్దన్‌రెడ్డితోపాటు మరికొందరిపై కూడా డీఆర్‌ఐ అధికారులు కేసులు నమోదు చేశారు. బ్రహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్ కోసం పదేండ్ల కిందట విదేశాల నుంచి యంత్రాలు తీసుకొచ్చి నిబంధనల ప్రకారం ఏర్పాటుచేయడంలో విఫలమయ్యారని పేర్కొంటూ, కస్టమ్స్ డ్యూటీ చెల్లించాలని 2008 మే తొమ్మిదిన పరిశ్రమ చైర్మన్‌కు నోటీసులు జారీ అయ్యాయి. వాటిపై పరిశ్రమ చైర్మన్ స్పందించపోవడంతో డీఆర్‌ఐ అధికారులు తాజాగా సోదాలు చేపట్టారు.

ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీకి మద్దతు

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచలన ప్రకటన



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీకి ప్రత్యేకహోదా ప్రకటిస్తే.. బీజేపీకి బేషరతుగా మద్దతిస్తామని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సంచలన ప్రకటనచేశారు. ప్రత్యేకహోదా లేకపోవడంవల్ల రాష్ట్రానికొచ్చే రాయితీలు రాకుండాపోతున్నాయని అన్నారు.ఆదివారం సీఎన్ఎన్, న్యూస్-18 చానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో 'ప్రత్యేక హోదా ఇచ్చే అధికారం ప్రధానికి ఉంది. ప్రత్యేక హోదాతో ఏపీ అభివృద్ధి సాధ్యం. ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీలో కలిసి నడుస్తామ'ని స్పష్టంచేశారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నంతకాలం తనపై ఎలాంటి కేసులు లేవని, కాంగ్రెస్ నుంచి వెళ్లిపోగానే కేసులుపెట్టారని జగన్ చెప్పారు. నల్లధనం ఇస్తూ ఆడియో టేపుల్లో అడ్డంగా దొరికిన చంద్రబాబుపై ఎలాంటి కేసులులేవని పేర్కొన్నారు.

పెండింగ్, ఆడిట్‌లపై నివేదిక ఇవ్వండి



సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో పీఏసీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జే గీతారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలకు సంబంధించిన పెండింగ్ ఆడిట్ పేరాలపై రాష్ట్ర శాసనసభ ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) చర్చించింది. వీటిపై ఉన్న పలు అభ్యంతరాలకు సంబంధించి తగిన ఆధారాలతో నివేదిక అందజేస్తే, ఆ అభ్యంతరాలను తొలిగిస్తామని పీఏసీ సంబంధిత శాఖల అధికారులకు స్పష్టం చేసింది. డాక్టర్ జే గీతారెడ్డి అధ్యక్షతన పీఏసీ కమిటీ సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైంది. కమిటీ సభ్యులు టీ జీవన్‌రెడ్డి, రాములు నాయక్, హన్మంతు షిండే, గువ్వల బాలరాజు, వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారధి, కమిషనర్ జగన్మోహన్, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సాయిప్రతాప్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంతం నరసింహాచార్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం మూడు పెండింగ్ ఆడిట్ పేరాలపై కమిటీ చర్చించింది. ఫిబ్రవరి తొలివారంలో కమిటీ సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నది.

31న విచారణకు హాజరు కావడం లేదు

- బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు ఏపీ సాక్షి సుబ్బారావు లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రిజేశ్ ట్రిబ్యునల్ ఎదుట ఈ నెల 31న జరిగే విచారణకు తాను హాజరు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ తరపు సాక్షి కేవీ సుబ్బారావు ట్రిబ్యునల్ రిజిస్ట్రార్‌కు సోమవారం లేఖ రాశారు. తన సతీమణి అనారోగ్యంతో బాధపడుతూ దవాఖాన ఐసీయూలో ఉన్నారని, అందువల్ల విచారణకు హాజరుకాలేక పోతున్నట్టు పేర్కొన్నారు. ఆ రోజు సుబ్బారావును తెలంగాణ న్యాయవాది క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సి ఉన్నది. కాగా వచ్చేనెల అంటే ఫిబ్రవరి 22న తాను విచారణకు హాజరవుతానని లేఖలో వివరించారు.

రైల్వే భద్రతకు నూతన టెక్నాలజీ

- రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ అఖిల్ అగర్వాల్



ఇరిసెట్‌లో శిక్షణ పొందినవారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న అఖిల్ అగర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వే భద్రతకు నూతన టెక్నాలజీని వినియోగించేందుకు భారత రైల్వే ముందుందని రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ (సిగ్నలింగ్ అండ్ టెలికమ్యూనికేషన్) అఖిల్ అగర్వాల్ పేర్కొన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ (ఇరిసెట్)లో 2015 బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న 17మందిలో నలుగురు మహిళాఅధికారులు ఉండటం గర్వకారణమన్నారు. అనంతరం శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు అదనపు సభ్యుడు ఎన్ కాశీనాథ్ ఇరిసెట్ డైరెక్టర్ ఎల్వీ సిన్హా, డీన్ కళావతి పాల్గొన్నారు.

కోడిపందేలపై హైకోర్టు ఆగ్రహం

- స్వయంగా హాజరుకావాలని ఏపీ సీఎస్, డీజీపీకి ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కోడిపందేలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్న ఆదేశాలు పట్టించుకోవడంపై ఏపీ అధికార యంత్రాంగంపై ఉమ్మడి హైకోర్టు మండిపడింది. పందేల నిర్వహణను అడ్డుకునేందుకు చేపట్టిన చర్యలను వివరించాలన్న ఆదేశాల ప్రకారం సోమవారం నివేదికలు సమర్పించకపోవడాన్ని తప్పుపట్టింది. అరుదుగా టీవీ చూసే తమకే కోడిపందేల నిర్వహణ దృశ్యాలు కనిపించాయని ధర్మాసనం పేర్కొంది. ఈ నెల 29న ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్, డీజీపీ ఎం మాలకొండయ్య స్వయంగా తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం గంగారావులతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది.

కాలేజీల్లో ఆత్మహత్యలపై హైకోర్టులో పిల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ అందిన లేఖను ఉమ్మడి హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. కళాశాలల్లో ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. ఈ విషయంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదంటూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా లోక్‌సత్తా పార్టీ నేత లేఖ రాశారు.

ఒక వర్గానికి మద్దతు ఇచ్చారు

- లంబాడాలు, ఆదివాసీల పోరులో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు పాత్రపై హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లంబాడాలు, ఆదివాసీలకు మధ్య ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెలరేగిన ఘర్షణల్లో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఒక వర్గానికి మద్దతు ఇచ్చినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని హైకోర్టు తెలిపింది. ఎస్టీ కోటా నుంచి లంబాడాలను తొలిగించాలన్న డిమాండ్‌పై ఆదివాసీలు నెల క్రితం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయనపై పోలీసులు 25 కేసులు నమోదుచేశారు. వీటిపై ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ప్రేమ్‌సాగర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై జస్టిస్ రజనీ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.ఈ కేసుల్లో దర్యాప్తు అధికారి నమోదు చేసిన వాంగ్మూలాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ప్రతాపరెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఆదివాసీలకు ప్రేమ్‌సాగర్ ఆర్థికసహాయం అందించినట్టు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని వివరించారు. ఆయన కాల్‌డాటా వివరాలు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయని తెలిపారు. వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం.. ఇరువర్గాల గొడవలో ఆయన పాత్ర స్పష్టంగా కనిపిస్తుందని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది.

సెన్సెక్స్	నిఫ్టీ
35,798	10,966
↗ 286	↗ 71

ముడి చమురు (బ్రెంట్) ↗ 69.28 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,190
22 క్యారెట్లు	30,040
వెండి (కిలో)	38,885

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.15	67.43
బహ్రెయిన్ దినార్	157.51	180.50
కువైట్ దినార్	175.87	218.94
సౌదీ రియాల్	15.46	18.33
యూఏఈ దిర్హామ్	15.83	18.50

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	99.00
డ్రెస్డ్	144.00
స్కిన్‌లెస్	163.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	402-00
రంగారెడ్డి	402-00
మెదక్	402-00
కరీంనగర్	404-00
వరంగల్	404-00
రిటైల్ ప్రైస్	4-60

గ్రామీణ ఆదాయాన్ని పెంచండి

ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలి.. జైట్లీకి ఎఫ్‌ఎంసీజీ సంస్థల సూచన



న్యూఢిల్లీ, జనవరి 22: రాబోయే బడ్జెట్‌లో వినియోగదారుల కొనుగోళ్ల శక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) సంస్థలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణుల ఆదాయాన్ని పెంచాలని, అప్పుడే గ్రామీణ మార్కెట్ బలపడగలదన్న ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు.. మరింతగా ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలని కోరాయి. అలాగే వ్యక్తిగత పన్ను శ్లాబులను తగ్గించాలన్నాయి. గోదాముల ఏర్పాటుకు వీలుగా ప్రోత్సాహకాలను ప్రకటించాలని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరిగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశాయి. గ్రామీణుల ఆదాయ వనరులు అంతంతమాత్రంగానే ఉన్నాయని, సరిపడా ఉపాధి అవకాశాలు ఉండటం లేదని గోద్రేజ్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ ఎండీ, సీఈవో వివేక్ గంభీర్ అన్నారు. వ్యవసాయోత్పత్తిని మెరుగుపరుచడం, రాయితీలు పక్కదారి పట్టకుండా చూడటం వంటి వాటితో రైతుల చేతుల్లోకి మరింత నగదు రాగలదన్నారు. ఇది వారి కొనుగోళ్ల శక్తిని పెంచగలదని, తద్వారా ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతాయని, దీంతో పన్నుల రూపేణా ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల బలోపేతానికీ బడ్జెట్ దోహదపడాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే నూతన ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను వచ్చే నెల 1న పార్లమెంట్‌లో జైట్లీ బడ్జెట్ ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే.

పెరుగనున్న ఐటీ మినహాయింపు పరిమితి

ఈసారి బడ్జెట్ అంచనాల్లో అధికంగా వినిపిస్తున్నది ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుందన్నదే. ప్రస్తుతం రూ.2.50 లక్షల వరకు ఉన్న ఐటీ మినహాయింపు పరిమితి రూ.3 లక్షలకు పెరుగవచ్చని ఎస్బీఐ నివేదిక కూడా చెబుతున్నది. దీనివల్ల దాదాపు 75 లక్షల మందికి ప్రయోజనం చేకూరగలదని సోమవారం తెలిపింది. అలాగే గృహ రుణం కింద చేసే వడ్డీ చెల్లింపులకున్న పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచితే కూడా సుమారు 75 లక్షల మంది గృహ రుణ వినియోగదారులకు లాభం చేకూరుతుందని వెల్లడించింది. 1990-91లో రూ.22,000లుగా ఉన్న ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని 2014-15కల్లా రూ.2.5 లక్షలకు కేంద్ర ప్రభుత్వాలు పెంచాయి.



అధిక పన్నులు వేయవద్దు

లగ్జరీ వాహనాలన్న కారణంతో భారీ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్ (ఎస్‌యూవీ), ఇతరత్రా కార్లపై అధిక పన్నులు వేయడం తగదని జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) ఇండియా అధ్యక్షుడు, ఎండీ రోహిత్ సూరీ అన్నారు. ఉద్యోగ కల్పనకు, మార్కెట్ విస్తరణకు వీలుగా పన్నులు ఆమోదయోగ్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సెస్సు పెంపుతో ఎస్‌యూవీలపై జీఎస్టీ 43 శాతం నుంచి 50 శాతానికి చేరిందన్న ఆయన ఇది అమ్మకాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నదన్నారు. కాబట్టి బడ్జెట్‌లో పన్ను తగ్గింపు నిర్ణయం ఉండాలని కోరారు.

దిగిరానున్న స్మార్ట్‌ఫోన్ ధరలు?

కొత్త బడ్జెట్‌పై కోటి ఆశలున్న నేపథ్యంలో ఏ వర్గానికి ఆ వర్గం ఈసారి తమకేదో లాభిస్తుందన్న భావనలో ఉన్నాయి. ఈసారి బడ్జెట్ జనాకర్షక బడ్జెట్ కాదని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే చెబుతున్నప్పటికీ.. వచ్చే ఏడాది ఎన్నికలున్న క్రమంలో రాబోయే బడ్జెటే చివరి పూర్తికాల పద్దు కావడంతో పలు ఆకర్షణీయ ప్రకటనలు తప్పక ఉంటాయన్న అంచనాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే యువతను ఆకట్టుకునేలా స్మార్ట్‌ఫోన్ ధరలు దిగివచ్చే నిర్ణయాలుండొచ్చని సమాచారం. మొబైల్ పరిశ్రమ వృద్ధికి దోహదపడేలా మోదీ సర్కారు అడుగులు వేస్తుందన్న విశ్వాసాన్ని ఇండస్ట్రీ వర్గాలూ వ్యక్తం చేస్తున్నాయి. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 12 శాతం నుంచి 5 శాతానికి తెస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని కోమియో స్మార్ట్‌ఫోన్స్ సీఈవో సంజయ్ కలిరోనా వెలిబుచ్చారు. దీనివల్ల స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గుతాయన్నారు.

జాతీయ ప్రాధాన్యత హోదా దక్కాలి

ఆరోగ్య రంగానికి జాతీయ ప్రాధాన్యత హోదా ఇవ్వాలని అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీతా రెడ్డి డిమాండ్ చేశారు. దేశంలో హెల్త్‌కేర్ సేవల పురోగతికిగాను యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ వంటి వాటిని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన ఆరోగ్య సేవల విషయంలో రాజీ పడకూడదని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సునీతా రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఆరోగ్య బీమా, వైద్య ఖర్చులు మరింత భారం కాకుండా పన్ను మినహాయింపులివ్వాలని, హెల్త్‌కేర్ సర్వీసులు, జీఎస్టీ కింద హెల్త్‌కేర్ బీమా ప్రీమియంలకు పన్ను రాయితీలుండాలన్నారు.

అదనంగా రూ.3 వేల కోట్లివ్వండి

ప్రయాణీకుల భద్రతలో భాగంగా రాబోయే బడ్జెట్‌లో దాదాపు రూ.3,000 కోట్లు కేటాయించాలని రైల్వే శాఖ కోరుతున్నది. ఈ నిధులతో దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 8,500 స్టేషన్లు, 11,000 ప్రీమియర్, సబర్బన్ రైళ్లలో సుమారు 12 లక్షల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని రైల్వే మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం దాదాపు 395 స్టేషన్లు, 50 రైళ్లలోనే సీసీటీవీ కెమెరాలున్నట్లు చెప్పారు. సీసీటీవీ కెమెరాలతో ప్రమాదాలను అరికట్టగలుగుతామన్నారు.

బడ్జెట్ కసరత్తులో జైట్లీ సైన్యం ఇదే..

ఒకవైపు పాత పెద్ద నోట్ల రద్దు ప్రభావం.. ఇంకోవైపు జీఎస్టీతో మందగించిన జీడీపీ.. మరోవైపు ముంచుకొస్తున్న ఎన్నికలు.. ఇన్నింటి మధ్య వచ్చే బడ్జెట్‌పై అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో? ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నరేంద్ర మోదీ ఐదేండ్ల పాలనకు గీటురాయి.. మరో ఐదేండ్ల పాలనకు పునాదిరాయి కూడా ఈ బడ్జెటే అవుతుందన్నా.. ఆశ్చర్యం ఎంతమాత్రం లేదు. అలాంటి ఈ చివరి పూర్తికాల బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి జైట్లీ సిద్ధం చేసేశారు. ఈ ప్రక్రియకు ఎందరో ఆర్థిక నిపుణులు సహకరించగా, మరెందరో ఆర్థిక మంత్రిత్వ శాఖ సిబ్బంది ఇంకా శ్రమిస్తున్నారు. అయినప్పటికీ ఈ పద్దుకు సూత్రధారులు మాత్రం ఆరుగురే. బడ్జెట్ కూర్పులో జైట్లీకి బాసటగా నిలిచిన ఆ ఆరుగురు వీరే..

హస్ముఖ్ అధియా



కేంద్ర ఆర్థిక శాఖలో అధియాకు అత్యంత అనుభవం ఉన్నది. ఆర్థిక కార్యదర్శిగానేగాక, రెవిన్యూ శాఖ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధియా.. వచ్చే బడ్జెట్‌లో కీలక పాత్రే పోషించారు. 1981 గుజరాత్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఈయన జీఎస్టీ సూత్రధారుల్లో కూడా ఒకరు.

అరవింద్ సుబ్రమణ్యన్



ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఉన్న అరవింద్ సుబ్రమణ్యన్.. ఈసారి బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే రూపకల్పనకు నేతృత్వం వహించారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న జటిల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడంలో నిమగ్నమైన ఈయన ఆర్థిక లక్ష్యాల సాధనకు పదునైన ఆలోచనలతో ముందుకెళ్తున్నారు.

సుభాష్‌చంద్ర గార్గ్



వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన గార్గ్.. ఇప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా ఉన్నారు. 1983 రాజస్థాన్ కేడర్‌కు చెందిన ఈ ఐఏఎస్ అధికారి.. వృద్ధిరేటు పురోగతికి, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉద్యోగ కల్పనకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

అజయ్ నారాయణ్ ఝా



కేంద్ర ఆర్థిక వ్యయ విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్న అజయ్ నారాయణ్ ఝా.. 1982 మణిపూర్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ద్రవ్యలోటు లక్ష్యాల కట్టడికి ఎంతగానో కృషి చేస్తున్న ఝా.. ఆర్థిక సంఘానికి కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు.

నీరజ్ కుమార్ గుప్తా



ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శిగా ఉన్నారు నీరజ్ కుమార్ గుప్తా. 1981 బ్యాచ్ ఐఏఎస్ అయిన గుప్తా పీఎస్‌యూల్లో సర్కారీ పెట్టుబడుల ఉపసంహరణను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. వాటాల అమ్మకానికి ఆయా కంపెనీలను ఎంపికచేస్తున్నారు.

రాజీవ్ కుమార్

ఆర్థిక సేవల విభాగం కార్యదర్శిగా ఉన్న రాజీవ్ కుమార్.. దివాలా చట్టాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల ఆర్థిక సాయం ప్రకటనలోనూ కీలకంగా నిలిచారీ 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. బీమా, పెన్షన్ రంగాల పురోగతికి ఈయన విశేష చర్యలు చేపడుతున్నారు.

అమెరికా వైఖరిని ఎండగట్టాలి

- డబ్ల్యూఈఎఫ్‌లో భారత సీఈవోల ఆకాంక్ష

దావోస్, జనవరి 22: అమెరికా వంటి దేశాలు అవలంభిస్తున్న రక్షణాత్మక ధోరణులను ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)లో ఎండగట్టాలని భారతీయ సీఈవోలు కోరుతున్నారు. ముఖ్యంగా అగ్రదేశాల వాక్చాతుర్యానికి ధీటుగా స్పందించి భారత్ తన రాజనీతిజ్ఞతను చాటాలని ఆకాంక్షించారు. 23 నుంచి 26 వరకు జరుగుతున్న ఈ 48వ డబ్ల్యూఈఎఫ్ వార్షిక సమావేశాల్లో మంగళవారం ప్లీనరీ సెషన్‌లో ప్రధాని మోదీ కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఇక్కడ పలువురు భారత కంపెనీల సీఈవోలు పీటీఐతో మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. భారత్ సాధిస్తున్న విజయాలను డబ్ల్యూఈఎఫ్ వేదికగా చాటాల్సిన అవసరం ఉన్నదని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్నదని, ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో జీడీపీ 7 శాతంగా నమోదు కాగలదన్న విశ్వాసాన్ని ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో చందా కొచ్చర్ వ్యక్తం చేశారు. దేశంలో చేపట్టిన సంస్కరణలతోపాటు దావోస్ సదస్సులో చెప్పుకోవడానికి మోదీ వద్ద అనేక విజయాలున్నాయని స్పైస్‌జెట్ సీఈవో అజయ్ సింగ్ అన్నారు.

సంగారెడ్డిలో హెచ్‌ఎస్‌ఐఎల్ పైపుల ప్లాంట్

- రూ.160 కోట్లతో ప్రారంభించిన సంస్థ

హైదరాబాద్, జనవరి 22: శానిటరీవేర్ ఉత్పత్తుల్లో దేశంలోనే అగ్రగామి సంస్థగా ఉన్న హెచ్‌ఎస్‌ఐఎల్.. తాజాగా ప్లంబింగ్ పైపుల సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ఈ పైపులను ఉత్పత్తి చేయడానికి హిండ్‌వేర్‌తో కలిసి సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్ వద్ద రూ.160 కోట్లతో ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ సందీప్ సొమెనీ మాట్లాడుతూ.. ప్రస్తుతం 30 వేల మెట్రిక్ టన్నులుగా ఉన ఈ యూనిట్ సామర్థ్యాన్ని 2020 నాటికి 60 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలనుకుంటున్నట్లు చెప్పారు. శానిటరీవేర్ ఉత్పత్తులతోపాటు ఈ ప్లంబింగ్ పైపులను కూడా ఒకేచోట విక్రయించనున్నట్లు, తద్వారా కంపెనీ బ్రాండ్‌కు మరింత ప్రమోషన్ లభించినట్లు అవుతుందన్నారు. వచ్చే ఐదేండ్లలో ప్లంబింగ్ పైపుల విభాగం నుంచి రూ.800 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించిన ఆయన.. టాప్-4 బ్రాండ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది వ్యాపార విస్తరణకు అవసరమయ్యే నిధుల్లో రూ.250 కోట్లను సేకరించడానికి బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు.

రూ.9.5 లక్షల కోట్లకు ఎన్‌పీఏలు

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశీయ బ్యాంకింగ్ సంస్థల నిరర్థక ఆస్తుల విలువ రూ.9.5 లక్షల కోట్లకు చేరుకోనున్నదని అసోచామ్-క్రిసిల్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. అంతక్రితం ఏడాది ఇది రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. మొండి బకాయిలను వసూలు చేయడానికి బ్యాంకింగ్ వ్యవస్థకు సర్వాధికారాలు లభించాయని, ముఖ్యంగా ఆస్తుల పునర్వ్యవస్థీకరణ కంపెనీస్ (ఏఆర్‌సీఎస్)కు లోబడి వాటాదారుల నుంచి వసూలు చేయడానికి వీలుండటంలో భవిష్యత్తులో తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొంది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఏఆర్‌సీఎస్ 12 శాతానికి తగ్గనున్నదని అంచనావేసిన సర్వే.. తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న రూ.11.5 లక్షల కోట్ల రుణాల్లో మొండి బకాయిల వాటా రూ.9.5 లక్షల కోట్లని గుర్తించింది.

మండుతున్న ఇంధనం

- ముంబైలో లీటర్ పెట్రోల్ రూ.80
- హైదరాబాద్‌లో 16 పైసలు పెరుగుదల



న్యూఢిల్లీ, జనవరి 22: దేశంలో ఇంధన ధరలు మండిపోతున్నాయి. వాణిజ్య రాజధాని ముంబైలో సోమవారం లీటర్ పెట్రోల్ ధర 80 రూపాయలను తాకింది. పెట్రోల్ ధర ఇంత తారాస్థాయికి చేరుకోవడం 2014 ఆగస్టు తర్వాత ఇదే ప్రథమం. అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ సమస్యలతో పాటు చమురు ఉత్పత్తి ధరలు తగ్గడం, మార్కెట్లో డిమాండ్ పెరుగడం ఇందుకు ప్రధాన కారణం. దీంతో ముంబైలో లీటర్ డీజిల్ ధర రూ.67.10కు ఎగబాకగా, రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.72.23కి, డీజిల్ ధర రూ.63.01కు చేరుకుంది. శుక్రవారం బ్యారెల్‌కు 69 సెంట్లు తగ్గి 68.53 డాలర్ల వద్ద ట్రేడ్ అయిన బ్రెంట్ క్రూడాయిల్ ధర సోమవారం 68.84 డాలర్లకు చేరుకోవడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో లీటర్ పెట్రోల్ ధర 15 పైసల మేరకు పెరిగింది. అయితే హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర 16 పైసలు పెరిగి రూ.76.49కు, డీజిల్ ధర 20 పైసలు పెరిగి రూ.68.46కు ఎగబాకాయి. అలాగే కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ రూ.74.94కు, డీజిల్ రూ.65.67కు, చెన్నైలో లీటర్ పెట్రోల్ రూ.74.91కి, డీజిల్ రూ.66.44కు చేరింది.

ఉద్యోగులకు శుభవార్త

- పీఎఫ్ వడ్డీరేటును యథాతథంగా కొనసాగించాలని కేంద్రం యోచన

న్యూఢిల్లీ, జనవరి 22: దేశంలోని ఉద్యోగులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం త్వరలో తీపికబురును అందించనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) డిపాజిట్లపై వడ్డీ రేటును మార్చకూడదని కేంద్రం నిశ్చయించుకున్నట్లు తెలుస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ డిపాజిట్లపై 8.65 శాతంగా ఉన్న వార్షిక వడ్డీ రేటును ఈ ఏడాది కూడా అలాగే కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) వద్ద ఉన్న షేర్లలో అదనంగా మరో 0.15 శాతం షేర్లను కుదించడం ద్వారా పీఎఫ్ వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు ఒక ఆంగ్ల దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనాన్ని బట్టి తెలుస్తున్నది. పీఎఫ్ డిపాజిట్లపై ఈ ఏడాది కూడా 8.65 శాతం వడ్డీని చెల్లించేందుకు ప్రభుత్వం 2015 ఆగస్టు నుంచి ఈపీఎఫ్ఓ కొనుగోలు చేసిన షేర్లలో కొన్నింటిని అమ్మాలని యోచిస్తున్నట్లు ఆ పత్రిక వెల్లడించింది. రూ.2 వేల కోట్ల విలువైన షేర్లను అమ్మడం ద్వారా ఈపీఎఫ్ఓ అదనంగా రూ.850 కోట్లను రాబట్టుకుంటుందని భావిస్తున్నామని, ఈ ఏడాది పీఎఫ్ వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించేందుకు ఈ అదనపు ఆదాయాన్ని ఉపయోగించే అవకాశం ఉందని ఆ పత్రిక పేర్కొన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ డిపాజిట్లపై చెల్లించాల్సిన వడ్డీ రేటుతో పాటు షేర్ల అమ్మకానికి సంబంధించిన పద్ధతులను ఖరారు చేసేందుకు ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు ట్రస్టీలు వచ్చే నెలలో సమావేశం కానున్నారు.

రికార్డు స్థాయికి సెన్సెక్స్

- బ్లూచిప్ షేర్ల జోరు



ముంబై, జనవరి 22: స్టాక్ మార్కెట్లు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడం, బ్లూచిప్ కంపెనీల షేర్లను కొనుగోళ్లు చేయడానికి దేశీయ మదుపరులు ఎగబడటంతో గడిచిన నాలుగు రోజులుగా సూచీ ఎగువ ముఖం పడుతున్నది. ఇంట్రాడేలో 35,827.70 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 286.43 పాయింట్ల లాభంతో 35,798.01కి చేరుకుంది. దీంతో గత రికార్డు 35,511.58 తుడిచిపెట్టుకుపోయింది. గడిచిన వరుస మూడు ట్రేడింగ్‌లలో సూచీ 740.53 పాయింట్లు ఎగబాకినట్లు అయింది. 10,975.10 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన నిఫ్టీ 71.50 పెరిగి 10,966.20 వద్ద స్థిరపడింది. మూడో త్రైమాసికంలో కార్పొరేట్ల ఫలితాలు అంచనాలకుమించి నమోదు చేసుకోవడం, పలు ఉత్పత్తులపై జీఎస్టీ రేటు తగ్గించడం సూచీల్లో జోష్‌ను మరింత పెంచిందని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. గత సెషన్‌లో ఎఫ్‌పీఐలు రూ.988.25 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ మదుపరులు రూ.209.86 కోట్ల మేర చొప్పించారు. దేశీయ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ 5.36 శాతం పెరిగి రూ.3,113.15 వద్ద ముగియగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.50 శాతం ఎగబాకి రూ.971.20కి చేరుకుంది. అలాగే ఓఎన్‌జీసీ 3.28 శాతం బలపడింది. హెచ్‌పీసీఎల్‌లో 51.11 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు ఓఎన్‌జీసీ ప్రకటించడం ఇందుకు దోహదం చేసింది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో యాక్సిస్ బ్యాంక్ షేరు ధర 3.52 శాతం వృద్ధిని కనబరిచింది. వీటితోపాటు యెస్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఎల్ అండ్ టీ, కొటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్‌లు మూడు శాతానికి పైగా లాభపడ్డాయి. అయితే విప్రో షేరు మాత్రం 2.33 శాతం క్షీణించింది. మూడో త్రైమాసికంలో నికర లాభం పతనమవడం ఇందుకు కారణమైంది. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్బీఐ, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ 2 శాతం, రియల్టీ 1.95 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.79 శాతం, టెక్ 1.38 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్, హెల్త్‌కేర్, ఇన్‌ఫ్రా, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకెక్స్, ఇంధనం, ఆటో లాభాల్లో ముగిశాయి.

రూ.769కే విమాన టికెట్

- స్పైస్‌జెట్ రిపబ్లిక్ డే ఆఫర్

ముంబై, జనవరి 22: చౌక ధరలో విమానయాన సేవలను అందజేస్తున్న స్పైస్‌జెట్ దేశ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్' పేరుతో సోమవారం ప్రారంభమైన ఈ ఆఫర్ ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి వరకూ అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రత్యేకంగా ఎంపిక చేసిన కొన్ని దేశీయ మార్గాలతో పాటు మరికొన్ని అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే వారు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకోవచ్చని, ఈ ఆఫర్ కింద దేశీయ మార్గాల్లో ప్రయాణించే వారికి (ఒక వైపు ప్రయాణానికి మాత్రమే) రూ.769 ప్రారంభ ధరతోనూ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే వారికి రూ.2,469 ప్రారంభ ధరతోనూ టికెట్లను అందజేస్తున్నామని స్పైస్‌జెట్ తెలిపింది. అయితే డిసెంబర్ 12వ తేదీ వరకూ ప్రయాణించే వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది.

అంచనాలు దాటిన యాక్సిస్ బ్యాంక్

ముంబై, జనవరి 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.726.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు యాక్సిస్ బ్యాంక్ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.579.57 కోట్ల లాభంతో పోలిస్తే 25.34 శాతం ఎగబాకింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపు రూ.3,795.8 కోట్ల స్థాయి నుంచి రూ.2,811.04 కోట్లకు తగ్గడం లాభాల్లో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడానికి దోహదపడిందని బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఆదాయం విషయానికి వస్తే రూ.14,501.21 కోట్ల స్థాయి నుంచి రూ.14,314.6 కోట్లకు తగ్గింది.

లాడెన్‌ను పట్టించి.. జైలులో మగ్గుతున్నాడు..!

ఒసామాను మట్టుబెట్టడంలో కీలకపాత్ర పోషించిన పాక్ డాక్టర్ షకీల్ అహ్మద్

పాక్ ప్రభుత్వం కుట్రతో ఆరేండ్లుగా జైలు జీవితం.. పట్టించుకోని అమెరికా

పెషావర్, జనవరి 22: డాక్టర్ షకీల్ అఫ్రిదీ.. ఏడేండ్ల కిందట ప్రపంచం మొత్తం మార్మోగిన పేరు. 2011లో అమెరికా సైనికులు అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చడంలో అత్యంత కీలక పాత్ర పోషించిన పాకిస్థాన్ డాక్టర్. అప్పుడు హీరోగా నీరాజనాలందుకున్న షకీల్ ఏండ్లుగా పాకిస్థాన్ జైలులో మగ్గుతున్నారు. పాకిస్థాన్ ప్రభుత్వ కుటిల వైఖరికి.. అమెరికా నమ్మకద్రోహానికి బలైపోయి చీకటి గదిలో దుర్భర జీవితం గడుపుతున్నారు. లాడెన్ పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో ఉన్న ఓ ఇంటిలో ఉన్నాడని నిర్ధారించుకునేందుకు అమెరికా డాక్టర్ షకీల్‌ను రంగంలోకి దింపింది. ఆయన టీకాల పేరుతో లాడెన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులందరి డీఎన్ఏను సేకరించారు. నివేదిక ఆధారంగా అక్కడున్నది లాడెన్ అని నిర్ధారించుకున్న అమెరికా.. పాకిస్థాన్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా ఆపరేషన్ నిర్వహించి 2011 మే 2వ తేదీన లాడెన్‌ను మట్టుబెట్టింది. కానీ ఆ తర్వాత అతడి జీవితం తలకిందులైంది. లాడెన్ అంతమైన కొన్నాళ్లకు పాకిస్థాన్ ప్రభుత్వం షకీల్‌ను అదుపులోకి తీసుకున్నది. ఖైబర్ కనుమల్లోని గిరిజన ప్రాంతాల్లో ఉగ్రవాదులకు షకీల్ ఆశ్రయం కల్పించారని గిరిజన చట్టాల కింద కేసు నమోదు చేసింది. ఇలాంటి కేసులను ప్రత్యేక న్యాయస్థానాలు విచారిస్తాయి. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదు. కోర్టులు విచారణను ఏండ్లపాటు సాగదీస్తాయి. 2012 నుంచి కనీసం అతడి లాయర్‌ను కూడా కలుసుకోనివ్వడం లేదు. భార్యాపిల్లలను మాత్రమే అప్పుడప్పుడు అనుమతిస్తున్నారు. కోర్టులు సైతం షకీల్‌కు సహకరించడం లేదని అతడి తరపు లాయర్ నదీమ్ అఫ్రీదీ పేర్కొన్నారు. షకీల్ కేస్ ఫైల్ కనిపించడం లేదంటూ రెండేండ్లపాటు విచారణ వాయిదా వేశారని, ఇప్పుడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేరంటూ విచారణ చేపట్టడం లేదని వాపోయారు. అమెరికాకు సాయం చేసినందుకు రాజద్రోహం కింద కేసు నమోదు చేస్తే సాధారణ కోర్టుల్లో విచారణ చేపట్టాలని, ఆ అవకాశం ఇవ్వొద్దనే కుట్రతోనే గిరిజన చట్టాల కింద కేసు నమోదు చేశారన్నారు.



డాక్టర్ షకీల్ అహ్మద్

ట్రంప్ మాటలూ ఉత్తివే..

తన స్వార్థం కోసం షకీల్‌ను వాడుకున్న అమెరికా ఆ తర్వాత అతడిని విడిపించేందుకు పెద్దగా ప్రయత్నించలేదనే ఆరోపణలు ఉన్నాయి. 'కేవలం రెండే నిమిషాల్లో షకీల్‌ను బయటికి తీసుకొస్తా' అని 2016లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. కానీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. పాక్‌కు ఆర్థిక సహాయాన్ని ట్రంప్ ప్రభుత్వం నిలిపివేయడంతో షకీల్ ఆశలు మరింత సన్నగిల్లాయి. ఇప్పుడు అతడిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవల రెండు దేశాల మధ్య జరిగిన ఉన్నతస్థాయి సమావేశాల్లో షకీల్ గురించి కనీసం చర్చించలేదని పలు అంతర్జాతీయ సంస్థలు దుమ్మెత్తిపోస్తున్నాయి. అమెరికా విదేశాంగ శాఖ మాత్రం షకీల్ అంశం తమ దృష్టిలో ఉన్నదని చిన్న ప్రకటన ఇచ్చింది. షకీల్ పెద్ద చిక్కుముడిలో ఇరుక్కున్నారని, పాకిస్థాన్, అమెరికా మధ్య మళ్లీ సత్సంబంధాలు నెలకొనేవరకు ఆయనకు దుర్భర జీవితం తప్పకపోవచ్చని పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీస్ స్టడీస్ డైరెక్టర్ మహ్మద్ అమీర్ రాణా పేర్కొన్నారు.

సాయం చేస్తే అంతమే..

షకీల్‌కు సాయం చేసేందుకు ముందుకొచ్చిన వారు వరుసగా హత్యకు గురవుతున్నారు. గతంలో షకీల్ తరపున వాదించడానికి ప్రయత్నించిన లాయర్‌ను పెషావర్‌లోని అతడి ఇంటి ముందే తుపాకీతో కాల్చి చంపారు. షకీల్‌కు సాయం చేసేందుకు ప్రయత్నించిన పెషావర్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ప్రస్తుతం షకీల్ కేసును వాదిస్తున్న నదీమ్‌పైనా హత్యాయత్నం జరిగింది.



అలంపూర్‌లోని ఐదో శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పోతరాజు విన్యాసం

వైభవంగా జోగులాంబ కల్యాణోత్సవం

భక్తులకు నిజరూప దర్శనం

జోగులాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి : ఐదో శక్తి పీఠంగా విరాజిల్లుతున్న అలంపూర్ జోగులాంబ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చివరి ఘట్టమైన జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా సాగింది. ఉదయం అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. 1108 కలశాలతో భక్తులు తీసుకొచ్చిన పవిత్ర జలంతో, పంచామృతాలు, పండ్ల రసాలతో అమ్మవారి మూలవిరాట్‌ను అభిషేకించారు. ఆలయానికి ఈశాన్య భాగంలో నిర్మించిన యాగశాలలోని హోమగుండంలో అమ్మవారికి ప్రీతి పాత్రమైన సుగంధ ద్రవ్యాలు, పట్టుచీర, నవరత్నాలు, గంధపు చెక్కను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. కళాకారుల వేషధారణలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గతంలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సర్వదర్శనం, అంతరాలయ దర్శనం క్యూలైన్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో కలెక్టర్ రజత్‌కుమార్ సైని, ఎమ్మెల్యే సంపత్, మాజీ ఎంపి మంద జగన్నాథం పాల్గొన్నారు.



అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేస్తున్న అర్చకులు

● ప్రారంభమైన చెర్వుగట్టు జాతర



రాష్ట్రంలో ప్రసిద్ధ శైవ క్షేత్రమైన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నల్లగొండలో స్వామివారి నగరోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ నెల 29వ తేదీ వరకు జరిగే జాతరలో భాగంగా 24న అర్ధరాత్రి తర్వాత స్వామివారి కల్యాణం, 25 సాయంత్రం స్వామివారి తెప్పోత్సవం, 27న తెల్లవారు జామున అగ్నిగుండాలు, 29న గ్రామోత్సవం నిర్వహిస్తారు. చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 5 లక్షల మంది వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. జాతర దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నది. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను సైతం వినియోగిస్తున్నారు. -నార్కట్‌పల్లి

బండారు వనమైన కొమురెల్లి

భక్తిశ్రద్ధలతో పెద్దపట్నం-అగ్నిగుండాలు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ : కొమురెల్లి బండారు వనమైంది. అగ్ని గుండాల భారీగా భక్తులు తరలివచ్చారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి క్షేత్రంలో హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచ పల్లవాలు(మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి కట్టెలను) వరుసుగా పేర్చి అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ముందుగా పంచవర్ణాల పిండితో పెద్దపట్నం వేశారు. అనంతరం ఆలయ అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, చిన్న మల్లికార్జున్ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పెద్దపట్నం, అగ్నిగుండం వరకు తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దపట్నం, అగ్నిగుండాలను ఆలయ అర్చకులు దాటిన వెంటనే భక్తులు అనుకరించి మల్లికార్జున స్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులు బండారుమయంగా మారారు. శివసత్తుల పూనకాలతో కొమురెల్లి భక్తి పారవశ్యంలో ఓలలాడింది. స్వామి వారి ఖజానాకు రికార్డు స్థాయిలో రూ.47,49,012 ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు. గత సంవత్సరం రూ.19,83,598 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ సంప్రదాయం మేరకు శివసత్తులకు, ఘనాచార్యులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు, ఆలయ చైర్మన్ బద్దిపడిగే కృష్ణారెడ్డి, సభ్యులు కండువా, జాకెట్ ముక్కలతో పాటు స్వామి వారి బండారును పంపిణి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం భిక్షపతి, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో పెద్దపట్నం సందర్భంగా అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు





మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న గిరిజనులు, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న దృశ్యం

విపక్షాలకు బీటలు.. గులాబీకి బాటలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:

విపక్షాలు ఖాళీ అవుతున్నాయి. గులాబీ పార్టీలో బలగం రోజు రోజుకూ పెరుగుతున్నది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులవుతున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గులాబీ జెండాకు జై కొడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కొల్లూర్ పంచాయతీ పరిధిలోని గిరిజన తండాల్లో 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నక్కల బండతండాకు చెందిన 100మంది, జడ్చర్లలోని జయప్రకాశ్ నగర్‌కు చెందిన 25మంది సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. పాలమూరు జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ పద్మజా గోపాల్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కోయిలకొండ మండలంలోని పలు తండాలకు చెందిన 200 మందికి పైగా నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్‌లో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ నివాసంలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు డీడీసీ చైర్మన్ లోకబాపురెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన 63 పద్మశాలీ కుటుంబాలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరాయి. మాచారెడ్డి మండలం రాజ్‌ఖాన్‌పేటకు చెందిన యంగ్ డైనమిక్ యూత్ ఫెడరేషన్ సభ్యులు 20 మంది ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం కౌల్‌పూర్ గ్రామస్థులు సోమవారం టీఆర్‌ఎస్‌లో చేరారు. వార్డు సభ్యుడు డాక్టర్ బొడ్డు నాగేశ్వర్‌ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఒకే జెండా.. ఒకే ఎజెండాతో గ్రామం మొత్తం టీఆర్‌ఎస్ పక్షం ఉంటామంటూ ఏకగ్రీవంగా తీర్మాన ప్రతిని ఎమ్మెల్యేకు అందజేశారు. భద్రాచలంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సమక్షంలో 200 కుటుంబాలు గులాబీ పార్టీకి జై కొట్టాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరాయి. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి, గోవిందాపూర్, పెద్దకోడెపాకకు చెందిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర హౌసింగ్ ఫెడరేషన్ చైర్మన్ కడారి నవనీతరావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన మహబూబ్‌నగర్ కౌన్సిలర్ పద్మజా గోపాల్ యాదవ్ తదితరులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

రెచ్చగొట్టే ప్రకటనలు మానండి

మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్ కార్పొరేషన్/హుజూరాబాద్/భీమారం : రబీ పంట సాగుకు నీరందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే విపక్షాలు ద్వంద్వ వైఖరితో రైతులను రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నాయని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మండిపడ్డారు. కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులతో ఎస్సారెస్పీ నీటి వినియోగంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎల్‌ఎండీ ఎగువ ఉన్న రైతులు ఎస్సారెస్పీ కాల్వలకు అక్రమంగా మోటర్లు పెట్టి నీటిని తరలించడం వల్ల దిగువ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎగువన మోటర్లు పెట్టి నీటిని తీసుకుంటున్న వారికి ఒక వైపు మద్దతిస్తూనే దిగువ ఆయకట్టుకు నీరందడం లేదంటూ ఒకే పార్టీకి చెందిన నాయకులు ద్వంద్వ విధానాలను అవలంబిస్తూ ఆందోళనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నాయకుల ఉచ్చులో రైతులు పడవద్దని కోరారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి చివరి ఆయకట్టు రైతుకు నీరందించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ నెల 25 నుంచి మూడో తడి నీటిని విడుదల చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పుట్ట మధు, గంగుల కమలాకర్, సోమారపు సత్యనారాయణ, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, ఇల్లందకుంట మండలాల్లోని పలు గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మంత్రి ఈటల శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని భీమారంలోని ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కాలేజీలో 'స్ప్రింగ్ ఫైర్–18'ను మంత్రి ఈటల ప్రారంభించి మాట్లాడారు.



ఉత్తనూరులో ఎద్దుల బల ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పంద్రాగస్టు నాటికి 'తుమ్మిళ్ల' పూర్తి చేస్తాం

జోగులాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి : ఆగస్టు15 నాటికి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉత్తనూరులో ధన్వంతరీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అఖిల భారత ఒంగోలు గోజాతి పోషక, ప్రోత్సాహక సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఉత్తనూరులో పశుప్రదర్శన పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. రూ.783 కోట్ల వ్యయంతో చేపట్టిన తుమ్మిళ్ల ప్రాజెక్ట్‌ను వచ్చే పంద్రాగస్టు నాటికి పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి నడిగడ్డ రైతులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తిరుమల్‌రెడ్డి, నగరపంచాయతీ చైర్ పర్సన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కోర్సుకు పూర్వవైభవం

- సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంస్కరణలు
- జేఎన్టీయూ కొండగట్టులో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

నమస్తే తెలంగాణ, జగిత్యాల ప్రతినిధి: ఇంజినీరింగ్ కోర్సులు పూర్వ వైభవం సంతరించుకుంటున్నాయనీ డిప్యూటీ సీఎం మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు జేఎన్టీయూ కాలేజీని సోమవారం ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచార్యులతో సమీక్ష నిర్వహించి.. వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. నాలుగేండ్ల క్రితం ఇంజినీరింగ్ కోర్సు విలువ కోల్పోయిందన్నారు. ఏ కోర్సుల్లోను సీట్లు దొరుకని విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ పరిస్థితిని పరిశీలించిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సులకు తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని ఆశించారన్నారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కోర్సుల్లో సంస్కరణలు చేస్తూ వచ్చామన్నారు. జేఎన్టీయూ కొండగట్టు కళాశాల చుట్టూ ప్రహరీ, ఆడిటోరియం నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కరీంనగర్ ఎంపీ బోయినిపెల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కొండగట్టు కళాశాలను యూనివర్సిటీ హోదాకు పెంచాలని ఎమ్మెల్యే బోడిగె శోభ కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జేఎన్టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వేణుగోపాల్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రమణ పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా కొండగట్టు జేఎన్టీయూలో లైబ్రరీని పరిశీలిస్తున్న కడియం

నేర రహిత రాష్ట్రమే లక్ష్యం

సూర్యాపేట నమస్తే తెలంగాణ ప్రతినిధి /నల్లగొండక్రైం: తెలంగాణను నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పని చేస్తున్నదని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఆయన పర్యటించారు. నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో నిర్మించిన సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ఐటీ సెల్ కేంద్రాన్ని ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లలో ఒకే విధమైన సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. దీని కోసం సిబ్బందికి శిక్షణ ఇవ్వబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐజీ స్టీఫెన్ రవీంద్ర, ఎస్పీ శ్రీనివాసరావు, సూర్యాపేట ఎస్పీ ప్రకాశ్‌జాదవ్, నల్లగొండ ఏఎస్పీ పద్మనాభరెడ్డి, డీఎస్పీ సుధాకర్, ఏఆర్‌డీఎస్పీ సురేందర్, పోలీస్ సంక్షేమ శాఖ అధ్యక్షుడు రామచంద్రగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భద్రతకు చర్యలు : డీజీపీ

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ : దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. సోమవారం యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పోలీసుశాఖ పరంగా తీసుకోవాల్సిన సెక్యూరిటీ, సెఫ్టీ మేనేజ్‌మెంట్ల సాధ్యసాధ్యాలను అంచనా వేయడానికి యాదాద్రికి వచ్చినట్టు చెప్పారు. కొండపైన ఏర్పాటు చేయనున్న పోలీసుస్టేషన్‌కు స్థల పరిశీలన చేసినట్టు తెలిపారు. ఆయన వెంట రాచకొండ సీపీ మహేష్‌భగవత్, యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, డీసీపీ రామచంద్రారెడ్డి ఉన్నారు.



యాదాద్రిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి, యాదాద్రి కలెక్టర్ అనితారామచంద్రన్



కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఏరియా దవాఖానలో అమ్మ ఒడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

మహిళ, శిశు సంక్షేమానికి కృషి


బాన్సువాడ, నమస్తే తెలంగాణ/ బీర్కూర్: మహిళ, శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానలో 102 అమ్మ ఒడి వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇంత గొప్ప పథకాలు ప్రవేశ పెట్టలేదన్నారు. నిజామాబాద్ జిల్లాకు 8, కామారెడ్డి జిల్లాకు 7 వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం బాన్సువాడ పట్టణంలోని శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో మంత్రి పోచారం దంపతులు, సోదరుడు శంభురెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు మానవత్వం చాటారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి శివారు దుబ్బతండాకు చెందిన గుగులోతు రాములు నాయక్ సోమవారం తన ఎక్సల్ వాహనంపై కూరగాయల కోసం పాలకుర్తి సంతకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో మల్లంపల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు పలు అభివృద్ధి పనుల నిమిత్తం పాలకుర్తి నుంచి రాయపర్తికి వెళుతుండగా బాధితుడిని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపారు. క్షతగాత్రుడు రాములనాయక్ తలకు తీవ్రగాయాలై రక్త స్రవం కావడంతో ఎమ్మెల్యే ఎర్రబెల్లి స్వయంగా తన టవల్‌తో కట్టు కట్టి చికిత్స కోసం పోలీస్ వాహనంలో పాలకుర్తిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే దయన్న నైజమని స్థానికులు వ్యాఖ్యానించారు. -పాలకుర్తి రూరల్

కేయూ ఫార్మసీ పరిశోధకురాలికి యువశాస్త్రవేత్త అవార్డు

హన్మకొండ, నమస్తేతెలంగాణ : కాకతీయ విశ్వవిద్యాలయం పరిశోధకురాలు కే స్వాతికి యువశాస్త్రవేత్త అవార్డు లభించింది. చెన్నై ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ సైంటిఫిక్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆమె చేసిన పరిశోధనల ఆధారంగా 'యంగ్ సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ –2017'కు ఎంపిక చేసింది. ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ సారంగపాణి వద్ద 2014లో పీహెచ్‌డీ పూర్తి చేసిన స్వాతి ప్రస్తుతం ఆయన వద్దనే పోస్ట్ డాక్టోరల్ ఫెల్లోగా పరిశోధనలు కొనసాగిస్తున్నారు.



డా.స్వాతి

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.6	6.3
ఆదిలాబాద్	34.9	8.4
సంగారెడ్డి	32.4	8.7
కామారెడ్డి	32.4	8.9
నిర్మల్	34.6	9.4
మంచిర్యాల	34.9	9.4
మేడ్చల్	35.1	9.5
రంగారెడ్డి	34.5	9.6
మహబూబ్‌నగర్	35.3	9.7
సిద్దిపేట	34.4	9.9
రాజన్న సిరిసిల్ల	34.8	10.2
నిజామాబాద్	34.6	10.4
జగిత్యాల	34.6	10.6
వికారాబాద్	34.9	10.6
నాగర్‌కర్నూల్	34.6	10.7
జయశంకర్ భూపాలపల్లి	35.1	11.1
మెదక్	34.6	11.2
భద్రాద్రి కొత్తగూడెం	34.9	11.2
నల్లగొండ	34.6	11.5
యాదాద్రి భువనగిరి	34.6	12.1
పెద్దపల్లి	34.9	12.2
కరీంనగర్	34.4	12.3
మహబూబాబాద్	35.3	12.3
జనగామ	35.2	12.8
హైదరాబాద్	34.6	12.8
జోగుళాంబ గద్వాల	34.9	12.8
వరంగల్ రూరల్	34.6	13.0
ఖమ్మం	33.5	13.8
వనపర్తి	34.9	13.9
వరంగల్ అర్బన్	34.6	14.1
సూర్యాపేట	35.3	14.3

ఏప్రిల్ 7 నుంచి ఐపీఎల్

న్యూఢిల్లీ: ఐపీఎల్ 11వ సీజన్ షెడ్యూల్ ఖరారైంది. సోమవారం సమావేశమైన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్(జీసీ) ఐపీఎల్ మ్యాచ్‌ల సమయం, తేదీలను ప్రకటించాయి. ఏప్రిల్ 7న ముంబైలో మొదలై మే 27న ఇక్కడే(వాంఖడే స్టేడియం) ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. ఐపీఎల్ ప్రసారదారు స్టార్ స్పోర్ట్స్ అభ్యర్థన మేరకు రాత్రి వేళ మ్యాచ్ సమయాలను మార్చారు. రాత్రి ఎనిమిది గంటలకు బదులుగా 7 గంటలకే మ్యాచ్‌లు మొదలవుతాయి. సాయంత్రం 4 గంటల మ్యాచ్‌ల సమయాన్ని 5.30కు మార్చామని సమావేశం అనంతరం ఐపీఎల్ చైర్మన్ రాజీవ్‌శుక్లా పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యునిగా సౌరవ్ గంగూలీ హాజరుకావాల్సి ఉన్నా.. సమయభావం వల్ల రాలేకపోయాడు. మరోవైపు కింగ్స్‌లెవన్ పంజాబ్ తమ ఏడు మ్యాచ్‌లను మొహాలీలో నాలుగు, ఇండోర్‌లో మూడు ఆడనుంది. రెండేండ్ల తర్వాత తిరిగి లీగ్‌లోకి ప్రవేశించిన రాజస్థాన్ రాయల్స్ సొంత గడ్డపై ఆడే మ్యాచ్‌లపై సందిగ్ధత నెలకొన్నది. రాజస్థాన్ హైకోర్టులో ఈనెల 24 తీర్పు వచ్చిన తర్వాత ఓ నిర్ణయానికి వస్తామని శుక్లా తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో బెంగళూరులో ఐపీఎల్ వేలం జరుగనున్న విషయం తెలిసిందే.

జొకోవిచ్‌కు షాక్..



చుంగ్

- ప్రి క్వార్టర్స్‌లో చుక్కెదురు..
- కొరియా కుర్రాడు చుంగ్ సంచలనం
- క్వార్టర్స్ చేరిన హాలెప్
- ఫెదరర్, టెన్నిస్ శాండ్‌గ్రెన్ ముందంజ

కొరియన్ కుర్రాడు కుమ్మేసిన వేళ ...సెర్బియన్ స్టార్ జొకోకు ఊహించని షాక్ తగిలింది. చుంగ్ దెబ్బకు మాజీ చాంపియన్ జొకోవిచ్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు.. మరోవైపు అరంగేట్రంలోనే క్వార్టర్స్‌కు చేరి శాండ్‌గ్రెన్ రికార్డులకెక్కగా... వన్నెతగ్గని స్విస్ దిగ్గజం ఫెదరర్ 14వ సారి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు... ఇక ఎదురులేని నంబర్‌వన్ భామ హాలెప్..అలవోకగా మరో అడుగు ముందుకేసింది..వెరసి ఆస్ట్రేలియన్ ఓపెన్ తుది అంకానికి చేరుతున్న కొద్దీ మరింత రసవత్తరంగా మారుతున్నది..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. ఆరుసార్లు చాంపియన్, సెర్బియాస్టార్ జొకోవిచ్‌పై దక్షిణ కొరియాకు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు, 21 ఏండ్ల చుంగ్ హైయోన్ సంచలన విజయం సాధించాడు. జొకోవిచ్‌పై ప్రి క్వార్టర్స్‌లో సాధించిన విజయంతో ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి దక్షిణ కొరియా ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. చిన్నప్పటి ఆరాధ్యహీరో జొకోవిచ్‌ను ఓడించడం తనకు కలగా అనిపిస్తుందని విజయానంతరం చుంగ్ అన్నాడు. సోమవారం రాడ్‌లేవర్ అరీనాలో జరిగిన మ్యాచ్‌లో చుంగ్ 7-6 (7-4), 7-5, 7-6 (7-3) స్కోరుతో జొకోవిచ్‌ను ఓడించి తుది ఎనిమిదిజాబితాలో చేరాడు.. ఈ మ్యాచ్ 3గంటల 21 నిమిషాలపాటు హోరాహోరీగా సాగింది..రెండేండ్లకు ముందు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిరౌండ్‌లో జొకోవిచ్ చేతిలో ఓడిన చుంగ్..తాజాగా విజయం సాధించడం విశేషం. తొలిసెట్ ఆరంభంలోనే జొకోవిచ్ రెండు డబుల్‌ఫాల్ట్స్ చేయడంతో చుంగ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. తేరుకున్న జొకోవిచ్ 5-5తో స్కోరు సమం చేసాడు. ఈ దశలో మోచేతి గాయం కాస్త ఇబ్బంది పెట్టడంతో జొకోవిచ్ సుదీర్ఘ ర్యాలీలు ఆడడంలో తడబడ్డాడు. స్కోరు సమం కావడంతో తొలిసెట్ టైబ్రేకర్‌కు దారితీసింది. టైబ్రేకర్‌లో మెరుగైన సర్వీసులతో జొకోవిచ్‌ను నిలువరించిన చుంగ్ తొలిసెట్‌ను గెలుచుకుని 1-0 ఆధిక్యం అందుకున్నాడు. ఈ సమయంలో వైద్యబృందంలో చికిత్స తీసుకున్న జొకోవిచ్ ఆటను కొనసాగించినా..యువ చుంగ్ దూకుడును అడ్డుకోలేకపోయాడు. 5-5తో సెట్ స్కోరు సమమైనా..అనంతరం ఆరోగేమ్‌లో జొకోవిచ్ సర్వీస్ బ్రేక్ చేయడంతోపాటు ఏడోగేమ్‌లో సర్వీసు నిలబెట్టుకుని చుంగ్ రెండోసెట్‌నూ గెలుచుకున్నాడు. ఇక మూడోసెట్‌లోనూ ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. ఈ సెట్ ఫలితం కూడా టైబ్రేకర్‌లో తేలింది. ఈమ్యాచ్‌లో జొకోవిచ్ 57 అనవసర తప్పిదాలు చేయగా..చుంగ్ 37 అనవసర తప్పిదాలు మాత్రమే చేసాడు. జొకోవిచ్ 2 ఏస్‌లతోపాటు 9 డబుల్ పాల్ట్స్ చేయగా.. చుంగ్ ఒక ఏస్‌తోపాటు 2 డబుల్‌ఫాల్ట్స్ చేసాడు. క్వార్టర్‌ఫైనల్లో చుంగ్..అమెరికా నయా సంచలనం టెన్నిస్ శాండ్‌గ్రెన్‌ను ఢీ కొంటాడు.. ప్రిక్వార్టర్స్‌లో టెన్నిస్ కూడా సంచలన విజయం సాధించాడు. ఆస్ట్రియాకు చెందిన ప్రపంచ 5వ సీడ్ డొమినిక్‌థీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో 6-2, 4-6, 7-6 (7/4), 6-7 (7/9)స్కోరుతో అద్భుత విజయం సాధించాడు. నాలుగుసెట్లపాటు సాగిన ఈ మ్యాచ్‌లో 3గంటల 54 నిమిషాలపాటు పోరాడిమరీ థీమ్‌ను ఓడించాడు. 20 ఏండ్ల కిందట ఫ్రాన్స్‌కు చెందిన నికోల్స్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి అరంగేట్ర ఆటగాడిగా టెన్నిస్ రికార్డు నెలకొల్పాడు.



జొకోవిచ్



హాలెప్

ఫెదరర్ 14సారి..

డిఫెండింగ్ చాంపియన్ స్విస్ వెటరన్ రోజర్ ఫెదరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దూసుకెళుతున్నాడు. సోమవారం హంగేరీకి చెందిన యుక్సోవిక్స్‌ను 6-4,7-6(7-3),6-2 స్కోరుతో వరుససెట్లలో ఓడించి తుది ఎనిమిది జాబితాలో చేరాడు. తాజా విజయంతో ఫెదరర్ రికార్డుస్థాయిలో 14వ సారి క్వార్టర్ ఫైనల్ చేరి రికార్డు నెలకొల్పాడు. క్వార్టర్‌ఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన థామస్ బెర్డిచ్‌ను ఎదుర్కోనున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 2014,2015 ఏడాదిలో బెర్డిచ్ సెమీస్ చేరుకున్నాడు. కాగా..గతంలో 13 క్వార్టర్ ఫైనల్లో ఆడిన ఫెదరర్ ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించడం విశేషం..

క్వార్టర్ ఫైనల్లో హాలెప్:

మహిళల ప్రపంచ నంబర్‌వన్ సిమోన్ హాలెప్ నాలుగోరౌండ్‌లో 6-3,6-2స్కోరుతో వరుససెట్లలో జపాన్ అమ్మడు నవోమి ఒకాసాపై ఘన విజయం సాధించింది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో దూకుడుగా ఆడుతున్న హాలెప్ సునాయాస విజయాలతో క్వార్టర్ ఫైనల్ చేరింది. ఇక 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, జర్మనీ క్రీడాకారిణి ఎంజెలిక్ కెర్బర్ ఉత్కంఠ పోరులో 4-6, 7-5, 6-2 స్కోరుతో చైనీస్ తైపీకి చెందిన వెటరన్ హై సూవీని ఓడించి క్వార్టర్‌ఫైనల్ చేరుకుంది. క్వార్టర్ ఫైనల్లో కెర్బర్..అమెరికాకు చెందిన మాడిసన్ కైస్‌తో ఆడనుండగా..హాలెప్..చెక్ భామ కరోలినా ప్లిస్కోవాను ఢీకొట్టనుంది.

ముగిసిన భారత పోరు

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన రోహన్ బోపన్న జోడీతోపాటు దివిశరణ్ జోడీ పరాజయం పాలైంది. అమెరికా ఆటగాడు రాజీవ్ రామ్, భారత్‌కు చెందిన దివిశరణ్ జోడీపై టాప్‌సీడ్ మెలో(బ్రెజిల్),కుబోట్(పోలండ్)ల జోడీ 3-6,7-6(7-4),6-4 స్కోరుతో ఓడించి క్వార్టర్స్ చేరుకున్నారు.. మరో మూడోరౌండ్ మ్యాచ్‌లో రోజర్ వాసిలిన్(ఫ్రాన్స్), రోహన్ బోపన్న(భారత్) జోడీపై ఒలివర్ మరాచ్(ఆస్ట్రియా), మెటె పావిచ్(క్రొయేషియా)జోడీ 6-4,7-6(7-5),6-3 స్కోరుతో విజయం సాధించి ముందంజ వేసారు.

రైనా ధమాకా

49 బంతుల్లో సుడిగాలి శతకం

బెంగాల్‌పై ఉత్తర్‌ప్రదేశ్ ఘనవిజయం



రైనా(126 నాటౌట్)

కోల్‌కతా: భారత సీనియర్ క్రికెటర్ సురేశ్ రైనా సత్తా చాటాడు. జాతీయ జట్టులో పునరాగమనం కోసం నిరీక్షిస్తున్న రైనా..సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. గత కొన్ని టోర్నీలుగా ఫామ్‌లేమితో సతమతమవుతున్న ఈ ఉత్తర్‌ప్రదేశ్ డాషింగ్ బ్యాట్స్‌మన్..బెంగాల్‌తో టీ20 మ్యాచ్‌లో సెంచరీతో వీరవిహారం చేశాడు. ఫలితంగా తమ తొలి మ్యాచ్‌లోనే యూపీ 75 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. తనలో చేవ ఇంకా తగ్గలేదని నిరూపిస్తూ రైనా(59 బంతుల్లో 126 నాటౌట్, 13ఫోర్లు, 7సిక్స్‌లు)అజేయ సెంచరీతో కదంతొక్కడంతో టాస్‌గెలిచి బ్యాటింగ్‌కు దిగిన యూపీ..నిర్ణీత 20 ఓవర్లలో 235/3 భారీ స్కోరు అందుకుంది. అన్ని ఫార్మాట్లలో కలిపి గత పది ఇన్నింగ్స్‌ల్లో కనీసం అర్ధసెంచరీ కూడా కొట్టని రైనా..తాజాగా నాలుగో టీ20 సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. బెంగాల్ బౌలర్లను చీల్చిచెండాడుతూ తన ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, 7 భారీ సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో 49 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూలీ..రైనా ఆటతీరును మెచ్చుకున్నాడు. మరోవైపు అక్ష్‌దీప్‌నాథ్(43 బంతుల్లో 80, 7ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీతో రాణించడం యూపీకి బాగా కలిసొచ్చింది. అక్ష్‌దీప్‌తో కలిసి రైనా మూడో వికెట్‌కు 163 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అశోక్ దిండా(1/29), ముకేశ్ కుమార్(1/63), ఛటర్జీ(1/29) ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదన కోసం దిగిన బెంగాల్..కుల్దీప్ యాదవ్(4/26), మొహసిన్ ఖాన్(3/35) ధాటికి 16.1 ఓవర్లలో 160 పరుగులకు కుప్పకూలింది. వీరిద్దరి విజృంభణతో గోస్వామి(57), ఛటర్జీ(36) మినహా అందరూ స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. మంగళవారం తమిళనాడుతో యూపీ తలపడుతుంది.

యువీ మళ్లీ... పంజాబ్‌కు రెండో విజయం

భారత సీనియర్ క్రికెటర్ యువరాజ్‌సింగ్(34 బంతుల్లో 40,2 ఫోర్లు, 2సిక్స్‌లు) మళ్లీ మెరిసాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ సూపర్ లీగ్ స్టేజ్‌లో భాగంగా సోమవారం ముంబైపై పంజాబ్ విజయంలో (3 వికెట్ల తేడాతో) కీలకమయ్యాడు. ముంబై నిర్దేశించిన 199 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 19.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యువీతో పాటు మనన్ వోహ్రా(42), గురుకీరత్‌సింగ్(18 బంతుల్లో 43, 6ఫోర్లు, 2సిక్స్‌ల) రాణించారు. 72 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో వోహ్రాతో కలిసి యువీ పంజాబ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ క్రమంలో రెండు (8,32) సార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వోహ్రా, గురుకీరత్‌తో కలిసి జట్టును గెలిపించడంలో యువీ కీలక భూమిక పోషించాడు. దూబే (3/27)కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు శ్రేయాస్ అయ్యర్(79 నాటౌట్), హెర్వాద్కర్(42) రాణింపుతో ముంబై 20 ఓవర్లలో 198/4 స్కోరు చేసింది. మార్కండే(2/32) ఆకట్టుకున్నాడు. మిగతా మ్యాచ్‌ల్లో రాజస్థాన్ 4 వికెట్ల తేడాతో జార్ఖండ్‌పై, ఢిల్లీ 2 వికెట్లతో బరోడాపై విజయాలు సాధించాయి.

టైటిల్ వేట షురూ..

- నేటి నుంచి ఇండోనేషియా మాస్టర్స్
- సింధు, శ్రీకాంత్‌పై భారత్ ఆశలు
- సైనాకు తొలి రౌండ్‌లోనే గట్టి పోటీ



శ్రీకాంత్

సింధు

జకార్తా: గతేడాది వరుస టైటిళ్లతో అదరగొట్టిన భారత షట్లర్లు శ్రీకాంత్, పీవీ సింధు... ఇండోనేషియా మాస్టర్స్‌లోనూ సత్తా చాటి ఈ ఏడాదిలో శుభారంభం చేసేందుకు సిద్ధమయ్యారు. నేటి నుంచి ఇక్కడ జరుగనున్న ఇండోనేషియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత షట్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు తన తొలి రౌండ్ మ్యాచ్‌లో హన్నా రమాదిని (ఇండోనేషియా)తో తలపడనున్నది. 2017లో సింధు మూడు టైటిల్స్, మూడు సిల్వర్ మెడల్స్ గెలుచుకోగా..తాజాగా ముగిసిన పీబీఎల్‌లోనూ సత్తా చాటింది. అదే ఫాంను ఇండోనేషియా మాస్టర్స్‌లోనూ కనబరిచేందుకు సిద్ధమైంది. ఇక కాలి మడమ గాయం నుంచి కోలుకున్న సైనా నెహ్వాల్‌కు ఈ టోర్నీలో కష్టమైన డ్రా ఎదురైంది. సైనా తన తొలి మ్యాచ్‌లో యువ సంచలనం చెన్ యుఫీ (చైనా)తో తలపడనున్నది.

శ్రీకాంత్ జోరు చూపించేనా..?

తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో గతేడాది 4 టైటిళ్లు సొంతం చేసుకున్న కిడాంబి శ్రీకాంత్..ఈ టోర్నీలోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగాడు. అయితే తాజాగా పీబీఎల్‌లో శ్రీకాంత్ పెద్దగా ప్రభావం చూపకపోవడం..సహచరులైన సాయిప్రణీత్, ప్రణయ్ చేతుల్లో పరాజయం చవిచూడటం కాసింత ఆందోళన కలిగించే అంశం. వాటి నుంచి తేరుకుని మునుపటి ఫాంను సంతరించుకునేందుకు శ్రీకాంత్ సిద్ధమయ్యాడు. ప్రణయ్, రాస్మస్ గెమ్కె (డెన్మార్క్)తో.. సమీర్‌వర్మ, కజుమస సకాయ్ (జపాన్)తో పోటీపడనున్నారు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడి...టకుటో, యుకీ (జపాన్)తో, మనుఅత్రి, సుమీత్, లు చింగ్, యాంగ్ (చైనీస్‌తైపీ)తో తలపడుతారు.



మున్రో
(49 నాటౌట్)

కివీస్ గెలుపు జోరు

వెల్లింగ్టన్: పాకిస్థాన్‌తో వన్డే సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసిన న్యూజిలాండ్...టీ20 సిరీస్‌లోనూ జైత్రయాత్రను కొనసాగించింది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి డే అండ్ నైట్ టీ20 మ్యాచ్‌లో కివీస్ ఏడు వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. పాక్ విసిరిన 106 పరుగుల విజయ లక్ష్యాన్ని న్యూజిలాండ్ మరో 25 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కొలిన్ మున్రో (49 నాటౌట్) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మున్రో మరో పరుగు చేసి ఉంటే...వరుసగా నాలుగు టీ20ల్లో నాలుగు అర్ధసెంచరీలు చేసిన మూడో బ్యాట్స్‌మన్‌గా రికార్డుల్లో చేరి ఉండేవాడు. అంతకు ముందు మెకల్లమ్, గేల్ ఈ ఘనత సాధించారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే లక్ష్య ఛేదనలో ఓపెనర్ గుప్టిల్ (2), ఫిలిప్స్ (3) తక్కువ స్కోర్లకే అవుటైనా...బ్రూస్ (26), టేలర్ (22 నాటౌట్) మున్రోకు సహకరించారు. దీంతో న్యూజిలాండ్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి విజయం సాధించింది. తొలుత సౌథీ (3/13), ర్యాన్స్ (3/26) దాటికి పాక్ 19.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌట్ అయింది. బాబర్ అజామ్ (41) హసన్‌అలీ (23) మినహా అందరూ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు.

అంతా 'శాస్త్రీ'యమే..

రహానేను ఆడించకపోవడంపై సమర్థన • పరిస్థితులకు తగ్గట్టుగానే నిర్ణయాలన్న కోచ్



జొహన్నెస్‌బర్గ్: మేము నెంబర్ వన్ జట్టులానే ఆడాం..ఎవరెలా విమర్శించినా మాపై ప్రభావం చూపదు..ఒకవేళ రహానేను ఆడిస్తే..రోహిత్‌ను ఎందుకు ఆడించలేదని అడిగేవారు...ఏం చేయాలో మాకు తెలుసు..ఇవీ టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలు. రేపటి నుంచి ఇక్కడ మొదలవనున్న మూడో టెస్టు కోసం విరాట్ సేన వరుసగా రెండో రోజూ ప్రాక్టీస్ చేసింది. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడిన శాస్త్రి.. రహానేను గత రెండు టెస్టుల్లో ఆడించకపోవడాన్ని సమర్థించుకున్నాడు. " ఒకవేళ రహానేను తొలి టెస్టులో ఆడించి ఉంటే, అతను అందులో విఫలమై ఉంటే..అందరూ రోహిత్‌ను ఎందుకు ఆడించలేదని ప్రశ్నించేవారు. ఇపుడు రోహిత్ విఫలమయ్యాడు కనుక రహానేను ఎందుకు ఆడించలేదని ప్రశ్నిస్తున్నారు. పేస్ బౌలర్ల ఎంపిక విషయంలోనూ అదే పద్ధతి ఉంటుంది. మాకు ప్రత్యామ్నాయాలు ఉంటాయి. విదేశీ పరిస్థితులకు అనుగుణంగా ఎవరిని ఎంపిక చేస్తే మంచిదో టీమ్ మేనేజ్‌మెంట్ చర్చించి నిర్ణయం తీసుకుంటుంది. దానికే కట్టుబడి ఉండి, ఆటలో అమలు చేస్తుంది." అని ప్రధాన కోచ్ వెల్లడించాడు. రెండో టెస్టులో చేసిన పొరపాట్లను సరిచేసుకుంటామన్నాడు. భారత బ్యాట్స్‌మెన్ స్కూల్ పిల్లల తరహాలో రనౌట్ అయ్యారన్నాడు. "రనౌట్ల విషయంలో స్కూల్ విద్యార్థులు చేసే పొరపాట్లను, భారత బ్యాట్స్‌మెన్ చేయడం బాధించింది. ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆటగాళ్లకు సూచించాను." అని వాండరర్స్‌లో ప్రాక్టీస్ అనంతరం మీడియాకు తెలిపాడు. ఇక జట్టు కూర్పుపై వస్తున్న విమర్శలను పట్టించుకోమని...విమర్శకులు పనిగట్టుకుని వారికి తోచినట్టు మాట్లాడుతారని, అవి తమపై ఎటువంటి ప్రభావం చూపించవని స్పష్టం చేశాడు. అయితే తమ జట్టు మరో పదిరోజుల ముందే పర్యటనకు వచ్చి ఉంటే ఎక్కువ ప్రాక్టీస్ దొరికేదని, పరిస్థితులు మెరుగ్గా ఉండేవని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు.

క్లీన్ స్వీప్ చేస్తాం: ఫిలాండర్

భారత్‌ను మూడో టెస్టులోనూ ఓడించి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేస్తామని దక్షిణాఫ్రికా పేసర్ ఫిలాండర్ హెచ్చరించాడు. టెస్టుల్లో నంబర్ వన్ ర్యాంకును దక్కించుకోవడమే తమ లక్ష్యమని అందుకోసం ప్రతీ మ్యాచ్‌ను గెలిచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పాడు. 'టెస్ట్ సిరీస్‌ను ఇప్పటికే గెలిచినా, మూడో టెస్ట్‌ను కూడా మాకు ముఖ్యమే. ప్రతీ మ్యాచ్‌ను గెలువడమే మా లక్ష్యం'అని ఫిలాండర్ తెలిపాడు.



మిథాలీసేనకు సచిన్ సలహాలు

ముంబై: కీలకమైన దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు భారత మహిళల క్రికెట్ జట్టుకు దిగ్గజ సచిన్ టెండూల్కర్ విలువైన సలహాలు, సూచనలు ఇచ్చాడు. సోమవారం ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ)కు చెందిన బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో మిథాలీసేనతో మాస్టర్ దాదాపు గంటసేపు గడిపాడు. సఫారీ పర్యటనలో ఒత్తిడికి గురికాకుండా ఎలా ఆడాలో ఈ సందర్భంగా చెప్పుకొచ్చాడు. సిరీస్ సన్నద్ధతపై క్రికెటర్లు మాస్టర్‌ను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సచిన్ సరదాగా వారితో కలిసి సెల్ఫీలు దిగాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా మిథాలీసేన..మూడు వన్డేలతో పాటు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. వన్డే సిరీస్ వచ్చే నెల 5న కింబర్లీలో మొదలవుతుంది.



భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్..ప్రముఖ టైర్ల కంపెనీ సియెట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. రెండేండ్ల పాటు ఈమె సియెట్‌బ్యాట్‌తోనే అన్ని ఫార్మాట్లలో ఆడనున్నది. ఈ ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారత మహిళా క్రికెటర్‌గా హర్మన్ రికార్డులకెక్కి రోహిత్, రహానే, ఇషాన్ కిషన్ సరసన చేరింది.

ముంబైపై పంజాబ్ విజయం

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్(పీడబ్ల్యూఎల్)లో సోమవారం జరిగిన పోరులో పంజాబ్ రాయల్స్ 5-2తో ముంబై మహారథిపై ఘనవిజయం సాధించింది. జెనో పెత్రిశ్వీ 7-0తో ముంబై రెజ్లర్ సతేంద్ర మాలిక్‌ను చిత్తు చేయడం పంజాబ్ గెలుపులో కీలకమైంది. ఈ విజయం ద్వారా ముంబై మహారథి సెమీఫైనల్ అవకాశాలకు పంజాబ్ గండికొట్టింది. దీపక్ పూనియా(92కి), ఫాంటా ల్యాబ్రిక్(76కి), పూజ ధండా(57కి), అనస్తిజ(62కి) పంజాబ్ తరపున విజయాలు సాధించారు.

ప్యాడ్‌లపై పన్ను.. వయాగ్రాపై లేదు!

అంగస్తంభన సమస్యలతో బాధపడే వృద్ధనేతలే దీనికి కారణం: ట్వింకిల్‌ఖన్నా



న్యూఢిల్లీ: అమెరికాలో మహిళలు వినియోగించే శానిటరీ నాప్కిన్ల (ప్యాడ్) వంటి ఉత్పత్తులపై పన్నులు విధిస్తున్నారుగానీ, పురుషులు అంగస్తంభన సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించే వయాగ్రాపై మాత్రం పన్నులు వేయటం లేదని ప్రముఖ కాలమిస్టు ట్వింకిల్‌ఖన్నా బీబీసీ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అంగస్తంభన సమస్యలతో బాధపడే 65 ఏండ్లకు పైబడిన వృద్ధులు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవటమే దీనికి కారణమని ఎద్దేవా చేశారు. భారత్‌లో కూడా శానిటరీ నాప్కిన్స్‌పై పన్ను విధించటాన్ని ట్వింకిల్ విమర్శించారు. 'భారత్‌లో శానిటరీ నాప్కిన్లపై 12 శాతం పన్ను వేస్తున్నారుగానీ చీపుర్ల మీద మాత్రం పన్ను విధించటం లేదు. ఎందుకంటే, శరీరాన్ని శుభ్రంగా ఉంచుకునేకంటే ఇల్లును శుభ్రంగా ఉంచుకోవటం చాలా అవసరం' అంటూ దెప్పిపొడిచారు.

రాజీనామాకు సిద్ధపడ్డ ఏచూరి?

కోల్‌కతా, జనవరి 22: బీజేపీని ఓడించేందుకు 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టాలన్న తన ప్రణాళికను సీపీఎం కేంద్ర కమిటీ తిరస్కరించడంతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాజీనామాకు సిద్ధ పడ్డారు. తాను ప్రతిపాదించిన రాజకీయ తీర్మానం ఆదివారం వీగిపోతుందని శనివారమే గుర్తించిన ఏచూరి ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. కానీ సీపీఎం పొలిట్‌బ్యూరో అందుకు అంగీకరించలేదు. అయితే ఏచూరి రాజీనామాకు సిద్ధపడ్డారని పలువురు పార్టీ నేతలు ధ్రువీకరించారు. కానీ కేంద్ర కమిటీ సమావేశాల తర్వాత ఏచూరి మీడియాతో మాట్లాడుతూ తాను సీపీఎం పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీకి ప్రధాన కార్యదర్శినని సమాధానమిచ్చారు. ఇంతకు ముందు పుచ్చలపల్లి సుందరయ్య 1975లో సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ప్రతిపాదించిన తీర్మానం తిరస్కరణకు గురికావడంతో పదవికి రాజీనామా చేశారు.

'రిమోట్ సెన్సింగ్'లో సైంటిస్టులు

హైదరాబాద్, బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్ఎస్‌సీ)లో సైంటిస్ట్/ఇంజినీర్ - ఎస్‌సీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.




వివరాలు:

ఎన్ఆర్ఎస్‌సీ అనేది ఇస్రో పరిధిలోని సంస్థ. శాటిలైట్ డాటా సేకరణ, భద్రపర్చడం, నిర్వహించడం, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ తదితరాల కోసం దేశవ్యాప్తంగా ఐదు సెంటర్లు ఉన్నాయి. వాటిలో బాలానగర్ ఒకటి. మిగిలినవి బెంగళూరు, నాగపూర్, కోల్‌కతా, జోధ్‌పూర్, న్యూఢిల్లీలో ఉన్నాయి. వీటికి అనుబంధంగా షాద్‌నగర్‌లో ఎర్త్ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

- **పోస్టు:** సైంటిస్ట్/ఇంజినీర్ – ఎస్‌సీ
- **పేస్కేల్:** సైంటిస్ట్ ఎస్‌సీ పోస్టుకు రూ. 56,100
- సైంటిస్ట్ ఎస్‌డీ పోస్టులకు రూ. 67,000/-
- సైంటిఫిక్ అసిస్టెంట్ – రూ. 44,900/-
- విభాగాల వారీగా ఖాళీలు, అర్హతలు...
- సైంటిస్ట్ – 8
- **అర్హతలు:** ఎమ్మెస్సీ అగ్రికల్చర్ ఫిజిక్స్/ అగ్రికల్చర్ స్టాటిస్టిక్స్ లేదా అగ్రికల్చర్ మెట్రాలజీ లేదా సాయిల్ ఫిజిక్స్ లేదా ప్లాంట్ ఫిజియాలజీ లేదా తత్సమాన కోర్సులో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్ చదివి ఉండాలి. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- సైంటిస్ట్ – 2 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 65 శాతం మార్కులతో ఎంటెక్ హైడ్రాలజీ/వాటర్ రిసోర్సెస్‌తోపాటు ఫస్ట్‌క్లాస్ (65 శాతం)లో బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 3 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంటెక్ అప్లయిడ్ జియాలజీ/జియాలజీ లేదా తత్సమాన కోర్సు లేదా ఎమ్మెస్సీ/ఎమ్మెస్సీ టెక్నాలజీ ఇన్ అప్లయిడ్ జియాలజీ/జియాలజీ లేదా తత్సమాన కోర్సులో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత. డిగ్రీలో జియాలజీ లేదా తత్సమానకోర్సు.
- సైంటిస్ట్ – 1 పోస్టు
- **అర్హతలు:** బీఎస్సీ జాగ్రఫితోపాటు ఎమ్మెస్సీ జాగ్రఫి లేదా అప్లయిడ్ జాగ్రఫిలో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 8 ఖాళీలు
- **అర్హతలు:** రిమోట్ సెన్సింగ్/జియోమాటిక్స్/జీఐఎస్ లేదా జియోఇన్ఫర్మాటిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత. లేదా బీఈ/బీటెక్‌లో సివిల్ లేదా ఈసీఈ లేదా ఈటీఎం/సీఎస్ఈ/ఐటీలో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత. లేదా ఎమ్మెస్సీ మ్యాథ్స్/స్టాటిస్టిక్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ జాగ్రఫి లేదా జియాలజీలో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 8 పోస్టులు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్ కంప్యూటర్ ఇంజినీరింగ్/ఐటీతోపాటు 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో సీఎస్ఈ/ఐటీ ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 1 ఖాళీ
- **అర్హత:** బీఈ/బీటెక్ ఎలక్ట్రానిక్స్‌లో కనీసం 65 శాతం మార్కులతోపాటు ఎంఈ/ఎంటెక్‌లో మైక్రోవేవ్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 1 పోస్టు
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటేనెన్స్ ఇంజినీరింగ్ లేదా ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లేదా తత్సమాన సబ్జెక్టులో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 1 ఖాళీ
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎంటెక్/ఎంఎస్ ఫిజిక్స్/ కెమిస్ట్రీ లేదా మ్యాథ్స్/అట్మాస్ఫియరిక్ సైన్సెస్ లేదా తత్సమానకోర్సు ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 1 ఖాళీ
- **అర్హత:** పీహెచ్‌డీలో అట్మాస్ఫియరిక్ మోడలింగ్‌తో పాటు ఎంటెక్/ఎమ్మెస్సీ ఫిజిక్స్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- సైంటిస్ట్ – 1
- **అర్హత:** పీహెచ్‌డీ మెరైన్ బయాలజీతోపాటు పీజీలో మెరైన్ సైన్సెస్ చదివి ఉండాలి.
- సైంటిఫిక్ అసిస్టెంట్ – 2 ఖాళీలు
- **అర్హతలు:** బీఎస్సీ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 – 35 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోసడలింపు ఉంటుంది.
- **పనిచేయాల్సిన ప్రదేశం:** షాద్‌నగర్, బాలానగర్‌తో పాటు అవసరమైనప్పుడు దేశంలోని ఇస్రో, డీవోఎస్ సెంటర్లలో పనిచేయాల్సి ఉంటుంది.

- **ఎంపిక:** దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అకడమిక్ అర్హతలు, ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి రాతపరీక్ష/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. తర్వాత తుది ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 5
- **వెబ్‌సైట్:** https://nrsc.gov.in

జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో ప్రొఫెసర్లు



జోధ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం ఖాళీల సంఖ్య –121
- **విభాగాలవారీగా ఖాళీలు:** ప్రొఫెసర్స్–28, అడిషనల్ ప్రొఫెసర్స్–24, అసోసియేట్ ప్రొఫెసర్స్–45, అసిస్టెంట్ ప్రొఫెసర్స్–24.
- **విభాగాలు:** అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, కమ్యూనిటీ & ఫ్యామిలీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, ఎండోక్రినాలజీ అండ్ మెటబాలిజమ్, ఫోరెన్సిక్ మెడిసిన్/టాక్సికాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, నియోనాటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఒబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పిడియాట్రిక్ సర్జరీ, పాథాలజీ, పిడియాట్రిక్, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, సైకియాట్రీ, రేడియోగ్నసిస్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ట్రామా అండ్ ఎమర్జెన్సీ, యూరాలజీ
- **అర్హతలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ/ఎంఎస్)లో ఉత్తీర్ణత లేదా సంబంధిత విభాగం నుంచి పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగం నుంచి పీజీ పాటు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వంను కలిగి ఉండాలి. సంబంధిత టీచింగ్/ రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.
- **ప్రొబేషనరీ పీరియడ్:** రెండేండ్లు
- **ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4) :** రూ.37,400–67,000+గ్రేడ్ పే రూ. 10,500/–
- **అడిషనల్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4) :** రూ.37,400–67,000+ గ్రేడ్ పే రూ. 9,500/–
- **అసోసియేట్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4) :** రూ.37,400–67,000+ గ్రేడ్ పే రూ. 9,000/–
- **అసిస్టెంట్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 3) :** రూ.15,600–39,100+ గ్రేడ్ పే రూ. 8,000/–
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.3000/–, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1000/–
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 12
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

ఎన్‌బీఆర్ఐలో

లక్నోలోని నేషనల్ బొటానికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌బీఆర్ఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్/ సీనియర్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌బీఆర్ఐ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న అనుబంధ సంస్థ.

- మొత్తం పోస్టులు: 8 (సైంటిస్ట్–3, సీనియర్ సైంటిస్ట్–5)
- అర్హత: ఎమ్మెస్సీ లేదా పీజీతోపాటు పీహెచ్‌డీ ఉండాలి.
- వయస్సు: 32 ఏండ్లు (సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏండ్లు) మించరాదు.
- ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 26
- వెబ్‌సైట్ : www.nbri.res.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఐఏబీలో జేఆర్ఎఫ్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్ఐఏబీ అనేది అటానమస్ సంస్థ. ఇది మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిధిలో పనిచేస్తుంది.

- పోస్టు పేరు: జేఆర్ఎఫ్
- ఎన్ఐఏబీలో జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్–4
- అర్హత: లైఫ్ సైన్సెస్‌లో మాస్టర్ డిగ్రీతోపాటు నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. బయోఇన్ఫర్మాటిక్స్ /కంప్యూటేషనల్ బయాలజీ/కంప్యూటర్ సైన్స్‌తో నెట్‌లో అర్హత సాధించాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- చివరితేదీ: జనవరి 25
- వెబ్‌సైట్: www.niab.org.in

ఎన్‌సీఈఆర్‌టీలో జూనియర్ అకౌంటెంట్లు

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లో ఖాళీగా ఉన్న జూనియర్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- పోస్టు పేరు: జూనియర్ అకౌంటెంట్–6
- అర్హత: కామర్స్/ఎకనామిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా ఏదైనా డిగ్రీతోపాటు ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ/డిప్లొమాలో ఉత్తీర్ణత.
- వయస్సు 30 ఏండ్లకు మించరాదు.
- పే స్కేల్: రూ. 9300–34800+ గ్రేడ్ పే రూ. 4200/–
- అప్లికేషన్ ఫీజు: రూ. 200/–
- ఎంపిక: రాతపరీక్ష ద్వారా
- చివరితేదీ: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (జనవరి 20–26) వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తులను పంపాలి.
- వెబ్‌సైట్: www.ncert.nic.in

'సెంట్రల్ సాల్ట్ &మెరైన్'లో

సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) ఖాళీగా ఉన్న సీనియర్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీఎస్ఎంసీఆర్ఐ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ.



- పోస్టు పేరు: సైంటిస్ట్/సీనియర్ సైంటిస్ట్–7
- సైంటిస్ట్ : 32 ఏండ్లకు మించరాదు.
- పే స్కేల్: రూ. 15,600–39100 + గ్రేడ్ పే రూ. 6600/–
- సీనియర్ సైంటిస్ట్: 37 ఏండ్లకు మించరాదు.
- పే స్కేల్: రూ. 15,600–39,100 + గ్రేడ్ పే రూ. 7600/–
- అర్హత: ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)తోపాటు పీహెచ్‌డీ
- అప్లికేషన్ ఫీజు: రూ. 100/–(డీడీ రూపంలో)
- ఎంపిక: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 31
- వెబ్‌సైట్ : www.csmcri.org